




www.andhrajyothy.com

వెల (Price) : Rs. 6.50

విజయవాడ సిటీ*

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

పేజీలు: 14 + 20

సంపుటి (Volume) : 60
సంచిక (Issue) : 190








శుక్రవారం | 25-10-2019

శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి రా. 7.09 తదుపరి త్రయోదశి; నక్షత్రం: పుబ్బ ఉ. 11.01 తదుపరి ఉత్తర; వర్జ్యం: సా. 5.27-6.52; దుర్ముహూర్తం: ఉ. 8.33-9.19, మ. 12.23-1.09; అమృతఘడియలు: తె. ఉ. 6.40, రా. 2.01-3.27; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.15; సూర్యాస్తమయం: 5.44

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai




# కమలమే; కానీ..

## మహారాష్ట్రలో కూటమికే మెజారిటీ

## హరియాణాలో భారీ హంగామా

## మెజారిటీకి 6 సీట్ల దూరంలో బీజేపీ

మహారాష్ట్రలో భారీగా తగ్గిన సీట్లు.. ఎన్సీపీ, కాంగ్రెస్‌కు పెరిగిన బలం

కమలం పార్టీని దెబ్బకొట్టిన రెబల్స్.. ఏడుగురు మంత్రుల పరాజయం



| మహారాష్ట్ర 288 | | |
|---|---|---|
| బీజేపీ | 161 | -25 |
| కాంగ్రెస్ | 98 | +17 |
| మజ్లిస్ | 2 | +1 |
| ఇతరులు | 27 | +7 |

| హరియాణా 90 | | |
|---|---|---|
| బీజేపీ | 40 | -7 |
| కాంగ్రెస్ | 31 | +16 |
| జేజేపీ | 10 | +10 |
| ఇతరులు | 9 | -19 |

### హరియాణాలో కంగుతిన్న బీజేపీ

మెజారిటీకి దూరం.. అతిపెద్ద పార్టీ స్థానం

అయినా అధికారం దక్కడం ఖాయమే!

దుష్యంత్ పార్టీకి 10 సీట్లు, ఇతరులకు 9

ప్రభుత్వ ఏర్పాటులో వీరి పాత్రే కీలకం

13



సైదిరెడ్డికి స్వీటు తినిపిస్తున్న భార్య

హుజూర్‌నగర్‌పై | టీఆర్ఎస్ ఘన విజయం

## గులాబీ జెండా

### 43,358 మెజారిటీ

కంచుకోటలో కాంగ్రెస్‌కు ఘోర పరాభవం

రెండోస్థానంలో పీసీసీ చీఫ్ ఉత్తమ్ సతీమణి

డిపాజిట్లు దక్కని టీడీపీ, బీజేపీ అభ్యర్థులు

కమలానికి స్వతంత్రుడికన్నా తక్కువ ఓట్లు

ఈవీఎంల ట్యాంపరింగ్ అంటున్న విపక్షం

వీవీప్యాట్ స్లిప్పులు లెక్కించాలని డిమాండ్

12

# అయ్యో.. ఆర్థికం!

## అత్యంత దయనీయంగా పరిస్థితి

అక్టోబరు నెల జీతాలకు అప్పులే గతి!

దడపుట్టిస్తున్న కొత్త పథకాల చెల్లింపులు

జాబితాలో నేతన్న నేస్తం, మత్స్యకారుల భృతి

జనవరిలో అమ్మ ఒడి, 'భరోసా' రెండో విడత

అప్పు ఇచ్చేందుకు బ్యాంకుల వెనుకంజ

రూ.3వేల కోట్ల కోసం ఒకరితో సంప్రదింపులు

వెయ్యి కోట్లు ఇస్తామంటూనే మెలిక

ఆదాయం తగ్గుతోంది. అప్పు పుట్టడం లేదు. 'చెల్లింపుల' జాబితాలో కొత్త పథకాలు వచ్చి చేరుతున్నాయి. ఆర్బీఐ ద్వారా బాండ్లు వేలం వేసి సొమ్ములు సేకరించే మార్గమూ మూసుకుపోతోంది. ఇదీ ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి. వస్తున్న ఆదాయమంతా జీతాలు, పెన్షన్లు, రుణాల తిరిగి చెల్లింపులకే సరిపోతోంది. మధ్యలో సంక్షేమ పథకాలకు నిధులు సమకూర్చాలంటే... అంతే సంగతులు!




(అమరావతి - ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రభుత్వ పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్లు విడుదల చేయాలన్నా, నవ రత్నాల్లోని పథకాలకు నిధులు ఇవ్వాలన్నా, ఆపడానికి వీల్లేని మధ్యాహ్న భోజన పథకం, తాగునీరు, ఉపకార వేతనాలు, ఆరోగ్య శ్రీకి బిల్లులు చెల్లించాలన్నా ఏదో ఒక బ్యాంకు కరుణించాల్సిందే! రుణం ఇవ్వాల్సిందే! బ్యాంకుల నుంచి కొత్తగా అప్పులు తెచ్చుకోవడానికి ఆర్థిక శాఖ తీవ్రంగా ప్రయత్నిస్తున్నా తగిన ఫలితం లభించడం లేదు. ఎన్నికల ముందు ఎస్‌బీఐ రాష్ట్రానికి రూ.3,000 కోట్ల రుణం ఇచ్చింది. ఇటీవల సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన జరిగిన ఎస్ఎల్‌బీసీ సమావేశంలో గత ప్రభుత్వ హయాంలో బ్యాంకులు ఇచ్చిన రుణాల తిరిగి చెల్లింపుపై హామీ లభించలేదు. దీంతో ఇటీవల పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రుణం ఇవ్వడానికి ఎస్‌బీఐ వెనుకంజ వేసింది. "ఇప్పుడు మీ ప్రభుత్వానికి ఇచ్చిన రుణాలు వచ్చే ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారితే తిరిగి చెల్లిస్తారో లేదో" అని సందేహం వ్యక్తం చేసింది. ఇతర బ్యాంకులూ ఎస్‌బీఐ బాటలోనే పయనిస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. తాజా పరిస్థితుల నేపథ్యంలో... ఆర్థిక శాఖ మరో రూ.3000 కోట్ల రుణం కోసం మరో బ్యాంకును సంప్రదించినట్టు తెలిసింది. ఈ బ్యాంకును కేంద్రం ఇటీవలే మరో బ్యాంకులో

మిగతా 8వ పేజీలో...

తగ్గిన రవాణా

## ఆదాయం

భారీగా పడిపోయిన వాహన కొనుగోళ్లు

ఇసుక కొరత, రివర్స్ టెండరింగులతో

కుదేలైన రవాణా రంగం.. లక్ష్యం 4 వేల కోట్లు

6 నెలల్లో వచ్చింది రూ.1500 కోట్లు

ఆటో డ్రైవర్లకు సాయం... అదనపు ఖర్చు

3

## తలసరిలోనూ రివర్స్

17 వేలు తగ్గిన ఆదాయం.. వైసీపీ అసమర్థతతోనే

8 శాతానికి పడిపోయిన వృద్ధి రేటు

అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థిక స్థితిపై చర్చకు సిద్ధం

సంక్షేమ రంగాన్ని విస్మరించిన జగన్ సర్కార్

బొత్స వ్యాఖ్యలను పట్టించుకోనక్కర్లేదు

యనమల, ఆనందబాబు, కనకమేడల

9






# మీ వైఖరి ఏమిటి?




'రాజధాని'పై ఏం చేయాలనుకుంటున్నారు?

పనుల్లో జాప్యంతో హైకోర్టులో సమస్యలు

లాయర్లకు కనీసం టీ దొరకడంలేదు

జడ్జిల క్వార్టర్లు ఇప్పటిదాకా నిర్మించలేదు

పనులు మీరు చేస్తారా.. ఆదేశాలు ఇవ్వాలా?

రెండు వారాల్లో తేల్చి చెప్పండి: హైకోర్టు

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): "జడ్జీలు గెస్ట్‌హౌస్‌లలో తల దాచుకుంటున్నారు. వారికి ఇప్పటిదాకా క్వార్టర్లు నిర్మించలేదు. న్యాయవాదులకు కనీస సదుపాయాల్లేవు. లాయర్లు కప్పు టీ దొరక్క అల్లాడిపోతున్నారు. తగిన ఏర్పాట్లు చేసి తీరాల్సిందే. లేకుంటే మేమే ఆదేశాలు జారీ చేస్తాం" అని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం సర్కారుకు స్పష్టం చేసింది. రాజధాని నిర్మాణ పనుల్లో జాప్యంపై హైకోర్టు ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. పనుల పూర్తి కోసం ఇంకెంత కాలం వేచి ఉండాలని నిలదీసింది. పనులు మీరు చేస్తారా? లేక మమ్మల్ని ఆదేశించమంటారా? అని సూటిగా ప్రశ్నించింది. మాజీ సీఎం, ప్రస్తుత సీఎం అజెండాలతో తమకు సంబంధం లేదని... చట్టంతో మాత్రమే సంబంధమని పేర్కొంది. రాజధాని నిర్మాణం, స్విస్ చాలెంజ్ విధానంపై రెండు వారాల్లోగా తేల్చి చెప్పాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్

మిగతా 2వ పేజీలో...









## 4 నెలల్లో రెండేళ్లు వెనక్కి!

టీడీపీపై కక్షతో

కార్మికుల పొట్టగొట్టారు

ఇసుక లేక లక్షల మంది

ఉపాధి కోల్పోయారు

వైసీపీ ప్రభుత్వంపై

పవన్ ఆగ్రహం

9






పరంజ్యోతి

# భగవంతుడు ఎవరిని ఇష్టపడతాడంటే..

*అహమాత్మా గుడాకేశ! సర్వభూతాశయ స్థితః*

..'ఓ అర్జునా! సమస్త ప్రాణుల హృదయములయందున్న ఆత్మను నేనే' అని ఈ గీతావాక్యానికి అర్థం. భగవంతుడు సర్వప్రాణులయందు సమభావంతోనే ఉంటాడు. 'నేను సకల ప్రాణుల పట్లా సమభావంతోనే ఉంటాను' అని గీతాచార్యుడే స్వయంగా చెప్పాడు. మరి అదే భగవానుడు 'ఇదుగో.. ఇలా ఉండేవాడు నాకిష్టుడు' అని అర్థం వచ్చేలా మరో శ్లోకంలో (యోమద్భక్త సమే ప్రియః) చెప్పడం మనకు వింతగా, సందేహం కలిగించేదిగా ఉండడం సహజం. భగవంతుడు పక్షపాతరహితుడే, రాగద్వేషాలకతీతుడే, సుఖదుఃఖాలకు చలించనివాడే, అయినా... కొన్ని విశేష సందర్భాల్లో కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో కొందరంటే ఇష్టపడతాడు. వారెవరో తానే స్వయంగా చెప్పాడిలా..

*మమ మద్భక్త భక్తేషు ప్రీతిరభ్యధికో భవేత్*
*తస్మాత్ మద్భక్త భక్తాశ్చ పూజనీయా విశేషతః*

"నా భక్తుల పట్ల నాకు వాత్సల్యం ఉన్నా, నిజానికి నాకు నా భక్తుల భక్తులన్నా, నా భక్తుల, భక్తుల సేవకులన్నా మరీ మరీ ఇష్టం వారు కూడా పూజ్యులే, విశేషంగా ఆరాధించదగిన వారే" అని దీని అర్థం. మనం లోకంలోతరచూ ఒక నానుడి వింటూ ఉంటాం, 'అసలు కన్నా వడ్డీ ముద్దు' అని. అదే విధంగా భగవంతుడు కూడా తనకు ప్రియమైన వారి దాసులను, వారి సేవకులను మరింతగా ఇష్టపడతాడు. శ్రీ వైష్ణవ సంప్రదాయపరులు అందుకే తమను నారాయణ దాసులుగా కాక, భగవద్భక్తుడైన రామానుజుడి పేరిట.. 'రామానుజ దాసులు'గా వినమ్రతతో పరిచయం చేసుకుంటారు.

*సిద్ధిర్భవతి వా నేతి సంశయోచ్యుత సేవినాం।*
*న సంశయోస్తి తద్భక్త పరిచర్య రతాత్మనాం॥*

ఆ పరమాత్మను నేరుగా ఆరాధించేవారికి ముక్తి లభిస్తుందో లేదోగానీ.. త్రికరణశుద్ధిగా భగవంతున్ని నమ్మి, సదా దైవారాధనలో, భాగవత సేవలో ఉండే ఆచార్యులను గనక ఆశ్రయించేవారికి నిస్సందేహంగా ముక్తి లభిస్తుందని పెద్దలు నిర్ద్వంద్వంగా ప్రకటిస్తూ ఉంటారు. అలాగే తనకంటూ శత్రువులు ఎవ్వరూ లేకున్నా.. తన భక్తులను ఇబ్బంది పెట్టే వారిని ఆ భగవంతుడు తన శత్రువులుగానే భావిస్తాడు. ఏ పరిస్థితుల్లోనైనా సమబుద్ధితో ఉండేవారిని, తన గురించి తక్కువగా లోకహితం గురించి ఎక్కువగా ఆలోచించేవారిని, తన భక్తులకు, ఆ భక్తుల భక్తులకు సేవలందించేవారిని అంతటా, అన్నిటా భగవతత్త్వాన్ని దర్శించేవారిని, లభించిన విలువైన జీవితాన్ని వరంగా భావించి, సేవచేయడంలోను, ఆధ్యాత్మిక విలువలతోను, వివేక, విచక్షణలతో జీవించే వారిని భగవంతుడు ఎక్కువగా ఇష్టపడతాడని గ్రహించాలి. ఆయనే మనల్ని ఇష్టపడేట్టుగా మనల్ని తరింపచేసేట్లుగా మనం జీవితాల్ని మలచుకోవాలి.



- డా॥ మరింగంటి లక్ష్మణాచార్యులు, 96402 33930

## రాష్ట్రంలో తొలి ఎయిర్‌బస్!

▸ **27 నుంచి విజయవాడ-తిరుపతికి శ్రీకారం**

విజయవాడ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలి అంతర విమాన సర్వీసుగా విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి తిరుపతికి ఈ నెల 27 నుంచి ఎయిర్‌బస్ ప్రారంభం కానుంది. రాష్ట్రంలో విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి తదితర విమానాశ్రయాల నుంచి ఇప్పటి వరకు రాష్ట్రీయంగా భారీ ఎయిర్‌బస్‌లు తిరగలేదు. దేశంలో విజయవాడ నుంచి ఢిల్లీకి ఎయిర్‌బస్ విమానం తిరుగుతోంది. జాతీయ స్థాయిలో అనేక ఎయిర్‌బస్‌లు తిరుగుతుంటాయి. అంతరరాష్ట్ర సర్వీసుగా మాత్రం ఏపీలో ఇదే తొలి ఎయిర్ బస్ కావడం గమనార్హం. ఢిల్లీ నుంచి విజయవాడ వచ్చే విమాన సర్వీసును వారంలో మూడు రోజుల పాటు విజయవాడ-తిరుపతి నడిపిన తర్వాత విజయవాడ-ఢిల్లీ సర్వీసును నడపాలని ఎయిర్ ఇండియా భావిస్తోంది. విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి విమాన సర్వీసులను పెంచేందుకు ఎయిర్‌పోర్టు అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవలే స్థానికంగా ఎయిర్‌లైన్స్ సంస్థల సమావేశాన్ని నిర్వహించిన తర్వాత ఎయిర్ ఇండియా నుంచి ఈ ప్రతిపాదన వచ్చింది. 180 సీటింగ్‌తో వచ్చే ఎయిర్‌బస్ చార్జీలు కూడా తక్కువగానే ఉంటుందని, తిరుపతికి రూ.2500 మించదని తెలుస్తోంది.

## ఆర్టీసీ విలీనానికి మరో కమిటీ

అమరావతి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు రవాణా కార్పొరేషన్‌ను ప్రజా రవాణా సంస్థ(పీటీడీ)గా ఏర్పాటు చేసే చర్యలు ఈ నెల 10న ఏర్పాటైన రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు నేతృత్వంలోని కమిటీ చేపట్టింది. ఎండీ నుంచి కార్మికుడి వరకూ ఎవరి పోస్టుకు ఏ పేరు నిర్ణయించాలనే అంశంపై కొలిక్కి తెచ్చింది. సిబ్బంది జీత భత్యాలు, పెన్షన్, ఇతర సర్వీస్ రూల్స్ విషయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా సకాలంలో ప్రక్రియ పూర్తి చేసేందుకు ఏడుగురు సభ్యులతో ప్రభుత్వం తాజాగా మరో కమిటీని ఏర్పాటు చేసింది. ఆర్థిక, సాధారణ పరిపాలన, రవాణా, న్యాయశాఖ ఉన్నతాధికారులతో ఏర్పాటైన ఈ కమిటీని వర్కింగ్ గ్రూప్‌గా నిర్ణయించారు. ప్రజా రవాణా శాఖ ఏర్పాటు, అధికారుల పోస్టులు, జీతాల చెల్లింపు, పే స్కేల్ వంటి అంశాల్లో అనుసరించాల్సిన నిబంధనలు తదితరాలపై విధివిధానాలు ఈ కమిటీ నిర్ణయిస్తుంది. నవంబరు 15లోగా కమిటీ ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది.

# మెయిన్స్‌పై 'లీకేజీ' భయం!

## పరీక్షల రీషెడ్యూల్‌పై నోరు మెదపని ఏపీపీఎస్సీ

- ▸ **ఇప్పటికే ప్రశ్నపత్రాల సెట్టింగ్ పూర్తి**
- ▸ **రూపకల్పన, భద్రతపై అనుమానాలు**
- ▸ **'సచివాలయ' ప్రశ్నపత్రాల లీక్‌తో అప్రతిష్ఠ**
- ▸ **అది పునరావృతం కాకూడదనే వాయిదా!**
- ▸ **హడావుడిగా నిర్వహిస్తే అక్రమాలకు చాన్సు**
- ▸ **సభ్యులు, సిబ్బంది మధ్య సమన్వయ లేమి**
- ▸ **తప్పులు చేసిన వారిపై చర్యలు లేవు**
- ▸ **పూర్తిస్థాయిలో కమిషన్ ప్రక్షాళన తప్పదు!**
- ▸ **అప్పటిదాకా రీషెడ్యూల్‌కు ప్రభుత్వ సూచన**




అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగ పరీక్షల ప్రశ్నపత్రాల లీకు ఉదంతంతో అప్రతిష్ఠ మూటకట్టుకున్న నేపథ్యంలో అలాంటి పరిస్థితి ఏపీపీఎస్సీ పరీక్షల్లో పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. 'సచివాలయ' ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం ఏపీపీఎస్సీ కేంద్రంగా సాగినట్లు ఆరోపణలు రావడంతో.. త్వరలో జరగాల్సిన మెయిన్స్ పరీక్షల ప్రశ్నపత్రాల భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని కమిషన్‌కు సూచించినట్లు తెలిసింది. లీకేజీ భయంతోనే ఏపీపీఎస్సీ మెయిన్స్ పరీక్షలను రీషెడ్యూల్ చేస్తున్నట్లు తెలుస్తోంది. 2018లో విడుదల చేసిన పలు నోటిఫికేషన్లకు సంబంధించిన పరీక్షల ప్రశ్నపత్రాల సెట్టింగ్ ఇప్పటికే పూర్తయింది. సచివాలయ పరీక్షల ప్రశ్నపత్రం ఉదంతం దరిమిలా.. ఏపీపీఎస్సీ పరీక్షల ప్రశ్నపత్రాల రూపకల్పన, భద్రతపైనా నిరుద్యోగులు అనుమానించే ప్రమాదం ఉన్నందున వాటిని నివృత్తి చేసుకునే వరకు పరీక్షలను వాయిదా వేయడమో, రీషెడ్యూల్ చేయడమో చేయాలన్నది సర్కారు అభిమతంగా తెలుస్తోంది. గతంలో ఇచ్చిన తేదీల్లో త్వరపడి పరీక్షలు నిర్వహిస్తే.. ఏ కారణం చేతనైనా అక్రమాలు జరిగితే ప్రతిష్ఠ దెబ్బతింటుందని ప్రభుత్వం భయపడుతున్నట్లు సమాచారం. కమిషన్‌కు, సిబ్బందికి మధ్య సమన్వయం లేకపోవడం వల్ల భర్తీ సవ్యంగా జరగడం లేదన్న అభిప్రాయాలు ఉన్నాయి. పలువురు సభ్యులు నిర్లిప్తంగా.. నిరుద్యోగుల అనుమానాల నివృత్తిలో అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయాలు ఉన్నాయి.

### ఆ పరీక్షలే పూర్తికాలేదు..

ప్రభుత్వ ఆదేశాల మేరకు..

### పారదర్శకత కరువు..

2020లో చేపట్టబోయే రిక్రూట్‌మెంట్లకు సంబంధించి జనవరిలో ఏపీపీఎస్సీ క్యాలెండర్‌ను విడుదల చేయాల్సి ఉంది. అయితే.. 2018లో విడుదల చేసిన నోటిఫికేషన్ల తాలూకు చాలా ఉద్యోగాలకు ఇంకా మెయిన్స్ పరీక్షలు పూర్తి కాలేదు. వచ్చే ఏడాది మార్చికి గానీ ఇవి పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. పాత రిక్రూట్‌మెంట్లు పూర్తి కాకుండా కొత్త నోటిఫికేషన్లు ఇవ్వాల్సిన సందర్భంలో పోస్టుల ఖాళీల నిర్ధారణలోనూ ఇబ్బందులు తలెత్తవచ్చు. ఇదిలా ఉండగా.. 2020 జనవరి 1 నుంచి ఏపీపీఎస్సీ చేపట్టే రిక్రూట్‌మెంట్లన్నింటికీ ఇంటర్వ్యూలు ఉండబోవని ప్రభుత్వం ప్రకటించింది. నిర్ణీత షెడ్యూల్‌ను పాటించకుండా ఏపీపీఎస్సీ తరచూ పరీక్షలను వాయిదా వేస్తుండడం, రీషెడ్యూల్ చేస్తుండడంపై నిరుద్యోగుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయడానికి కారణాలను వివరించకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఒకే విద్యార్హత ఉన్న వివిధ పరీక్షలకు మధ్య గ్యాప్ తక్కువగా ఉన్నందున ప్రిపరేషన్‌కు సమయం చాలదని.. తాము నష్టపోకుండా ఉండేందుకు కొన్ని పరీక్షలను వాయిదా వేయాలని నిరుద్యోగులు మొరపెట్టుకున్న సందర్భాల్లో ఏ మాత్రం పట్టించుకోని ఏపీపీఎస్సీ.. ఇటీవల కాలంలో ఎన్నో పరీక్షలను ఏకబిగిన రీషెడ్యూల్ చేస్తూ వస్తోంది. గతంలో ఫలానా పరీక్షలను వాయిదా వేస్తున్నామని చెబుతూనే అందుకు కారణాలను కూడా తెలిపేవారు. ఇప్పుడు వాయిదాకు, రీషెడ్యూలింగ్‌కు కారణాలు చెప్పడం కమిషన్ మానేసింది.

ఏపీపీఎస్సీ వ్యవహార శైలి వల్ల కోర్టుల్లో కేసులు పడుతున్నాయని, పారదర్శకత కొరవడుతోందని పలువురు పేర్కొంటున్నారు. వివిధ ఉద్యోగాలకు విద్యార్హతల విషయంలో కొంత గందరగోళం నెలకొంది. ప్రశ్నపత్రాల రూపకల్పనలోనూ సందేహాలే. ప్రశ్నల్లో తప్పులు, సమాధానాల్లో తప్పులు ఏపీపీఎస్సీలో రొటీన్‌గా మారాయి. తప్పులు చేసిన వారిపై చర్యలు తీసుకునే పరిస్థితి లేదు. అదేమంటే ప్రాథమిక కీ, ఫైనల్ కీ ఇస్తున్నాం కదా అభ్యంతరాలుంటే పంపుకోండి అన్న సమాధానమే కమిషన్ నుంచి వస్తోంది. ఈ నేపథ్యంలో ఏపీపీఎస్సీ పనితీరును పూర్తిగా ప్రక్షాళన చేయాలన్న సూచనలు కూడా అందుతున్నట్లు సమాచారం.

# 'సచివాలయం'... సంక్లిష్టం!

- ▸ **కేటగిరీ-1 నియామకాల్లో తీవ్ర గందరగోళం**
- ▸ **రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించడంలో తడబాటు**
- ▸ **రెండో జాబితా తర్వాత కూడా భర్తీకాని పోస్టులు**
- ▸ **ఇతర జిల్లాలకు ఆప్షన్లు పెట్టడంతోనే సమస్యలు**
- ▸ **గ్రీవెన్స్‌ను పట్టించుకోని అధికారులు**

అమరావతి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ నియామకాల్లో గందరగోళం కొనసాగుతూనే ఉంది. జిల్లాల్లో రెండోవిడత కౌన్సిలింగ్ ప్రారంభమైనప్పటికీ సగంమంది అభ్యర్థులు కూడా హాజరవడం లేదు. ఇతర జిల్లాల్లో పోస్టింగ్ పొందిన అభ్యర్థులు సమాచారం ఇవ్వకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొన్నట్లు చెబుతున్నారు. ఈ నియామకాలకు సంబంధించి ఒక్కో జిల్లాల్లో ఒక్కో రకమైన సమస్యలతో అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో రెండో జాబితా కూడా గందరగోళంగా మారింది. కేటగిరీ-1 పోస్టుల నియామకాలు జిల్లా అధికారులకు పరీక్షగా మారాయి. ఒకే కేటగిరీలో నాలుగు పోస్టులు ఉండటం, దాదాపు పది రకాల రిజర్వేషన్ కేటగిరీలు ఉండటం, 12జిల్లాల నాన్‌లోకల్ అభ్యర్థులు ఉండటంతో ఎంపికలో తప్పులు దొర్లాయి. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అనుసరించి ఓపెన్ జనరల్, జనరల్, మహిళల పోస్టుల ఎంపిక అనంతరం రిజర్వేషన్ అభ్యర్థుల ఎంపిక చేయాల్సి ఉండగా, ఓపెన్‌లో పోస్టు సాధించే స్థాయి మెరిట్ వచ్చిన అభ్యర్థులకు కూడా రిజర్వేషన్ కోటాలోనే పోస్టింగులిచ్చారని ఆరోపణలొచ్చాయి. ఇదే విషయంలో పశ్చిమగోదావరి జిల్లాలో అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో తప్పులను చక్కదిద్దే పనుల్లో సిబ్బంది తలమునకలయ్యారు. కొందరు అభ్యర్థులు తమకు అవకాశమున్న పరీక్షలన్నీ రాశారు. వారిలో చాలామందికి రెండు, మూడు శాఖల్లో ఉద్యోగాలొచ్చాయి. అభ్యర్థి ఏ పోస్టులో చేరితే అది మినహా మిగిలిన పోస్టులు భర్తీ చేయాలి. ఇలాంటివారు వేలసంఖ్యలో ఉన్నారు. భారీ రిక్రూట్‌మెంట్ కావడంతో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌లో తప్పులు దొర్లాయి. ఇతర జిల్లాలకు చెందిన అభ్యర్థులు ఆప్షన్ పెట్టుకోవడంతో పలువురు నాన్‌లోకల్‌లో అర్హత సాధించారు. చాలామంది ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరవడంతో అధికారులు నియామక పత్రాలు జారీ చేశారు. వారంతా అక్కడ చేరుతున్నారా, లేక సొంత జిల్లాలో చేరతారా అనే విషయంలో స్పష్టత లేకపోవడంతో అయోమయ పరిస్థితి నెలకొంది.

### 13పోస్టులు... 166మందికి కాల్‌లెటర్లు

చిత్తూరు జిల్లాలో స్పోర్ట్స్‌కోటాలో పదుల సంఖ్యలో పోస్టులుంటే వందల మంది అభ్యర్థులకు కాల్‌లెటర్లు పంపించారు. ఉద్యోగాల్లో చేరినవారికి కూడా కాల్‌లెటర్లు వెళ్లాయి. కేటగిరీ-1లో తొలి జాబితాలో ఉద్యోగాలు పొందినవారికి రెండో జాబితాలోనూ స్థానం దక్కింది. పోస్టులు దక్కించుకున్న వారినే మళ్లీ పిలవడంతో తర్వాత ర్యాంకులు సాధించినవారికి అన్యాయం జరిగిందని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ఈ జిల్లాలో 670 పంచాయతీ కార్యదర్శి (గ్రేడ్-5) పోస్టులుంటే వాటిలో 13 స్పోర్ట్సు కోటాకు కేటాయించారు. రెండో జాబితాలో ఈ కోటాలో ఏకంగా 166మందిని పిలిచారు. వారిలో లోకల్ 53మంది, 113మంది నాన్‌లోకల్ అభ్యర్థులుండటం గమనార్హం.

### ముంచిన 'వెయిటేజీ'

అగ్రికల్చర్ అసిస్టెంట్ పోస్టుల కోసం రాత పరీక్షలు రాసిన ఎంపీఈఓ అభ్యర్థులు కొంతమంది దరఖాస్తులు అప్‌లోడ్ చేసుకునే సమయంలో వెయిటేజ్ కోసం ఆప్షన్ ఇవ్వలేదు. దీంతో అర్హత సాధించినప్పటికీ వారికి మెరిట్ లేక పోస్టులు పొందలేకపోయారు. అయితే ఇదే విభాగంలో ఫెయిలైన అభ్యర్థులకు ఈ వెయిటేజ్ కలిపి పోస్టులిచ్చారని చెబుతున్నారు. ఇలా పొరపాటున ఆప్షన్ పెట్టలేకపోయి నష్టపోయినవారు 165 మంది దాకా ఉన్నారు. ఇదే విషయమై వారంతా కలెక్టర్, పంచాయతీరాజ్ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసి మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదు.

## ఒక్క రోజు ధర్నాకు పది కోట్లా?

▸ **ఆ జీవో ఇచ్చింది ఎవరు?... ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు**

అమరావతి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను కేంద్రప్రభుత్వం నెరవేర్చడం లేదంటూ ఈ ఏడాది ఫిబ్రవరి 11న సీఎంగా ఉన్న చంద్రబాబు ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన ఒక్కరోజు 'ధర్మపోరాట దీక్ష'కు రూ.10 కోట్లు వ్యయం చేయడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ఇంత వ్యయం చేయడాన్ని సవాల్ చేస్తూ తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వేటుకూరి ఏవీఎస్ సూర్యనారాయణరాజు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఇది కేవలం అధికార పార్టీ రాజకీయ లబ్ధి కోసం చేపట్టిన దీక్ష అని, ఇందుకు ప్రజా ధనాన్ని వినియోగించడం సరి కాదని పేర్కొన్నారు. దీంతో... ఆ పది కోట్ల రూపాయల్ని కేటాయిస్తూ జీవో విడుదల చేసిన అధికారి ఎవరు? ఏ నిబంధనల మేరకు జీవో విడుదల చేశారని కోర్టు నిలదీసింది. సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ధర్నాకు ఇంత భారీ స్థాయిలో ఎలా ఖర్చు చేశారని ప్రశ్నించింది. దీనిపై పూర్తి వివరాలను తమ ముందుంచాలని ప్రధాన న్యాయమూర్తి జేకే మహేశ్వరి, జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులుతో కూడిన ధర్మాసనం ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను వచ్చే నెల 21కి వాయిదా వేసింది.

### బండ్ల గణేశ్‌కు రిమాండ్



కడప కోర్టుకు వచ్చిన బండ్ల గణేష్

కడప(లీగల్), అక్టోబరు 24: ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేశ్‌కు చెక్‌బౌన్స్ కేసులో కోర్టు రిమాండ్ విధించింది. ఫిర్యాదుదారుతో రాజీ కుదుర్చుకోవడంతో ఆ వెంటనే షరతులతో కూడిన బెయిలును మంజూరు చేసింది. కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం వేంపల్లెకు చెందిన బచ్చు మహేశ్ కుమార్ వద్ద రూ.10 లక్షలు బండ్ల గణేశ్ తీసుకున్నారు. చెల్లింపులకు ఆయన ఇచ్చిన రెండు చెక్కులూ బౌన్స్ కావడంతో కడప కోర్టులో కేసు వేశారు. కోర్టు రెండు సార్లు జారీ చేసిన నోటీసుకు గణేశ్ స్పందించలేదు. దీంతో ఆయనను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచాలని బంజారాహిల్స్ పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. పోలీసులు గురువారం బండ్ల గణేశ్‌ను కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ న్యాయస్థానం ఇన్‌చార్జి జడ్జి ఏకా పవన్ కుమార్ ముందు హాజరు పరిచారు. 10 రోజుల రిమాండ్‌కు జడ్జి ఆదేశించారు. ఈ ఆదేశాలపై స్పందించిన గణేశ్ ఫిర్యాదిదారు మహేశ్‌కుమార్‌తో రాజీ కుదుర్చుకున్నారు. చెల్లించాల్సిన మొత్తం రూ.10 లక్షల్లో రూ.4 లక్షలను వెంటనే ఇచ్చాడు. మిగిలిన డబ్బులను నవంబరు 4న చెల్లించేందుకు ఒప్పుకున్నాడు. దీంతో మహేశ్ న్యాయవాది బండ్ల గణేశ్‌కు బెయిల్ మంజూరు చేసేందుకు ప్రస్తుతానికి సమ్మతిస్తున్నట్లు కోర్టులో మెమో వేశారు.

### కన్‌ఫర్డ్ ఐఏఎస్‌లుగా ఆరుగురు ఆంధ్రా అధికారులు

న్యూఢిల్లీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆరుగురు గ్రూప్-1 సీనియర్ అధికారులకు ఐఏఎస్ నిర్ధారిస్తూ (కన్ఫర్డ్) కేంద్రం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో ఎస్ భార్గవి, బీఆర్ అంబేద్కర్, ఏ శిరి, జే వెంకటమురళి, ఎస్ రామసుందర్‌రెడ్డి, వీ వీరబ్రహ్మయ్య ఉన్నారు.

### వర్సిటీల పాలక మండళ్లలోకి ఉన్నత విద్యామండలి చైర్మన్?

అమరావతి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వర్సిటీల పాలక మండళ్లలో ఇకపై రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు కూడా ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. ఈ మేరకు త్వరలో ఆర్డినెన్స్ జారీచేయనుంది. దీంతో ఈసీలో ఎక్స్ అఫిషియో మెంబర్ల సంఖ్య ఆరుకు చేరనుంది.

**ఉన్నత విద్యా కమిషన్ కార్యదర్శిగా రాజశేఖరరెడ్డి**

రాష్ట్ర ఉన్నతవిద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ కార్యదర్శిగా ఎన్.రాజశేఖరరెడ్డి గురువారం తాడేపల్లిలోని కమిషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. విద్యా సంస్కరణల కమిటీలో ఆయన సభ్యునిగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ఉన్నతవిద్యామండలి కార్యదర్శిగానూ పనిచేశారు.

## భూకేటాయింపు రద్దును అడ్డుకోండి

- ▸ **మా వివరణ తీసుకోనేలేదు**
- ▸ **ఏపీఐఐసీ లేఖను రద్దుచేయండి**
- ▸ **మా హక్కుల్ని కొనసాగించండి**
- ▸ **హైకోర్టులో కేపీఐపీఎల్ పిటిషన్**

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గతంలో తమకు కేటాయించిన భూములను ప్రభుత్వం రద్దు చేయడాన్ని కృష్ణపట్నం ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ (కేపీఐపీఎల్) హైకోర్టులో సవాల్ చేసింది. భూములు వెనక్కి తీసుకుంటున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) తమకు రాసిన లేఖను రద్దు చేయాలని, ఆ భూముల విషయంలో ప్రతివాదులు జోక్యం చేసుకోకుండా అడ్డుకోవడంతో పాటు వాటిపై తమకున్న హక్కుల్ని కొనసాగించేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థిస్తూ కేపీఐపీఎల్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌వో) కె.గౌరి పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో ఏపీఐఐసీతో పాటు ఏపీఐఐసీ నెల్లూర్ జోనల్ మేనేజర్‌ను, రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక, పెట్టుబడుల శాఖ ముఖ్య కార్యదర్శిని ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిగే అవకాశం ఉంది. 'కృష్ణపట్నం పోర్టుకు అనుబంధంగా పరిశ్రమల అభివృద్ధి కోసం 6,284 ఎకరాల భూములు ఇవ్వాలని ఏపీఐఐసీ 2007లో నిర్ణయించింది. ఆ మేరకు 2008లో ఒప్పందం జరగ్గా.. అదే ఏడాది ఆగస్టు 22వ తేదీన నాటి ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీసులో సమీక్షా సమావేశం కూడా జరిగింది. ఇందులో భాగంగా మొత్తం 4,731.15 ఎకరాల భూమిని రూ.65,07,97,010కి మూడు విక్రయ దస్తావేజుల ద్వారా కొనుగోలు చేశాం. ముందస్తు ఒప్పందం మేరకు మిగిలిన 1,298 ఎకరాల భూమిని కూడా అప్పగించాలని అనంతర కాలంలో పలుమార్లు ఏపీఐఐసీని అభ్యర్థించాం. ఇందుకు సంబంధించి రాతప్రతులతో సంప్రదింపులు కూడా జరిపాం. అయినా ఇప్పటి వరకూ ఎలాంటి ఫలితం లేదు. ఈ నేపథ్యంలో వారం రోజుల్లోగా ఆడిట్ రిపోర్ట్ దాఖలు చేయాలంటూ గత నెల 9వ తేదీన ఏపీఐఐసీ మాకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. అందుకు మరికొంత గడువు కావాలని అభ్యర్థిస్తూ మేం అదే నెల 17న ఏపీఐఐసీకి లేఖ రాశాం. ఆ సంస్థ నుంచి ఎలాంటి స్పందనా లేదు. ఇంతలో ఈ నెల 11న తుది స్పందన కోరుతూ ఏపీఐఐసీ రాసిన లేఖ మాకు 16వ తేదీన అందింది. వివరణ ఇచ్చేందుకు మరో పది రోజులు గడువు కావాలని అదే రోజున మేం లేఖ రాశాం. కానీ మాకు కేటాయించిన భూముల్ని రద్దు చేస్తున్నట్లు ఈ నెల 19వ తేదీన లేఖ పంపారు. మా నుంచి ఎలాంటి వివరణా తీసుకోకుండానే భూముల్ని రద్దు చేస్తున్నట్లు లేఖ పంపారు. ఇది ఆస్తి బదలాయింపు చట్టానికి, రిజిస్ట్రేషన్ చట్ట నిబంధనలకు విరుద్ధం. అందువల్ల ఏపీఐఐసీ పంపిన లేఖను రద్దు చేయడంతో పాటు భూముల విషయంలో ఏపీఐఐసీ జోక్యం చేసుకోకుండా ఆదేశాలు జారీ చేయండి' అని కేపీఐపీఎల్ ఉన్నత న్యాయస్థానాన్ని అభ్యర్థించింది.

## మీ వైఖరి ఏమిటి?

(మొదటి పేజీ తరువాయి)

ఎనేబులింగ్ (ఏపీఐడీఈ) 2001 చట్టానికి 2017లో ఏపీ న్యాయశాఖ చేసిన సవరణను సవాల్ చేస్తూ 'ఫౌండేషన్ ఫర్ సోషల్ అవేర్‌నెస్ సొసైటీ' ప్రతినిధి వై.సూర్యనారాయణ మూర్తి, స్విస్ చాలెంజ్ విధానాన్ని సవాల్ చేస్తూ మాజీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు, ఏపీఐడీఈ చట్ట నిబంధనలకు విరుద్ధంగా జరిగిన రాజధాని పనుల ఒప్పందాలను రద్దు చేయాలని కోరుతూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులుతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. స్విజ్ చాలెంజ్ విధానంలో జరిగిన కాంట్రాక్టు పనుల్ని ప్రభుత్వం పునఃస్సమీక్షిస్తోందని, దీనిపై పూర్తి వివరాలు అందించేందుకు కొంత గడువు కావాలని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది కాసా జగన్మోహన్ రెడ్డి కోరారు. దీనిపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. "మీరు పరిశీలన చేస్తూ కాలయాపన చేస్తుంటే కోర్టు చూస్తూ ఊరుకోదు. పనులు నిలిచిపోవడంతో హైకోర్టులో సమస్యలు నెలకొన్నాయి. కార్లు పెట్టుకోవడానికి చోటు లేదు. కనీసం కూర్చోవడానికి కూడా తగిన జాగా లేదు. వీటన్నింటిపైనా ప్రతిరోజూ ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. మీరేం చేయదలచుకున్నారో, మీ వైఖరేంటో రెండు వారాల్లో స్పష్టం చేయండి. లేకుంటే మేం ఆదేశాలు జారీ చేస్తాం" అని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వ న్యాయవాది జోక్యం చేసుకుంటూ.. "ఉమ్మడి హైకోర్టును హడావుడిగా విభజించారు. దీనిపై కొంతమంది సుప్రీం కోర్టును ఆశ్రయించినా ఫలితం లేకపోయింది" అని తెలిపారు. 2వారాల్లోగా ప్రభుత్వ వైఖరేంటో చెప్పకపోతే మధ్యంతర ఉత్తర్వులిస్తామని, కావాలంటే సుప్రీంకోర్టుకు వెళ్లాలని కోర్టు స్పష్టంచేస్తూ 21వ తేదీకి వాయిదా వేసింది.

## లోకం తీరు




మున్ముందు ఏ గొడవ రాకుండా ఇప్పుడే చెరి సగం చేస్తున్నా మిత్రమా!

### చలి కాలం

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| హైదరాబాద్ | 23.4 | 31.0 |
| అనంతపురం | 23.0 | 31.6 |
| ఏలూరు | 23.0 | 30.0 |
| గుంటూరు | 23.4 | 30.9 |
| విశాఖపట్నం | 23.8 | 29.4 |
| నెల్లూరు | 23.8 | 30.8 |
| ఒంగోలు | 24.0 | 32.1 |
| విజయవాడ | 24.2 | 33.0 |
| కర్నూలు | 24.2 | 32.5 |
| కడప | 25.0 | 35.0 |
| శ్రీకాకుళం | 25.6 | 28.3 |



### త్వరలోనే పీవోకేలో మువ్వన్నెల రెపరెపలు

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో త్రివర్ణ పతాకం ఎగిరే రోజు ఎంతో దూరంలో లేదనిపిస్తోంది. దీనికోసమే శ్యామాప్రసాద్ ముఖర్జీ తన ప్రాణాలను సైతం త్యాగం చేశారు. జమ్ము కశ్మీర్‌లోని చెనాని-నశ్రీ సొరంగానికి శ్యామాప్రసాద్ పేరు పెట్టడం మోదీ ప్రభుత్వం ఆయనకిచ్చే ఘననివాళి. ఈ విషయంలో నెహ్రూ హయాంలో జరిగిన లోపానికి మా ప్రభుత్వం సరైన ప్రాయశ్చిత్తం చేసింది.

- జితేంద్రసింగ్, కేంద్రమంత్రి



### నిశబ్ద దేశభక్తితో అహంకార జాతీయవాదాన్ని ఓడించాలి

నిశబ్ద దేశభక్తితోనే బీజేపీ వల్లె వేస్తున్న అహంకార జాతీయ వాదాన్ని ఓడించాలి. ప్రజలు భయాన్ని వదిలేస్తే అద్భుతాలు జరుగుతాయి. బీజేపీ అజేయ శక్తి కాదన్న విషయాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు గుర్తించాలి.

- పి.చిదంబరం, కాంగ్రెస్ సీనియర్ నేత



### అరగంటలోనే యాక్టివ్ టీబీ నిర్ధారణ!

బోస్టన్, అక్టోబరు 24: యాక్టివ్ టీబీ ముందస్తు నిర్ధారణ కోసం అమెరికా శాస్త్రవేత్తలు అత్యంత చౌకయిన, వేగవంతమైన రక్త పరీక్షా విధానాన్ని అభివృద్ధి చేశారు. ఈ విధానం ద్వారా యాక్టివ్ టీబీ వచ్చే అవకాశాలను ముందుగానే అత్యంత కచ్చితంగా తెలుసుకోవచ్చని వారు తెలిపారు. తద్వారా సరైన చికిత్స అందించి వ్యాధిని నివారించవచ్చన్నారు. దీనికోసం వారు రక్తం నమూనాలోని నాలుగు ప్రోటీన్లు, రోగ నిరోధక శక్తిని బట్టి టీబీ వచ్చే అవకాశాలను అంచనా వేశారు. వివిధ దేశాలకు చెందిన ప్రజల 317 రక్త నమూనాలపై పరిశోధనలు జరిపి ఈ వివరాలను వెల్లడించారు. కేవలం అరగంటలో ముగిసే ఈ పరీక్ష ఖర్చు కేవలం రూ. 150 మాత్రమేనని తెలిపారు.

### ఆధునిక జీవన విధానంతో మెదడుకు దెబ్బ

న్యూఢిల్లీ, అక్టోబరు 24: బ్రెయిన్ స్ట్రోక్ ఒకప్పుడు వయస్సు మళ్లిన వాళ్లకు మాత్రమే వచ్చే వ్యాధి. కానీ ఇప్పుడు 45 సంవత్సరాల వయస్సులోపు వారికి కూడా వస్తోంది. దేశవ్యాప్తంగా ఈ వయస్సు వారిలోనే 25% మంది బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్నట్లు ఎయిమ్స్ న్యూరో సైన్స్ సెంటర్ చీఫ్ పద్మా శ్రీవాస్తవ తెలిపారు. ఆధునిక జీవన విధానమే వ్యాధి వ్యాప్తికి కారణమని చెప్పారు. మొత్తం జనాభాలో ప్రతి 3 నిమిషాలకొకరు బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా చనిపోతున్నారని వైద్యులు వివరించారు. అక్టోబరు 29న వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా.. ప్రతీ జిల్లాలో ఒక స్ట్రోక్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని వారు అభిప్రాయపడుతున్నారు. స్మోకింగ్, ఊబకాయం, ఆధునిక జీవన విధానం బ్రెయిన్ స్ట్రోక్‌కు కారణమవుతున్నాయని చెప్పారు.

హర్యాణా, మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు ఆశ్చర్యం కలిగించడం సహజం. రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీ అధికారంలో ఉండటం, మోదీ గతం కంటే రెండోమారు బలంగా గెలిచి, జోరుమీద ఉండటం, విపక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్ ఎన్నికలముందే అస్త్రసన్యాసం చేయడంతో ఈ రెండు చోట్లా బీజేపీది నల్లేరుమీద నడకేనన్న భావన అందరిలోనూ కలిగింది. అధికార పార్టీ ప్రచారం మహోధృతంగా సాగింది. ఎన్నికల సభల్లో కాంగ్రెస్‌కు మోదీ విసిరిన సవాళ్ళు సామాన్యమైనవేమీ కావు. పోలింగ్ ముందు రోజున సరిహద్దుల ఆవల శత్రుసంహారం జరిగింది. కథ యావత్తూ దేశభక్తి, జాతీయవాదం, కశ్మీరం చుట్టూ కదిలింది. అత్యధిక ఎగ్జిట్ పోల్స్ సైతం ఆ పార్టీని ఆకాశానికెత్తేశాయి. రెండు రాష్ట్రాల్లోనూ రెండోమారు మరింత భారీ మెజారిటీతో తమకు అధికారం కట్టబెడతారన్న బీజేపీ నమ్మకాన్ని ఓటర్లు ఎందుకో భగ్నం చేశారు. మహారాష్ట్రలో మెజారిటీ తగ్గించి, మిత్రపక్షం శివసేనకు ఊహించనంత శక్తినిచ్చారు. 'అబ్‌కీ బార్ సత్తర్‌కే పార్' అని ధీమాగా ఉన్న హర్యాణాలో త్రిశంకు సభను సృష్టించారు. ఇప్పుడు రెండుచోట్లా బీజేపీ మళ్ళీ అధికారం అనుభవించవచ్చును. మోదీ అన్నట్టుగా ఇదీ ఓ అద్భుతమే కావచ్చును. కానీ, ఓటర్లను అంత తేలిగ్గా తీసుకోకూడదన్నది ఈ ఫలితాల సారాంశం.

మహారాష్ట్రలో బీజేపీ-శివసేన కూటమి 220పైనే స్థానాలు సంపాదించాలన్నది ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ లక్ష్యం. ఇప్పుడు శివసేన చలువతో ఈ కూటమి 160 దాటగలిగింది. గత అసెంబ్లీ ఎన్నికలకంటే ముఖ్యమంత్రి మెజారిటీ తగ్గడం, ఏడుగురు మంత్రులు గెలవలేకపోవడం విశేషం. 'నా పార్టీ బలపడాలి, నా కుమారుడు బాగుపడాలి' అంటూ అధికారాన్ని చెరిసగం పంచుకుందామంటూ బీజేపీని శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే గట్టిగా దబాయించగలిగే స్థితిలో ఉన్నారిప్పుడు. కూటమి విజయం గురించి పెద్దగా అనుమానాలు లేకపోయినా, శివసేన ఇలా బలపడుతుందని ఎవరూ అనుకోలేదు. సుదీర్ఘకాలం శివసేనకు

## ఫలితాలు—పాఠాలు

చిన్నతమ్ముడుగా ఉంటూ వచ్చిన బీజేపీ 2014మోదీ ప్రభంజనంలో అధికవాటాకోసం డిమాండ్ చేయడం, వ్యవహారం చెడి రెండు పార్టీలు వేర్వేరుగా పోటీచేయడం, బీజేపీ ఎక్కువస్థానాలు గెలిచి, ఓటింగ్‌శాతాన్ని పెంచుకోవడంతో పాతికేళ్ళ స్నేహానికి తొలిసారి దెబ్బతగిలింది. తిరిగి స్నేహం చిగురించినా బీజేపీదే పైచేయి. శివసేన చిన్నతమ్ముడిగా మారవలసి వచ్చింది. సీట్ల సర్దుబాటు సమయంలో కూడా బీజేపీ ఏకపక్షంగా తాను 150 స్థానాల్లో పోటీచేయబోతున్నట్టు ప్రకటించి శివసేనను ఇరుకునబెట్టింది. ఇప్పుడు శివసేన పోటీచేసిన స్థానాలు తక్కువే అయినప్పటికీ, గతంలో బీజేపీ మాదిరిగానే వాటిలో ఎక్కువ సీట్లు నెగ్గడం దీనికి పైచేయిని ఇచ్చింది. శివాజీనీ, సావార్కర్‌ను ముందుకు తెచ్చి శివసేనను ప్రాంతీయంగా మరింత కుదించేందుకు బీజేపీ చేసిన ప్రయత్నాలు పెద్దగా ఫలించలేదు. ఆదిత్యఠాక్రే ప్రవేశంతో దాని దశ తిరిగింది. ఈ ఎన్నికల్లో శరద్‌పవార్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్. రాజకీయంగా ఆయన పనికూడా అయిపోయిందనుకుంటున్న తరుణంలో బలంగా ముందుకొచ్చారు. మరింత దెబ్బతింటుందనుకున్న కాంగ్రెస్ కొన్ని స్థానాలు పెంచుకోవడంతో, మహారాష్ట్రలో ఇప్పుడు విపక్షం బలంగా తయారైంది. ఎన్‌సిపి, కాంగ్రెస్‌లు సీట్లు గెలుచుకోవడానికి కాక, గతంలో కంటే ఎక్కువ అవమానపడకుండా జాగ్రత్తపడుతున్నాయన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. హర్యానాలో ఖట్టర్ అద్భుతాలు చేయలేకపోయారు. జాటేతర కులాలన్నీ ఆయనవెంట నడుస్తున్నాయనీ, 90 సీట్లలో 70 ఆయనవేనన్నారు. కానీ, దుశ్యంత్ చౌటాలా దెబ్బకు పరిస్థితి తారుమారైంది. అంతర్గత కుమ్ములాటలతో, చివరి నిముషంలో రాష్ట్ర పార్టీ అధినేత మార్పిడితో కాంగ్రెస్ మరింత పతనమైపోతుందన్న ప్రచారం వీగిపోయింది. భూపీందర్ సింగ్ హూడా చాణక్యంతో, జాట్ల ఆశీస్సులతో పదిసీట్లు కూడా రావనుకున్న కాంగ్రెస్ మూడురెట్లు ఎక్కువ సంపాదించింది.

జాతీయవాదం, దేశవ్యాప్త ఎన్నార్సీ, 370 అధికరణ, సావార్కర్, శివాజీ ఇలా అనేకానేక అంశాలు ఈ ఎన్నికల్లో నీరసించినట్టు కనిపిస్తున్నది. స్థానికాంశాల జోలికి పోకుండా వీటిచుట్టూ అత్యధిక ఓట్లు నెగ్గుకురావాలన్న బీజేపీ వ్యూహం ఫలించలేదు. ఈ రెండు రాష్ట్రాల్లో ఒక్క ఎన్నికల సభలో కూడా పాల్గొనని సోనియాగాంధీకీ, కాంగ్రెస్‌కు ఈ ఫలితాలు కచ్చితంగా ఉత్తేజాన్నిస్తాయి. మరిన్ని రాష్ట్రాలను జయించాలని తహతహలాడుతున్న బీజేపీకీ రాష్ట్రాల ఎన్నికల లెక్కలు వేరని ఈ ఫలితాలు తెలియచెప్పాయి.

## ఆంగ్ల విద్యా పితామహుడు లార్డ్ మెకాలే

పందొమ్మిదవ శతాబ్దంలో ప్రపంచంలోని అనేక దేశాల్లో వర్గపోరాటాలు, జాతి పోరాటాలు జరిగి బానిసలకు విద్యను నిరాకరించాయి. భారతదేశంలో మాత్రం సామాజిక వర్ణవ్యవస్థ వలన శూద్రులకు విద్య నిరాకరించబడింది. మానవీయ, సామాజిక సమస్యలను పరిష్కరించుకోవడానికి కావలసిన మనో వికాసాన్ని విద్య అందిస్తుంది. కానీ ఆ అవకాశం భారతదేశంలో లేదు. ఆంగ్లేయులు వ్యాపారం పేరుతో ఈ గడ్డపై అడుగిడిన సందర్భంలో ఇక్కడి అసమ సమాజాన్ని చూసి అవాక్కయ్యారు. ఆంగ్లేయుల రాక ప్రధాన ఉద్దేశం మతవ్యాప్తితో పాటు రాజ్యకాంక్ష. అయినా అందులోని కొందరు మానవతావాదుల వలన దేశంలో అనేక సంస్కరణలు జరిగాయి. ఆనాటికి భారత దేశంలో అగ్ర త్రివర్ణాలకు మాత్రమే సంస్కృత భాషలో విద్య అందుతుండేది. అలాగే భారతదేశంపైకి దండెత్తి వచ్చిన పర్షియన్లు, మొగలాయిల ప్రభావంతో ఉర్దూ, పర్షియన్ భాషలు కూడా అక్కడక్కడ నేర్పుతుండేవారు. కానీ, ఇవేవీ సామాజిక విలువలు, ప్రపంచంతో సత్సంబంధాలు పెంపొందించుకోలేకపోయాయి. భారతదేశంలో అనేకమంది సంఘ సంస్కర్తల పేరుమీద ఎన్నో కార్యక్రమాలు నిర్వహించినా, అవి వారి కుల వర్ణ హితానికి మాత్రమే ఉపయోగపడ్డాయి. ఈ దశలో మెజారిటీ ప్రజలకు విద్య అందించాలనీ, అది ఎవరి సమస్యలను వారే పరిష్కరించుకునేలా, ఉపాధి పొందేలా ఉండాలన్నది భారతదేశంలో ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టడానికి కారణమైన లార్డ్ థామస్ బాబింగ్టన్ మెకాలే ఉద్దేశం.



> భారతదేశంలో అనేకమంది సంఘ సంస్కర్తల పేరుమీద ఎన్నో కార్యక్రమాలు నిర్వహించినా, అవి వారి కుల, వర్ణ హితానికి మాత్రమే ఉపయోగపడ్డాయి. ఈ దశలో మెజారిటీ ప్రజలకు విద్య అందించాలనీ, అది ఎవరి సమస్యలు వారే పరిష్కరించుకునేలా, ఉపాధి పొందేలా ఉండాలన్నది భారత దేశంలో ఆంగ్ల విద్యను ప్రవేశ పెట్టడానికి కారణమైన థామస్ బాబింగ్టన్ మెకాలే ఉద్దేశం.

1834 జూన్ 10న సుప్రీమ్ కౌన్సిల్ మెంబర్‌గా ఆయన వచ్చారు. అప్పటికి భారత దేశ గవర్నర్ జనరల్‌గా విలియం బెంటింక్ ఉన్నారు. భారత్‌లో ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టాలని మెకాలే చేసిన తీర్మానాన్ని బెంటింక్ మొదట్లో తిరస్కరించినా మెకాలే వివరణతో ఆలోచన మార్చుకొని 1835లో ఆంగ్ల విద్యను ఆమోదించారు. కేవలం నాలుగేళ్ళు మాత్రమే ఇక్కడ పని చేసిన మెకాలే ఇక్కడి విద్యావ్యవస్థను పటిష్ఠం చేసేందుకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టాడు. కానీ, దురదృష్టవశాత్తు ఆయన కలలుగన్న ఆంగ్ల భాష ప్రావీణ్యత భారతదేశంలో ఇంకా నెరవేరలేదు.

ప్రపంచంలో శాస్త్ర, సాంకేతిక రంగాలలో వినూత్న మార్పులు వస్తున్న క్రమంలో ఆంగ్ల విద్య ప్రాధాన్యత పెరిగింది. కానీ, ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల భాష ఆదరణ కరువవుతుంది. ప్రైవేటు యాజమాన్యాలు ఆంగ్ల మాధ్యమాలు పెట్టి అడ్డగోలు ఫీజులతో మధ్య తరగతి ప్రజల నడ్డివిరుస్తున్నాయి. మరోపక్క విద్యాహక్కు చట్టం పేరుతో సామాన్య విద్యార్థులకు సంపూర్ణ విద్య అందకుండా ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. ఇక నుంచైనా ప్రభుత్వాలు ఇంగ్లీష్ మీడియంను అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి నుంచే ప్రారంభించాలి.

■ ప్రేమ్ సాగర్ కులేరి
ట్రూ టీచర్ కోయలేషన్

(నేడు మెకాలే జయంతి)

# విఫలమైన 'జాతీయవాద' వ్యూహం!

■ రాజ్‌దీప్ సర్దేశాయి



దీపశిఖ

కాలం వైరుధ్యాలమయం, మన కాలం మరీనూ! దినపత్రికల బిజినెస్ పేజీలు చదవండి: దేశ ఆర్థిక వ్యవస్థ ఎంత గడ్డు పరిస్థితిలో వున్నదో, ఆ దుస్థితి నుంచి ఆర్థికాన్ని ఉద్ధరించడానికి మోదీ సర్కార్ ఎంతగా ఆపసోపాలు పడుతుందో మీకు విదితమవుతుంది. ఆ తరువాత రాజకీయ వార్తలు, వార్తావ్యాఖ్యలు చదవండి: బీజేపీ మహాశక్తి ఒక ఎన్నికల విజయం నుంచి మరో ఎన్నికల విజయానికి జైత్రయాత్ర చేస్తున్న తీరు తెన్నులు మీకు తప్పక దిగ్భ్రాంతి కలిగిస్తాయి.

సరే, మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ఈ రెండు రాష్ట్రాలలోనూ బీజేపీ మళ్ళీ అధికారంలోకి వచ్చివుండవచ్చుగానీ, ఎన్నికలలో తిరుగులేని విజేతగా ఆ పార్టీ ఆవిర్భవించిందని చెప్పగలమా? తాగు నీటి సమస్య మొదలు హరించుకుపోతున్న ఉద్యోగాల దాకా పలు స్థానిక సమస్యల విషయంలో ప్రజల్లో నెలకొన్న తీవ్ర అసంతృప్తి, భావి ఎన్నికల ఫలితాలపై ప్రభావాన్ని నెరపకుండా వుండేలా తగు చర్యలు చేపట్టేందుకు బీజేపీని ఈ రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు తప్పక పురిగొల్పుతాయి.

ఐదు నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో పోలిస్తే ఇప్పుడు మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీకి లభించిన ఓట్ల శాతం గణనీయంగా పడిపోయింది. గత వేసవిలో జరిగిన సార్వత్రక ఎన్నికలలో హర్యానాలోని మొత్తం పది లోక్‌సభా నియోజక వర్గాలను గెలుచుకోవడంతో పాటు 58 శాతం ఓట్లను బీజేపీ సాధించుకున్నది. దాదాపు 80 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఓట్లను సాధించుకోవడంలో బీజేపీయే అగ్రగామిగా వున్నది.

అటువంటిది ఇప్పుడు హర్యానాలో త్రిశంకు సభ (హంగ్ అసెంబ్లీ) ఏర్పడడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? కొత్త శాసనసభలో బీజేపీ ఏకైక పెద్ద పక్షంగా ఉండబోతున్నప్పటికీ ఓటర్ల వైఖరిలో ఒక పెనుమార్పు చోటు చేసుకున్నట్టు అసెంబ్లీ ఎన్నికల పలితాలు సూచించడం లేదూ? మహారాష్ట్రలో సైతం గత వేసవిలో లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ-శివసేన కూటమి 220కి పైగా అసెంబ్లీ సెగ్మెంట్లలో అగ్రగామిగా వున్నది. మరి ఇప్పుడో? కొత్త విధానసభలో ఆ కూటమి నాల్గవ వంతు సీట్లను కోల్పోయింది! శాసనసభ, లోక్‌సభ ఎన్నికల ఫలితాల మధ్య పెరిగిపోతున్న వ్యత్యాసాన్ని మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఓటర్ల తీర్పు సార్వత్రక, అసెంబ్లీ ఎన్నికలలో భిన్నంగా ఉన్నది. 2018 శీతాకాలంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కూడా ఇదే విషయాన్ని తేటతెల్లం చేశాయి. గత సంవత్సరాంతంలో కాంగ్రెస్ పార్టీ మూడు రాష్ట్రాలు.. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో అధికారంలోకి వచ్చింది. ఆ తరువాత జరిగిన లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వున్న ఆ మూడు రాష్ట్రాలలోనూ ఓడిపోయింది.

సార్వత్రక పోరాటంలో, ముఖ్యంగా బాలాకోట్ అనంతరం, ఎన్నికలను అధ్యక్ష తరహా పోటీగా మార్చివేయడంలో బీజేపీ సఫలమయింది. అధ్యక్ష తరహా పోటీలో స్థానిక, ప్రాంతీయ అంశాలు తమ ప్రాధాన్యాన్ని కోల్పోయాయి. ఓటర్ల ఆలోచనలను అవి ఏమాత్రం ప్రభావితం చేయలేకపోయాయి. బాలాకోట్ ఘటనల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సర్వశక్తిమంతుడైన, ఎటువంటి చిక్కులనైనా సమర్థంగా ఎదుర్కోగల నాయకుడుగా ఓటర్ల మనస్సుల్లో సుస్థిర స్థానం సాధించుకున్నారు. మోదీకి లభించిన ఈ ఘనత, దేశ వ్యాప్తంగా బీజేపీ విజయానికి విశేషంగా దోహదం చేసింది.

మహారాష్ట్ర, హర్యానా శాసనసభా ఎన్నికలలోనూ అదే విధమైన 'జాతీయవాద' వ్యూహాన్ని బీజేపీ అనుసరించింది. అయితే భావోద్విగ్న 'జాతీయవాద' అంశాల కంటే సామాజిక వర్గాల ప్రయోజనాలు, స్థానిక విరోధాలు, కుల సమీకరణలే ఓటర్ల నిర్ణయాలను అధికంగా ప్రభావితం చేశాయని ఈ రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సువిదితం చేశాయి. కరువు కోరల్లో విలవిల్లాడుతున్న మరఠ్వాడా ప్రాంతంలోని పార్లీ నియోజక వర్గమే ఇందుకొక ఉదాహరణ. బీజేపీ జాతీయ నాయకుడు అమిత్ షా, మహారాష్ట్రలో తన ప్రచారాన్ని ఈ నియోజక వర్గం నుంచే ప్రారంభించారు. కఠిన నిర్ణయాలు తీసుకోవడంలో తమ 'జాతీయవాద', 'దేశభక్తి ప్రపూరిత' ప్రభుత్వం ఏ మాత్రం వెనుకాడబోదనడానికి జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తున్న రాజ్యాంగ అధికరణ 370ని రద్దుచేయడమే ఒక తిరుగులేని నిదర్శనమని పార్లీ ఓటర్లకు అమిత్ షా పదే పదే చెప్పారు. రాష్ట్ర మంత్రి పంకజ ముండే ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజక వర్గంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా విస్తృతంగా ప్రచారం చేశారు. అమిత్ షా వలే ఆయనకూడా జాతీయవాద భావోద్వేగాలను రెచ్చగొట్టారు. జాతి సాధిస్తున్న పురోగతి ప్రతి ఒక్కరికీ గర్వకారణం కావాలని మోదీ ఉద్బోధించారు. అయితే పార్లీ ఓటర్లు బీజేపీ అభ్యర్థిని తిరస్కరించారు. ఆ నియోజకవర్గంలోని పలు గ్రామాలలో ప్రజలు అప్పటికి చాలా వారాలుగా తాగునీటి కొరతతో సతమతమవుతున్నారు మరి.

గ్రామీణ హర్యానాలోనూ ఇదే పరిస్థితి. అధికరణ 370 రద్దును తమ విజయసూత్రంగా బీజేపీ పరిగణించింది. హర్యానాలో కూడా ఆ 'జాతీయవాద' వ్యూహాన్నే అనుసరించింది. నిరుద్యోగం విలయతాండవం చేస్తున్న రాష్ట్రమది. దేశంలోని మరే రాష్ట్రంలోనూ లేనివిధంగా అక్కడ నిరుద్యోగం చాలా




> బాలాకోట్ ఘటనల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సర్వశక్తిమంతుడైన, ఎటువంటి చిక్కులనైనా సమర్థంగా ఎదుర్కోగల నాయకుడుగా ఓటర్ల మనస్సుల్లో సుస్థిర స్థానం సాధించుకున్నారు. మోదీకి లభించిన ఈ ఘనత, సార్వత్రిక ఎన్నికలలో దేశవ్యాప్తంగా బీజేపీ విజయానికి విశేషంగా దోహదం చేసింది. మహారాష్ట్ర, హర్యానా శాసనసభ ఎన్నికలలో భావోద్విగ్న 'జాతీయవాద' అంశాల కంటే సామాజిక వర్గాల ప్రయోజనాలు, స్థానిక విరోధాలు, కుల సమీకరణలే ఓటర్ల నిర్ణయాలను అధికంగా ప్రభావితం చేశాయి.

హెచ్చు స్థాయిలో వున్నది. ఆకలితో నకనకలాడుతూ నిరాశానిస్పృహల్లో వున్నవారు జాతీయవాద భావావేశాలకు ఎలా లోనవుతారు? బీజేపీ ప్రచార సరళి హర్యానా ఓటర్లను పరిమిత స్థాయిలోనే ప్రభావితం చేసింది. అజేయశక్తిగా కన్పిస్తున్న బీజేపీకి ఈ రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఒక హెచ్చరిక, ఒక మేలుకొలుపు అని చెప్పవచ్చు. ఓటర్లను ఏ రాజకీయ పార్టీ కూడా ఆషామాషీగా తీసుకోవడానికి వీలులేదని ఈ ఫలితాలు స్పష్టం చేశాయి. సతారా లోక్‌సభా నియోజక వర్గ ఉప ఎన్నిక ఫలితం ఈ సత్యాన్ని ఎలుగెత్తి చాటింది. ప్రజా శ్రేయస్సుకు చిత్తశుద్ధితో కృషి చేయడం మినహా మరేదీ ఓటర్లను సంతృప్తిపరచదని ఈ ఉప ఎన్నిక ఫలితం నిర్ధారించింది.

అయినప్పటికీ మహారాష్ట్రలో బీజేపీ-శివసేన కూటమి, హర్యానాలో కాషాయ పార్టీయే మళ్ళీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగల స్థితిలో వున్నాయి. విస్మరించలేని ఈ వాస్తవం చెప్పుతున్నదేమిటి? ప్రజలు ఎదుర్కొంటున్న 'నిజమైన' సమస్యలను పరిష్కరించడంలో బీజేపీ బలహీనతలను తమకు సానుకూలంగా మార్చుకోవడంలో ప్రతిపక్షం విఫలమయిందనే కాదూ! మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీ అసలు పోరాడలేదనే చెప్పాలి. ఆ పార్టీకి సరైన నాయకత్వమూ లేదు, స్ఫూర్తిదాయక లక్ష్యమూ లేదు. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు శరద్ పవార్ మాత్రమే ఒక నిజమైన ప్రతిపక్ష నాయకుడిగా పోరాడారు. ఆయన ఒక్కరే పోరాటాన్ని ఫడణవీస్ శిబిరం దాకా తీసుకువెళ్ళారు. అనేక పోరాటాలలో ఆరితేరిన ఈ మరాఠా కురువృద్ధుడు కుండపోత వర్షంలోనూ అశేష ప్రజలు పాల్గొన్న ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించడం ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితాన్ని నిర్వచించే ఘట్టంగా ప్రజల స్మృతి పథంలో నిలిచిపోతుంది.

హర్యానాలో కాంగ్రెస్‌కు ఒక శక్తిమంతమైన ప్రాంతీయ నాయకుడు ఉన్నాడని చెప్పక తప్పదు. ఆయనే మాజీ ముఖ్యమంత్రి భూపీందర్ సింగ్ హూడా. హర్యానాకు రెండు సార్లు ముఖ్యమంత్రిగా ఉన్న హూడాను కాంగ్రెస్ అధిష్ఠానం నిర్లక్ష్యం చేసింది. మరి కొన్ని వారాలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా పిసిసి అధ్యక్ష పీఠంపై ఆయన ప్రత్యర్థి వర్గానికి చెందిన నాయకురాలిని కూర్చో పెట్టింది. అయినప్పటికీ హూడా ఈ ప్రతి కూల పరిస్థితులన్నిటినీ అధిగమించి కాంగ్రెస్‌కు గణనీయమైన స్థానాలను సాధించారు. కనీసం కొన్ని నెలల ముందు హర్యానా పిసిసి నాయకత్వాన్ని హూడాకు అప్పగించినట్టయితే హర్యానా ఫలితాలు వేరే విధంగా వుండేవని ఖాయంగా చెప్పవచ్చు.

ఏమైనా ప్రధానమంత్రి నరేంద్ర మోదీయే ఇప్పటికీ దేశానికి నెంబర్ 1 నాయకుడనడంలో సందేహమేమీ లేదు. బీజేపీకి రాష్ట్రాలలో పటిష్ఠ నాయకత్వాలు వున్నాయి. ఎన్నికలను కట్టుదిట్టంగా ఎదుర్కోగల యంత్రాంగం వున్నది. అపరిమిత వనరులు వున్నాయి. మరీ ముఖ్యంగా విజయం సాధించాలనే కృతనిశ్చయంతో పనిచేసే కార్యకర్తలు వున్నారు. మరి ప్రతిపక్షాల మాటేమిటి? నిరాశాపూర్వక మనస్తత్వం, నిరుత్సాహపూర్వకంగా ఎన్నికల గోదాలోకి దిగకుండా వున్నట్టయితే మహారాష్ట్రలోనూ, హర్యానాలోనూ అవి విజయాన్ని సాధించే అవకాశముండేది. ప్రతిపక్షాలు ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ అందివచ్చిన అవకాశాన్ని చేజార్చుకోవడమనేది ఇదే మొదటిసారి కాదు.

**తాజా కలం:** తదుపరి అసెంబ్లీ ఎన్నికలు ఢిల్లీ, జార్ఖండ్‌లలో జరగనున్నాయి. ముఖ్యంగా ఢిల్లీలో పోరు హోరా హోరీగా జరగడం ఖాయం. ఇతర ప్రతిపక్ష నేతల వలే కాకుండా అరవింద్ కేజ్రీవాల్ తప్పకుండా విజయం సాధించాలనే కృతనిశ్చయంతో పోరాడతారు. ఆయనకు ఆత్మ విశ్వాసం మెండు. జీవితంలో అయినా, ఎన్నికలలో అయినా విజయానికి మొదటి మెట్టు ఆత్మ విశ్వాసమే కదా!

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

## జనవాక్యం

### గెజిటెడ్ సంతకాలతో సతమతం

గ్రీన్ ఇంకుపెన్‌ని గెజిటెడ్ హోదాకు చిహ్నంగా భావిస్తారు. ఈ హోదాతోనే గెజిటెడ్ ఉద్యోగులు నిరుద్యోగుల దగ్గిర నుంచి సమాజంలో వివిధ వర్గాల వారి యొక్క అవసరాలనిబట్టి వారిపత్రాల జిరాక్స్‌లపై సంతకాలు చేస్తుంటారు. నిరుద్యోగులు, విద్యార్థులు వివిధ పరీక్షలకి దరఖాస్తు చేసుకున్నప్పుడు వారి సర్టిఫికెట్ల జిరాక్స్‌లపై గెజిటెడ్ ఉద్యోగుల సంతకాలు అవసరమౌతాయి. సాధారణంగా గెజిటెడ్ స్థాయి అధికారులు పట్టణాల్లో వుంటారు. గ్రామీణప్రాంతాల నిరుద్యోగులు, విద్యార్థులకు వారి సంతకాలు అవసరమైనప్పుడు వారు ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది గెజిటెడ్ ఉద్యోగులు సంతకాలు పెట్టటానికి నిరాకరిస్తుంటారు. మరికొన్నిచోట్ల కొంతమంది ఏజెంట్లు గ్రామ ప్రజలు నుండి రూ.100 నుంచి 300 వరకు తీసుకొని గెజిటెడ్ ఉద్యోగుల నుండి సంతకాలు చేయిస్తున్న సందర్భాలు లేకపోలేదు. 2014లో కేంద్ర ప్రభుత్వం ఈ విషయాలపై రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపింది. రెండవ పాలనా సంస్కరణల కమీషన్ కూడా తన 12 వ నివేదికలో ఈ విషయంపై చర్చించింది. సర్టిఫికేట్లపై వ్యక్తుల స్వీయ ధ్రువీకరణను అనుమతించాలని సూచించింది. కేంద్రం కూడా ఈ దిశగా కొన్ని చర్యలు చేపట్టింది. రాష్ట్రం కూడా అదే కోవలో సర్టిఫికేట్ల స్వీయ ధ్రువీకరణ చెల్లుబాటయ్యేట్టు ప్రకటించాలి. సామాన్యులను గెజిటెడ్ సంతకం కష్టాల నుంచి రక్షించాలి.

**ఎం. రాంప్రదీప్,** తిరువూరు

### భాషాపండితులకు 'సమాన వేతనం'

రాష్ట్ర ఉన్నత పాఠశాలల్లో భాషా పండితుల వర్గోన్నతి ప్రక్రియను ప్రభుత్వం జాప్యం చేస్తున్నది. గత ఏడాది నవంబర్‌లో భాషోపాధ్యాయుల పదోన్నతిపైన మంత్రిమండలి ఆమోదం తెల్పినా ఇంతవరకు ఉత్తర్వులు జారీ చేయలేదు. ఇటీవల అన్ని సబ్జెక్టుల టీచర్లకు పదోన్నతులు ఇచ్చి కేవలం కొన్ని ఉపాధ్యాయ సంఘాల ఒత్తిడికి తలవొగ్గి న్యాయంగా దక్కాల్సిన వర్గోన్నతిని పండితులకు ఇవ్వకుండా ఆపడం ఎంతవరకు సమంజసం? ఈ సమస్యని పరిష్కరించమని పాదయాత్రలోవున్న అప్పటి ప్రతిపక్ష నేత, నేటి సీఎం జగన్‌కు వినతిపత్రం ఇచ్చి స్పష్టమైన హామీని పొందడం జరిగింది. ఒకే విద్యార్హతలు ఉండి పాఠశాల సహాయకుడిగా సమాన వేతనంగాక, ఇంటర్ విద్య అర్హతతో సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయ వేతనం తీసుకోవడంవల్ల ఆత్మాభిమానం దెబ్బతింటున్నది. సమాన పనికి సమాన వేతనం నిబంధనను భాషా పండితుల విషయంలో అమలుచేసి పండితులకు న్యాయం చేయాలని కోరుతున్నాము.

**పల్లపోతు ఆంజనేయస్వామి,** తెలుగు ఉపాధ్యాయుడు, ఏలూరు

# భారతీయ మూలాలున్న మతాల వారికే పౌరసత్వం!

మన రాజ్యాంగ నిర్మాతలు మొదటి అధికరణలోనే 'ఇండియా, అంటే భారత్...' అని పేర్కొనడాన్ని బట్టి వారు కొన్ని వాస్తవాలను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుపుతుంది: మొదటిది– వేల సంవత్సరాల నాగరికత గల మన మాతృభూమి భారత్‌కు ఇండియా అనేది కేవలం కొత్త పేరు మాత్రమే. ఈ నాగరికత నాలుగు ప్రధాన మతాలకు జన్మనిచ్చింది. అవే హిందూ, జైన, బౌద్ధ, సిక్కు మతాలు. ఇవి ప్రాథమికంగా మన ప్రాచీన నాగరికత, సంస్కృతి విశిష్ట ధర్మాలను తెలుపుతాయి. రెండవది– మన ప్రాచీన నాగరికతకు వారసత్వం, ధర్మకర్త భారత దేశం. మూడవది– లోతైన నాగరికత సంబంధాలు మనల్ని యుగాల తరబడి ప్రాదేశికంగా కలిపి ఉంచుతున్నందున మనం చెప్పే 'జాతి ఐక్యత, సమగ్రత'లో నాగరికత ఇమిడి ఉంటుంది. ఆ విధంగా, రాజ్యాంగంలో పొందుపరచే ముందు, ఐక్యత సమగ్రతలు ప్రాథమికంగా భారత దేశానికి సనాతన ధర్మం ద్వారా పరిచయమే. కాబట్టి, మన రాజ్యాంగ నైతిక బాధ్యత మన దేశంలో, ప్రజలలో, మన ప్రాచీన నాగరికత, దాని విలువలను పునరుద్ధరించడం. కేవలం భౌగోళిక ప్రాంతాలు మాత్రమే ఒక జాతిని ఏర్పాటు చేయలేవు. అందుచేత ఈ విలువలు లేకుండా ఇండియాలో భారత దేశమే ఉండదు.

హిందువులు ప్రపంచంలో 100 కోట్లమందికి పైగా ఉన్నారు. మూడో అతి పెద్ద మత అనుయాయులుగా ఉంటున్నప్పటికీ ఒక్క హిందూ దేశం కూడా లేదు. అత్యధికంగా హిందువులు ఉన్న దేశం భారత్ ఒక్కటి మాత్రమే కావడంతో (చిన్న దేశమైన నేపాల్‌ను మినహాయించి) భారత దేశంలో ఆవిర్భవించిన మతస్థులకు స్వదేశం భారత్ మాత్రమే (బౌద్ధ మతస్థులకు మినహా). భారత మూలాలు కలిగిన అన్ని మతాల వారికి ఆశ్రయం కల్పించవలసిన నాగరిక బాధ్యత మనపై ఉంది.

హిందువులు (అధికరణ 25లో ఇచ్చిన వివరణ ప్రకారం బౌద్ధులు, జైనులు, సిక్కులతో సహా) కొన్ని దేశాలలో మతపరమైన హింసను ఎదుర్కోవడం దురదృష్టకరం. మరెక్కడికీ వెళ్లే అవకాశం లేనందున (బౌద్ధులు మినహా) వారంతా సహజంగా సహాయం, ఆశ్రయం కోసం భారత్ వైపు చూస్తారు. అయితే, తప్పించుకొని భారత దేశానికి వచ్చిన చాలామంది గౌరవమైన జీవనానికి తప్పనిసరిగా అవసరమైన భారత పౌరసత్వం పొందటం కోసం చాలాకాలంగా ఇబ్బంది పడుతున్నారు.

'ట్రిప్స్' ఒప్పందం ప్రకారం పార్లమెంట్ వస్తువులకు రక్షణ కల్పిస్తూ వస్తువుల భౌగోళిక సూచికలు (నమోదు, రక్షణ) చట్టం–1999ను ఆమోదించింది. అశాశ్వత వస్తువుల పట్ల ఎంతో ఆందోళన వ్యక్తం చేసిన మనం– అంతకన్నా ఎక్కువ కాకపోయినా కనీసం ఆ మేరకు సానుభూతిని భారత దేశంలో మూలాలు గల ప్రాచీన మత సంప్రదాయాలను అనుసరిస్తున్న వారి పట్ల చూపలేమా?

రాజ్యాంగంలో పొందుపరచిన నైతికత మన నాగరికతపై ఆధారపడి ఉంటుంది కాబట్టి భారత మూలాలు గల మతాల ప్రజలు ఎక్కడున్నప్పటికీ వారి శ్రేయస్సుకు భరోసా ఇవ్వడం భారతీయ నాగరికత బాధ్యత. కానీ, రాజ్యాంగపర నైతికత కాబోదు. 'హింసకు గురవుతున్న హిందువులకు భారత్ సహజమైన గృహంగా నిలుస్తుంది, వారిక్కడ ఆశ్రయం పొందడాన్ని స్వాగతిస్తుంది' అని 2014 ఎన్నికల ప్రణాళికలో బీజేపీ హామీ ఇచ్చింది. ఆ మేరకు 'పౌరసత్వ సవరణ బిల్లు 2016'ను పార్లమెంటులో ప్రవేశపెట్టగా అది మురిగిపోయింది.

> న్యాయ పరిశీలనకు తట్టుకొనే విధంగా 'పౌరసత్వ సవరణ బిల్లు'కు పటిష్ఠమైన రక్షణలు ఏర్పర్చవలసి ఉంది. అందుచేత, రాజ్యాంగంలో నూతన అధికరణ '11ఎ'ను చేరుస్తూ రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా పౌరసత్వ చట్టానికి సవరణలను చేయాలి. హింసకు గురవుతున్న ఏ దేశానికి చెందిన వారైనా హిందువులు, బౌద్ధులు, జైనులు, సిక్కులు, జొరాస్ట్రియనులకు పౌరసత్వాన్ని పరిమితం చేయాలి. తదుపరి లోపాలు జరిగితే స్వదేశానికి తిరిగి పంపే విధంగా, వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి శత్రువుల ఆస్తుల చట్టాన్ని వర్తింపచేసే విధంగా పలు కఠిన రక్షణలు కూడా బిల్లులో జోడించాలి.

అసోంలో ప్రకటించిన తుది జాతీయ పౌరసత్వ నమోదు పలువురు పౌరుల పరిస్థితిని అస్పష్టం కావించడంతో నూతన పౌరసత్వ సవరణ బిల్లును ఆమోదించడం విశేష ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఈ సందర్భంగా 'పౌరసత్వ సవరణ బిల్లు 2016'లో తీవ్రమైన లోపాలను, జాతీయ భద్రతా ప్రమాదాలను అర్థం చేసుకోవడం అవసరమైంది. దానితో నూతన బిల్లు వివాదాలలో చిక్కుకోకుండా ఉండగలదు. పైగా, దీర్ఘకాలంగా హింసలకు గురవుతున్న భారత మూలాలు గల మతాలకు చెందిన వారికి త్వరితగతిన పౌరసత్వం లభించడం సాధ్యం కాగలదు.

మొదటి అంశం, 2016 బిల్లు కేవలం మూడు దేశాలు– అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లలో అణచివేతకు గురవుతున్న మతాలవారినే పరిగణనలోకి తీసుకొంటుంది. భారత మూలాలు గల మతాలకు చెందిన వారు హింసలకు గురికావడం ఈ దేశాలకు మాత్రమే పరిమితం కాదని చెప్పవచ్చు. కొన్ని ఆఫ్రికా దేశాలలో హిందువులను వేటాడుతున్నారని; ఫిజీలో హిందువులపై దాడులు జరిగాయని; మలేషియా, ఇండోనేషియా వంటి దేశాలలో హిందువులు ప్రమాదాల అంచున ఉన్నారని పలు నివేదికలు తెలుపుతున్నాయి. కాబట్టి అన్ని దేశాలను జత చేయడం ద్వారా రాబోయే చట్టం ప్రస్తుత అంశాలనే కాకుండా భవిష్యత్తులో జరుగబోయే అంశాలను కూడా దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఉంది.

రెండవ అంశం, ఈ బిల్లులో ఆ మూడు దేశాలలోని మైనారిటీలు అందరినీ చేర్చారు. దాని వల్ల ఉపయోగం ఉండదు. భారత మూలాలు లేని మతాలకు చెందిన ప్రజలు హింసకు గురయిన పక్షంలో వారి పట్ల భారత్‌కు ఎటువంటి నాగరికతపరమైన బాధ్యతలు లేవు. మతం కారణంగా హింసకు గురయి, వెళ్లలేని పరిస్థితులలో ఉన్న యూదులు, జొరాస్ట్రియన్ పార్సీలు వంటి వారి పట్ల మనమెంతో ఉదారంగా వ్యవహరించాము. కానీ, ఇప్పుడు యూదులకు వారి స్వస్థలం ఇజ్రాయెల్ ఏర్పడింది. జొరాస్ట్రియన్లు ప్రపంచం అంతా స్వల్ప సంఖ్యలో ఉన్న మైనారిటీలుగా వ్యాప్తి చెందారు. వారింకా భారత్‌లో ఆశ్రయం పొందవలసిన అవసరం లేదు. అయినప్పటికీ, స్వస్థలం అంటూ లేని వారికి మనం ద్వారాలు తెరిచి ఉంచవచ్చు. హింసకు గురవుతున్న క్రైస్తవులు, ముస్లింలకు సంబంధించి క్రైస్తవ, క్రైస్తవులు అధికంగా ఉన్న 100 దేశాలలో, 50 వరకు ఉన్న ముస్లిం దేశాలలో వారు ఆశ్రయం కోరవచ్చు.

ఇప్పటికే అధిక జనాభా సమస్యను ఎదుర్కొంటున్న మనం అనవసరపు భారం మోసే పరిస్థితుల్లో లేము. జనాభా పెరుగుదల సమస్య గురించి ప్రధాని మోదీ తన 2019 స్వతంత్ర దినోత్సవ ప్రసంగంలో సమంజసంగా ప్రస్తావించారు.

మూడవ అంశం, 2016 బిల్లులో ఆ మూడు దేశాలలోని 'మైనారిటీలు' అందరికీ ప్రయోజనాలు విస్తరింపచేయడం తర్క విరుద్ధమే కాకుండా, అనేక ప్రమాదాలతో కూడుకున్నది కూడా. వారు భారత మూలాలు గల మతాలను అనుసరించినా, అనుసరించక పోయినా బయటగల మైనారిటీలు అందరి పట్ల నివారింపదగిన స్వయంగా ఏర్పాటు చేసుకున్న బాధ్యతను ఇది విధిస్తుంది. దీని ఉద్దేశం మన తూర్పు, పశ్చిమ సరిహద్దులలో గల ముస్లిం దేశాలలో దేశ విభజన సమయం నాటి అంశాలను తిరిగి తెరవడమే అయిన పక్షంలో అఫ్ఘానిస్థాన్‌ను చేర్చడంలో అర్థం ఉండదు.

భారతీయ నాగరికత బాధ్యతలో భాగంగా హింసకు గురవుతున్న భారత మూలాలుగల ప్రజలకు ఉపకారం కలిగించడమే ఉద్దేశమయినట్లయితే భారత మూలాలు లేని క్రైస్తవులను చేర్చడం అటువంటి తార్కికతను నిర్వీర్యం చేస్తుంది. మన పొరుగున ఉన్న శ్రీలంకలో హింసకు గురవుతున్నట్లు ఫిర్యాదు చేస్తున్న తమిళ మైనారిటీలను (ఎక్కువగా హిందువులు) చేర్చక పోవడం సహింపరాని అంశం. కాబట్టి ఎటువంటి




వర్గీకరణ జరిపినా (కేవలం మూడు దేశాలు లేదా మైనారిటీలు) సహేతుకం కాబోదు.

నాల్గవ అంశం, 2016 బిల్లులో 'మైనారిటీ' అనే పదానికి సమీకృత నిర్వచనం కల్పించారు. కాబట్టి, సాధారణ వ్యాఖ్యానం ద్వారా మహ్మదీయులు మొదలైనవారు అర్హులు. మరో అంశం, భవిష్యత్తులో దేశాల జాబితాకు మయన్మార్, చైనాలను కూడా చేరిస్తే మైనారిటీలైన రోహింగ్యాలు, ఉయ్ఘురులు కూడా పౌరసత్వానికి అర్హత పొందుతారు.

ఈ బిల్లు ప్రస్తుతానికి రోహింగ్యాలకు వర్తింపజేయనప్పటికీ 'మైనారిటీలు' అనే పదానికి హేతు విరుద్ధమైన వ్యక్తీకరణను చేయడం ద్వారా భవిష్యత్తులో ఇతర దేశంలోని ముస్లిం మైనారిటీలు కూడా పౌరసత్వానికి అర్హత పొందే అవకాశం ఉంది. ఆ విధంగా, మరెక్కడకు వెళ్లలేని భారత మూలాలు గల మతస్థులను కాపాడడానికి ఉద్దేశించిన చర్య జనాభాపర దురాక్రమణకు చట్టబద్ధ మార్గం ఏర్పర్చడం ఆందోళన కలిగిస్తుంది.

ఐదవ అంశం, పౌరసత్వ సవరణ బిల్లు రాజ్యాంగంగా చెల్లుబాటు అయ్యే విషయమై నిపుణులు ప్రశ్నలు లేవనెత్తారు. కొన్ని కథనాల ప్రకారం ఈ విషయమై ఇప్పటికే కొన్ని ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను దాఖలు చేశారు. ఒక చట్టం న్యాయ సమీక్షకు నిలబడాలి అంటే, దానికి రాజ్యాంగంలోని సంబంధిత నిబంధనల ద్వారా మద్దతు లభించాలి. రాజ్యాంగంలోని విభాగం 2లో 5 నుండి 11 వరకు 'పౌరసత్వం' శీర్షికలో గల అధికరణలు హింసకు గురవుతున్న భారత మూలాలు గల మతాల ప్రజలకు లేదా హింసకు గురవుతున్న మూడు లేదా అన్ని దేశాలలోని మైనారిటీలకు పౌరసత్వం కల్పించడానికి అవకాశం కల్పించవు. ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించడం కోసం మైనారిటీలకు చెందని ప్రైవేట్ పాఠశాలలో విద్యాహక్కు చట్టాన్ని వర్తింపజేయడం కోసం వరుసగా 1995, 2005 లలో రాజ్యాంగ సవరణలు తీసుకొచ్చారు. వాటి ఫలితంగా, ఆ విధంగా చేసిన చట్టాలు మనుగడ సాగింపగలుగుతున్నాయి. అనేక లోపాలతో పౌరసత్వ సవరణ బిల్లు చట్ట రూపం సంతరింప చేసుకున్నా న్యాయ సమీక్ష ముందు నిలబడలేదు.

ఇక చివరి అంశం, పౌరసత్వం కల్పించడానికి మతపరమైన హింస ప్రాతిపదిక కావడంతో ఆ తర్వాత భారతీయ మూలాలు లేని మతాలలోకి మారితే ఆ ప్రాతిపదికత నిరాకరిస్తుంది. ఆ విధంగా మతం మారినవారు భారత్‌లోకి ప్రవేశించడం కన్నా తమ మాతృదేశంలోనే ఉండిపోవచ్చు. పైగా, భారత పౌరసత్వాన్ని మోసపూరితంగా పొందడానికి ఒకరు తప్పుడు మతాన్ని పేర్కొని, ఆ తరవాత అసలు మతాన్ని వెల్లడించడం కష్టం కాబోదు. కాబట్టి 2016 బిల్లులో లోపించిన విధంగా కఠినమైన రక్షణలు లేని పక్షంలో జనాభాపరమైన దురాక్రమణకు ఇది చట్టబద్ధమైన మార్గం అయ్యే ప్రమాదం ఉంది.

ఇటువంటి స్వభావం గల చట్టం స్వల్పమైన లొసుగును కూడా భరించలేదు. న్యాయ పరిశీలనకు తట్టుకొనే విధంగా దానికి పటిష్ఠమైన రక్షణలు ఏర్పర్చవలసి ఉంది. అందుచేత, రాజ్యాంగంలో నూతన అధికరణ 11ఏ ను చేరుస్తూ రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా పౌరసత్వ చట్టానికి సవరణలను చేసి, పౌరసత్వాన్ని హింసకు గురవుతున్న ఏ దేశానికి చెందిన వారైనా హిందువులు, బౌద్ధులు, జైనులు, సిక్కులు, జొరాస్ట్రియనులకు పరిమితం చేస్తూ తీసుకు రావాలి. తదుపరి లోపాలు జరిగితే స్వదేశానికి తిరిగి పంపే విధంగా, వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి శత్రువుల ఆస్తుల చట్టాన్ని వర్తింపచేసే విధంగా పలు కఠిన రక్షణలు కూడా బిల్లులో జోడించాలి.

■ ఎం. నాగేశ్వరరావు

(రచయిత సీనియర్ ఐపీఎస్ అధికారి. అభిప్రాయాలు వ్యక్తిగతం)

epaper.andhrajyothy.com

పర్వదినం

**సర్వమానవాళీ కోరుకొనేవి ఆరోగ్యం, ఐశ్వర్యం, ఆయుర్దాయం. ఆ మూడింటినీ అందించే రోజు 'ధన త్రయోదశి'.**

# సకల శుభదాయకం!




ఆశ్వయుజ బహుళ త్రయోదశికి అనేక విశిష్టతలున్నాయి. ఈ రోజుకు వ్యవహారిక నామాలు అనేకం. వాటిలో ప్రధానమైనది 'ధనత్రయోదశి'. ఉత్తర భారతదేశంలో 'ధన్ తేరస్' అని పిలుస్తారు. దీపావళి వేడుకలు ఈ రోజు నుంచే మొదలవుతాయి. ఈ రోజున తమ ఇళ్ళకు పితృదేవతలు వస్తారన్న నమ్మకం ఉంది.

**లక్ష్మీ కటాక్షం**

అమృతం కోసం దేవదానవులు క్షీరసాగర మథనం సాగించగా, శ్రీమహాలక్ష్మీదేవి ఆవిర్భవించిన రోజు ఇదేనని పురాణాలు చెబుతున్నాయి. కాగా, విష్ణుమూర్తి వక్షస్థలం మీద భృగుమహర్షి తన్నడంతో, ఆ వక్షస్థలంలో నెలవైన లక్ష్మీదేవి అలిగి భూలోకానికి వచ్చినట్టు 'శ్రీవేంకటాచల మాహాత్మ్యం' కథ చెబుతోంది. వైకుంఠం నుంచి ప్రస్తుతం కొల్హాపూర్‌గా ప్రాచుర్యంలో ఉన్న నాటి కరవీరపురానికి లక్ష్మీదేవి అరుదెంచిన రోజు ఇదేనని ఒక కథనం. ఈ సంగతి తెలుసుకున్న కుబేరుడు అక్కడికి వచ్చి, ఆమెను పూజించి, లక్ష్మీ కటాక్షాన్ని పొందాడట! అందుకే దీన్ని 'కుబేర త్రయోదశి', 'ఐశ్వర్య త్రయోదశి' అని కూడా అంటారు.

**ఆయుర్దాయకం**

ఆశ్వయుజ బహుళ త్రయోదశిని 'యమ త్రయోదశి'గా కూడా పిలుస్తారు. ఈ రోజు సూర్యాస్తమయాన సమయంలో ఇంటి ద్వారానికి రెండు వైపులా మట్టి ప్రమిదల్లో దీపాలను వెలిగిస్తారు. వీటిని 'యమదీపాలు' అంటారు. ఈ దీప జ్వలనం వల్ల అకాల మృత్యుభయం ఉండదని విశ్వాసం.

**ఆరోగ్యప్రదం**

పురాణ గాథల ప్రకారం, క్షీరసాగర మథనంలో లక్ష్మీదేవితో పాటు ధన్వంతరి కూడా ఇదే రోజున జన్మించాడు. అందుకే ఈ రోజును 'ధన్వంతరి జయంతి'గా పాటిస్తారు. ఆయన శ్రీమహావిష్ణువు అంశ. ఆరోగ్యానికి అధిదేవత. ఆయుర్వేద వైద్యానికి మూలం ఆయనే! ఎలాంటి అనారోగ్యం లేకుండా చూడాలనీ, ఆరోగ్యాన్నీ ప్రసాదించాలనీ ధన్వంతరిని స్మరిస్తే ఆయన కటాక్షిస్తాడు.

సంపత్కారిణి అయిన శ్రీమహాలక్ష్మీనీ, ధనాధిపతి అయిన కుబేరుణ్ణీ ఈ రోజున భక్తిశ్రద్ధలతో పూజిస్తే సిరిసంపదలు, సౌభాగ్యం చేకూరుతాయని చెబుతారు. అందుకే లక్ష్మీదేవి రూపులను పూజామందిరంలో ఉంచి ఆరాధిస్తారు. ఈ రోజు బంగారం, వెండి విరివిగా కొనుగోలు చేయడం ఉత్తరాది ప్రాంతాల వారి ఆనవాయితీ. ఇప్పుడిది దేశమంతటికీ పాకింది. ఇలా విలువైన వస్తువులు ఈ రోజు కొంటే సంవత్సరమంతా తమ ఇళ్ళలో లక్ష్మీదేవి కొలువవుతుందని విశ్వాసం.

సొగసు

# ధనాధన్ త్రయోదశి!

**ధనలక్ష్మి ఇంట్లోకి నడిచి రావాలంటే ధనత్రయోదశి రోజు బంగారాన్ని ఇంటికి తెచ్చుకోవాలి. అయితే అలా కొనే నగలు సంప్రదాయంగా కనిపించేలా ఉండాలి. అదే సమయంలో ఆధునికత ఉట్టిపడేలానూ ఉండాలి. అలాంటి వాటిలో చెప్పుకోదగినవి డైమండ్ నగలు. ఈ ధనత్రయోదశి నాడు అలాంటి నగల్లో వెలిగిపోండి!**



## ఇవి కొంటే మేలు!

మరీ చిన్న పిల్లలైతే చెవులకు డెయిలీ వేర్ స్టడ్స్ తీసుకోవచ్చు. 13 ఏళ్ల ఆడపిల్లలకు మెడకు దగ్గరగా ఉండే క్లోజ్ సెట్టింగ్ కంఠి నెక్లెస్‌లు ఎంచుకోవాలి. ఊడదీసి ధరించడానికి వీలుండే డిటాచబుల్ పెండెంట్ ఉన్నవి ఎంచుకుంటే, వేర్వేరు హారాలతో కలిపి ధరించవచ్చు. టీనేజర్స్ ఝుంకాలు, డైమండ్ బ్రేస్‌లెట్స్, గృహిణులు లాంగ్ హారాలు ఎంచుకోవచ్చు. మధ్యవయసు మహిళలు తల మీద, కొప్పులకు ధరించే పాపటి బిళ్లలు, 8 నుంచి 10 వరసల చంపస్వరాలు తీసుకోవచ్చు. నల్లపూసల కుందన్ హారాలు బాగుంటాయి.

## ప్లెయిన్ గోల్డ్

కడాలు తాజా ట్రెండ్. నక్షి తరహా డిజైన్లు ఉన్న కడా 30 నుంచి 40 గ్రాముల బరువులో ఎంచుకోవచ్చు.



## ట్రెండ్‌కు తగ్గట్టుగా...

బంగారం ధర ఆర్థిక ఒడుదుడుకులు ఎదురైనప్పుడు తప్ప పెరుగుతూనే ఉంటుంది. రానున్న కాలంలో తులం బంగారం సుమారుగా 50 వేల రూపాయలకు చేరే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. 'ధనత్రయోదశి' రోజున బంగారం కొనాలనుకునేవారు ఝుంకీలు 30 గ్రాముల్లో, బ్రేస్‌లెట్, డైలీవేర్ పెండెంట్‌లు 20 గ్రాముల్లో, నెక్లెస్‌లు, ఇయర్ రింగ్స్ కలిపి తీసుకోవాలి. ప్రస్తుత ఫ్యాషన్ లాంగ్ హారం కాబట్టి వాటినీ ట్రై చేయొచ్చు.

## డైమండ్స్

అన్‌కట్, రోజ్ కట్ డైమండ్స్ ట్రెండ్ బాగా నడుస్తోంది. సాధారణ వజ్రాల కన్నా తక్కువ ధర పలికే రోజ్ కట్స్ వజ్రాలకు మించి మెరుపులు చిందిస్తాయి. కాబట్టి తక్కువ ఖర్చులో మెరిసిపోవాలనుకుంటే రోజ్‌కట్ డైమండ్ నగలు ఎంచుకోవచ్చు.





• మంజులా రావు
మంజుల జ్యువెల్స్,
హైదరాబాద్.



ఫ్యాషన్

# దివ్వెలతో పోటీపడాలంటే...!

దీపావళి పండుగనాడు దివ్వెల్లా వెలిగిపోవాలనుకుంటే, ధరించే దుస్తుల్లోనూ కొత్తదనం చూపించాలి. ఎలాంటి దుస్తులు ఎంచుకోవాలో అర్థం కాక, అయోమయంలో పడిపోయేవారి కోసం ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ నీతా లల్లా కొన్ని టిప్స్ చెబుతోంది. వాటిని మీరూ అనుసరించి చూడండి

**పాతవే కొత్తగా:** దీపావళి నాడు సంప్రదాయ వస్త్రధారణకే పెద్ద పీట వేయాలి. కాబట్టి నేత చీరాలు లేదా వింటేజ్ గాఘ్రాలు ధరించాలి. దీపావళి వెలుగులతో మ్యాచ్ అయ్యేలా బంగారు జరీ ఉన్న హాఫ్ వైట్ లేదా న్యూడ్ కలర్స్ ఎంచుకోవాలి. విభిన్నంగా కనిపించాలనుకుంటే తాజా ట్రెండ్ 'బుటీ వర్క్' కలిగిన దుస్తులు ఎంచుకోవాలి.

**ఈ దుస్తులు మేలు:** డబుల్ ఫ్యాబ్రిక్స్, లేయర్స్, షీర్స్ తాజా ఫ్యాషన్ ట్రెండ్. అయితే అవి షాంపెయిన్, వెనిల్లా, క్రీమ్ కలర్స్‌లో ఉండాలి. నలుపు రంగు ఆల్‌టైమ్ ఫేవరెట్ కాబట్టి పండుగ వేళ నలుపు డ్రెస్ ధరిస్తే ఎలా? అని కంగారుపడవలసిన అవసరం లేదు. పేస్టెల్ రంగుల్లో ఉండే సిల్కు కుర్తాలు, రంగురంగుల బుటీలు ఉన్న కాటన్ కుర్తీలు కూడా బాగుంటాయి. లేత నిమ్మపండు రంగు, మింట్ గ్రీన్, నీలం, బ్లష్ పింక్ రంగులు పండగ శోభను తెచ్చిపెడతాయి.

**ఈ రంగులు బాగు:** చిలకాకుపచ్చ, రాణీ పింక్, పసుపురంగు... ఇవి తాజా ట్రెండ్. చందేరి, బెనారస్ విత్ పటోలా, బంధని విత్ అజ్రక్... ఇలా రెండు రకాల స్టయిల్స్‌ను జోడించి ధరించవచ్చు.



**ట్విన్నింగ్:** పెద్దలు ధరించిన దుస్తులను పోలిన దుస్తులనే పిల్లలూ ధరించడాన్ని ట్విన్నింగ్ అంటారు. ఈ ట్రెండ్‌ను పండగనాడూ పాటించవచ్చు. సాధారణంగా ముదురు రంగులే పిల్లలకు నప్పుతాయి అనుకుంటారు. కానీ సున్నితమైన రంగులు కూడా పిల్లలకు నప్పుతాయి. రంగురంగుల షేర్వాణీలు, కుర్తీలు, లెహంగాలతో పిల్లలను పండగకు సిద్ధం చేయాలి.

బ్యూటీ

# చర్మం మెరుపు కోసం..



చర్మం మెరవాలంటే చర్మపు తేమను తగ్గించకుండా, మచ్చలు, ముడతలను తగ్గించే ఫేస్ ప్యాక్ వేసుకోవాలి. ఇందుకోసం బ్యూటీపార్లర్లకు వెళ్లవలసిన అవసరం లేదు. ఇంట్లోనే ప్యాక్ తయారుచేసుకుని వేసుకోవచ్చు. అదెలాగంటే....

- బంగాళాదుంపను ముక్కలుగా తరిగి, రెండు టీస్పూన్ల రోజ్‌వాటర్ చేర్చి, బ్లెండర్‌లో ముద్దగా తయారు చేసుకోవాలి. ఈ పేస్ట్‌ను ముఖం మీద పూసుకుని, ఆరిన తర్వాత కొద్ది నీళ్లతో తడిపి వేళ్లతో మసాజ్ చేయాలి. వృత్తాకారంలో సున్నితంగా మర్దన చేయడం వల్ల మృతకణాలు తొలగిపోతాయి. తర్వాత నీళ్లతో కడిగేసుకోవాలి.
- జిడ్డు చర్మం కలిగినవారైతే ఇదే మిశ్రమానికి ఒక టేబుల్‌స్పూను నిమ్మరసం జోడించి వాడాలి.
- పొడి చర్మం కలిగినవారైతే ఒక టేబుల్‌స్పూను తేనె కలపాలి.
- నార్మల్ స్కిన్ కలిగినవారు తేనె, నిమ్మరసం సమపాళ్లలో కలిపి వాడుకోవచ్చు.

ఫెస్టివ్ లుక్

# అలంకరణ అదిరిపోయేలా...

ఆకర్షణీయంగా కనిపించాలని తెలిసిన అలంకరణ చిట్కాలన్నీ పాటించకూడదు. ఎవరికి వారు ప్రత్యేకం. కాబట్టి శరీర తీరు, ఎంచుకునే దుస్తులను బట్టి చిన్న చిన్న అలంకరణ చిట్కాలు ఎంచుకోవాలి. అవేంటంటే....



- నగల మీద పెట్టే శ్రద్ధ కొందరు నుదుట ధరించే బొట్టు మీద పెట్టరు. కానీ ముఖానికి రెట్టింపు ఆకర్షణ ముచ్చటైన బొట్టుతో తెప్పించవచ్చు. కాబట్టి ఎరుపు రంగు డిజైనర్ బిందీ ఎంచుకోవాలి.
- బరువుగా, వేలాడే భారీ హ్యాంగింగ్స్ పండగ వేడుకల్లో నలుగురినీ ఆకర్షిస్తాయి. కాబట్టి రాళ్లు పొదిగిన ఫ్యాన్సీ హ్యాంగింగ్స్ ధరించాలి.
- పండగనాడు పువ్వుల గుబాళింపు ఒక్కటే సరిపోదు. పరిమళాలు వెదజల్లే పర్‌ఫ్యూమ్స్ కూడా వాడాలి. స్నానం చేసిన వెంటనే పర్‌ఫ్యూమ్ అద్దుకోవాలి.
- జుట్టు విరబోసుకోవచ్చు. లేదా చెవుల పక్కనుంచి పైకి దువ్వి క్లిప్ పెట్టుకోవచ్చు. మరింత ప్రత్యేకంగా కనిపించడం కోసం కొప్పు కూడా ప్రయత్నించవచ్చు. గులాబీలు, మల్లెలు, కనకాంబరాలతో అలంకరించుకుంటే పండగ శోభ వెల్లివిరుస్తుంది.

విశేషం

# యుగయుగాల వెలుగుల వేడుక!

**అజ్ఞాన తిమిరాన్ని పారద్రోలి జ్ఞానాన్ని వెలిగించడమే విశ్వశ్రేయస్సుకు మార్గం. అదే 'దీపావళి' అర్థం... పరమార్థం!**

ఆర్ష సాంప్రదాయంలో దీపమే పరబ్రహ్మ స్వరూపం. కాబట్టే-
**"దీపం జ్యోతి పరబ్రహ్మ దీపం సర్వతమోపహం**
**దీపేన సాధ్యతే సర్వం సంధ్యా దీపం నమో స్తుతే"** అని ఆర్యోక్తి.

"అజ్ఞానాంధకారాన్ని తొలగించి, సకలాభీష్ట పరమార్థాలనూ సిద్ధింప జేసే పరబ్రహ్మ స్వరూపమైన ఆ దివ్య పరంజ్యోతికి ప్రణామం" అని దీని భావం. మన హృదయాల్లో 'అజ్ఞానం' అనే నరకాసురుణ్ణి అంతమొందించి, జ్ఞానపూర్ణ పరమార్థ జ్యోతి అయిన 'శ్రీసత్యా-కృష్ణ పరంజ్యోతి'లో లీనమయ్యే ఆధ్యాత్మిక వికాసాన్నీ, మోక్ష పథాన్నీ పొందడం, తద్వారా విశ్వకల్యాణానికి దోహదపడడం దివ్య జ్ఞాన దీపావళిలోని పరమార్థం. యుగయుగాలుగా దీపావళి పర్వం భారతీయ ప్రజల జీవితాలతో పెనవేసుకుపోయిందని చాటి చెప్పే పౌరాణిక, ఐతిహాసిక, చారిత్రక గాథలెన్నో! వాటిలో కొన్ని:

## రోజుకో విశేషం!

**దీ**పావళి అయిదు రోజుల పర్వం. ప్రతి రోజుకూ ఒక విశిష్టత ఉంది.

**ధన త్రయోదశి:** ఆశ్వయుజ బహుళ త్రయోదశితో దీపావళి సంరంభం మొదలవుతుంది. ఆ రోజును 'ధనత్రయోదశి' అంటారు. క్షీరసాగరం నుంచి మహాలక్ష్మి ఆవిర్భవించిన దినం.

**నరక చతుర్దశి:** ప్రజాపీడకుడైన నరకాసురుడి వధ జరిగిన ఆశ్వయుజ బహుళ చతుర్దశిని 'నరక చతుర్దశి' అని పిలుస్తారు.

**దీపావళి:** ఆశ్వయుజ అమావాస్యను దీపావళిగా జరుపుకొంటారు. ఈ రోజు ఇల్లంతా దీపాలతో అలంకరిస్తే, ఆ ఇంట లక్ష్మి కొలువుంటుందని నమ్మకం.

**బలి పాడ్యమి:** వామనావతారి అయిన విష్ణువు పదఘట్టనకు పాతాళానికి వెళ్ళిన బలి చక్రవర్తి ప్రతి సంవత్సరం కార్తీక శుద్ధ పాడ్యమి రోజున భూలోకానికి వస్తాడట! అందుకే ఈ రోజును 'బలి పాడ్యమి' అంటారు. శ్రీకృష్ణుడు గోవర్ధ గిరిని ఎత్తిన రోజు ఇదేనని పురాణాలు చెబుతున్నాయి.

**యమ విదియ:** కార్తీక శుద్ధ విదియకు 'యమ విదియ', 'యమ ద్వితీయ', 'భాతృ విదియ' అనే పేర్లున్నాయి. యమధర్మరాజును ఆయన సోదరి యమునా దేవి ఈ రోజున ఆహ్వానించి, ఆతిథ్యం ఇచ్చిందట. దానికి సంతృప్తుడైన యముడు ఈ రోజున ఎవరు తన సోదరి ఇంట భోజనం చేస్తారో వారికి అపమృత్యు భయం, నరక బాధ ఉండవని వరం ఇచ్చాడట! దీన్నే 'భగినీ హస్త భోజనం' అనీ, ఉత్తరాదిన 'భాయ్ దూజ్' అనీ, అంటారు. లోకుల పాపపుణ్యాల చిట్టా రాసే చిత్రగుప్తుడి జయంతి కూడా ఈ రోజే!

### శ్రీకృష్ణ సత్య- ధర్మరక్షణ దీపావళి



**కృ**తయుగంలో శ్రీ వరాహస్వామి ద్వారా భూదేవికి జన్మించిన నరకాసురుడు లోకకంటకుడయ్యాడు. ధర్మసంస్థాపన కోసం ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడిగా మహా విష్ణువు అవతరించగా, సత్యభామగా భూదేవిగా జన్మించింది. వారి ద్వారా ఆశ్వయుజ బహుళ చతుర్దశి రోజున నరకాసుర వధ జరిగింది. నరక పీడను తొలగించిన సత్యభామా శ్రీకృష్ణులపై దివి నుంచి దేవతలు పుష్పవర్షం కురిపించారు. భువిలో మానవులంతా ఆనందోత్సాహాలతో ఆ మరునాడు ఇంటింటా తైల దీపాలను వెలిగించి చేసుకున్న పండుగే దీపావళి. పౌరాణికంగా ఎక్కువ ప్రాచుర్యంలో ఉన్న కథ ఇది. ఈ విధంగా అధర్మంపై సాధించిన విజయానికి చిహ్నంగా, ప్రధానంగా వెలుగుల పండుగగా దీపావళిని నిర్వహించడం సంప్రదాయం అయింది.

### బలి చక్రవర్తికి స్వాగత దీపావళి



**శ్రీ**మహావిష్ణువు వామనావతారంలో బలి చక్రవర్తిని మూడు అడుగుల నేలను దానంగా కోరాడు. ఒక అడుగుతో భూమినీ, రెండో అడుగుతో ఆకాశాన్నీ ఆక్రమించి, తుదిగా బలి ఆమోదంతో మూడో అడుగును అతని శిరస్సుపై ఉంచి పాతాళానికి అణిచేశాడు. బలి చక్రవర్తి తాత, తన భక్తుడు అయిన ప్రహ్లాదుడి కోరికపై ప్రతి సంవత్సరం ఒకసారి భూలోకానికి వచ్చి, భూలోక వాసుల సుఖ జీవనాన్ని చూసి ఆనందించే వరాన్ని బలికి శ్రీమహావిష్ణువు అనుగ్రహించాడు. దాన గుణానికి పేరుపొందిన బలి చక్రవర్తి భూమిపైకి రాగా, ప్రజలు సంతోషంగా దీపాలు వెలిగించి స్వాగతం పలికారట! అదే దీపావళి అయింది. అప్పటి నుంచి- అంటే కృతయుగం నుంచే దీపావళి పండుగ జరుపుకొంటున్నారని భవిష్యోత్తర పురాణంలో ధర్మరాజుతో శ్రీకృష్ణుడు చెప్పిన దీపావళి కథా విశేషం. దీపావళి మరుసటి రోజున బలిని పూజిస్తారు. కాబట్టి అది 'బలి పాడ్యమి'గా ప్రసిద్ధి చెందింది.

### యమధర్మరాజు పూజ

'**న**రకం' అంటే 'యమలోకం' అని స్థూలార్థం. 'నరకలోక విముక్తి కోసం యముణ్ణి భక్తి నిష్ఠలతో పూజించే విశేష పర్వం నరక చతుర్దశి' అని వ్రత చూడామణిలో- యమ ధర్మరాజు అనుగ్రహం కోసం పేర్కొన్న పూజా విధానాన్ని బట్టి తెలుస్తోంది. యమధర్మరాజు పూజకు ప్రతీకగా దీపాలు వెలిగించే పండుగ దీపావళి అనీ, దీని వల్ల నరక భీతి పోతుందనీ, స్వర్గ ప్రాప్తి కలుగుతుందనీ పురాణాల్లో పేర్కొన్నారు.

**చతుర్దశ్యాంతు యే దీపాన్ నరకాయ దదంతి చ**
**తేషాం పితృగణాః సర్వే నరకాత్స్వర్గ మాప్నుయుః**

ఆశ్వయుజ బహుళ చతుర్దశి రోజున ఎవరైతే దీపాలు వెలిగించి, యమధర్మరాజును పూజిస్తారో వారూ, వారి పితృదేవతలూ నరకలోక విముక్తులై, స్వర్గాన్ని పొందుతారని దీని అర్థం. కాబట్టి 'నరక చతుర్దశి' నాడు యముణ్ణి పూజించి, దీపాల బారులను వెలిగించాలి. ఆ దివ్య కాంతుల ద్వారా పితృ దేవతలకు స్వర్గ మార్గాన్ని చూపించడానికి అలా దీపాల వరుసను వెలిగించాలని ప్రాచీన గ్రంథాలు పేర్కొంటున్నాయి.

### రామరాజ్య దీపావళి



**త్రే**తాయుగంలో రావణుణ్ణి వధించిన శ్రీరాముడు అయోధ్యకు సీత, లక్ష్మణ, హనుమాదులతో విచ్చేసి పట్టాభిషిక్తుడయ్యాడు. అయోధ్య ప్రజలతో పాటు అన్ని లోకాల వారూ సంతోషంగా దీపాలు వెలిగించి ఉత్సవాలు చేసుకున్నారు. ఆనాటి నుంచి రామరాజ్య దీపావళిని ప్రజలు జరుపుకొంటూ వచ్చారని మరో గాథ. ఉత్తర భారతదేశంలో రావణ వధకు చిహ్నంగా దీపావళిని జరుపుకొనే వాడుక ఉంది.

### విక్రమార్క విజయోత్సవం



**కా**ళీమాత అనుగ్రహంతో దివ్యశక్తి సంపన్నుడైన విక్రమార్క చక్రవర్తి ఉజ్జయిని రాజధానిగా ఆర్యావర్తమంతటినీ మహోజ్జ్వలంగా, ఏకచ్ఛత్రాధిపత్యంగా సంవత్సరాలు పరిపాలించాడు. ఆయన రాజ్యాభిషిక్తుడైన రోజు నుంచి విక్రమ శకం పరిగణనలోకి వచ్చిందనీ, ఆనాటి నుంచి భారతీయులందరూ సంతోషంగా దీపావళి చేసుకోవడం ప్రారంభించారనీ కొందరు పండితుల అభిప్రాయం.

వీటిలో శ్రీరామ పట్టాభిషేకం, విక్రమార్క విజయగాథలు ప్రధానంగా ఉత్తర భారతదేశంలో ఎక్కువ ప్రచారంలో ఉన్నాయి. కాగా, నరకాసుర వధ కథ మాత్రం దేశమంతటా, ముఖ్యంగా ఉత్తరాదిలో ఎక్కువ ప్రసిద్ధి చెందింది.

### శ్రీ లక్ష్మీ పూజ



**ల**క్ష్మీ దేవి సకలైశ్వర్యప్రదాయని. 'దీప లక్ష్మీ నమోస్తుతే' అంటూ దీపాన్ని మహాలక్ష్మీ స్వరూపంగా సంభావించి, భక్తితో దీపావళి రోజున ఆరాధిస్తారు. ప్రధానంగా ఉత్తరాది రాష్ట్రాల్లో వ్యాపారులు లక్ష్మీ పూజ చేసి, కొత్త ఖాతా పుస్తకాలను పూజామందిరంలో ఉంచుతారు. తమ వ్యాపారాలు జయప్రదంగా సాగేట్టు చూడాలని లక్ష్మీ దేవిని ప్రార్థిస్తారు. ఇలా దీపావళి పండుగ చుట్టూ ఎన్నో పురాణ కథలు, గాథలు ఉన్నాయి. వీటన్నిటినీ స్మరించుకొని, ఆనందంగా పండుగ జరుపుకొందాం.

• 'కల్యాణశ్రీ' జంధ్యాల వేంకట శాస్త్రి

### దీపారాధనతో... ముగ్గురమ్మల పూజ

**దీప శిఖలో నీలం, పసుపు, తెల్ల రంగులు కనిపిస్తాయి. ఈ మూడు రంగులూ త్రిజగన్మాతలైన శ్రీమహాకాళి, శ్రీమహాలక్ష్మి, శ్రీమహాసరస్వతి దేవతలకు ప్రతిరూపాలని పురాణోక్తి. అంటే దీపారాధన చేయడం అంటే ఆ త్రిశక్తులనూ, వారితో కూడిన త్రిమూర్తులనూ పూజించినట్టేనని పెద్దల మాట.**



ధర్మపథం

# జ్ఞాన కాంతులకు ఆహ్వానం



**బౌ**ద్ధం- ప్రధానంగా మహాయాన బౌద్ధం ప్రపంచానికి నలభై పండుగలను అందించింది. మన దేశంలో అవి బౌద్ధ పండుగలుగా కనిపించకపోయినా- ఏదో ఒక సంప్రదాయంలో అవి ఇమిడిపోయి దర్శనమిస్తూనే ఉంటాయి. వాటిలో ముఖ్యమైనది దీపావళి.

ప్రపంచ తాత్త్విక చరిత్రలో జ్ఞానానికి దీపాన్ని సంకేతంగా తీసుకున్నది బౌద్ధమే. 'చీకటి నుంచి వెలుగుకు, వెలుగు నుంచి వెలుగుకు' అనే నినాదం బౌద్ధులదే! జ్ఞానానికీ, జ్ఞానోదయానికీ ప్రతీకగా దీపాన్ని బౌద్ధులు ఎంచుకున్నారు. అలాగే మరణానికి కూడా సంకేతంగా తీసుకున్నారు. భిక్షువుల మరణాన్ని 'నిర్వాణం' అంటారు. 'నిర్వాణం' అంటే దీపం పూర్తిగా మండి, ఆరిపోవడం. అలా పూర్తిగా కాలి, ఆరిపోయిన దీపాన్ని తిరిగి వెలిగించలేం. ఆ వత్తీ, ఆ నూనెలూ ఇక ఉండవు. అలాగే నిర్వాణం పొందాక - ఆ శరీరం, ప్రాణం ఉండవు. తిరిగి జన్మించవు. బౌద్ధుల అనాత్మవాదానికి సంకేతంగా బౌద్ధులు దీపాన్ని ఎంచుకున్నారు. అందుకే చావును సూచిస్తూ 'దీపం ఆరిపోయింది' అనే వాడుక వచ్చింది.

వర్షాకాలంలో భిక్షువులు గడిపే రోజులను 'వర్షావాసం' అంటారు. ఇది మూడు నెలలు. ఈ మూడు నెలలూ భిక్షువులు గ్రామాలకూ, ఇళ్ళకూ భిక్షకు వెళ్ళకూడదు. అడవిలోనో, ఏదో ఒక వనంలోనో లేదా గుహల్లోనో సమూహాలుగా గడపాలి. వర్షావాసం ఆషాఢ పున్నమితో మొదలవుతుంది. ఆశ్వయుజ పున్నమితో ముగుస్తుంది. లేదా శ్రావణ పున్నమితో మొదలై కార్తీక పున్నమితో ముగుస్తుంది. ఒక వర్షావాసం ముగిసిందంటే భిక్షువుగా అతనికి ఒక సంవత్సరం ముగిసినట్టు. భిక్షువులకు నెలలో నాలుగు రోజులు ముఖ్యమైనవి. అవి శుద్ధ అష్టమి, పూర్ణిమ, బహుళ అష్టమి, బహుళ చతుర్దశి. వర్షావాసం వీడిన భిక్షువులకు పున్నమి రోజున కొత్త చీవరాలు (భిక్షువులు ధరించే దుస్తులు) దానం చేస్తారు. దీన్ని 'కఠిన చీవర దానం' అంటారు. చనిపోయిన భిక్షువుల చితులపై పెద్ద పెద్ద సమాధులు నిర్మించే ఆచారం ఉంది. బుద్ధుని అస్థికల మీద అశోకుడు 84,000 స్తూపాలు నిర్మించాడు. మరణాన్ని దీపం ఆరిపోవడంగా భావించిన బౌద్ధులు తమ వర్షవాసానికి ముగింపుగా చైత్యాలూ, స్తూపాల మీద దీపాలు ఉంచేవారు. అలా చైత్యాల మీద వరుసలుగా దీపాలు అలంకరించడంతో దాన్ని 'దీపావళి' అని పిలుస్తారు. ఈ పండుగను 'ఉల్లంబన' అంటారు. అంటే పెద్దల పండుగ. మరణించినవారి స్మృతికి అంజలి ఘటించి, పిండ దానం (ఆహారాన్ని సమర్పించడం) జరుగుతుంది. పాతతరాన్ని స్మరిస్తూ, కొత్త ఏడాదిలోకి అడుగు పెడుతున్న సందర్భంగా బౌద్ధులు దీపావళిని జరుపుకొంటారు. ధర్మ ప్రచారకులైన భిక్షువులకు ఆహ్వానం పలుకుతూ, ఇంటింటా దీపాలు వెలిగించే సంప్రదాయం ఉండేది (ఇప్పటికీ అనేక బౌద్ధ దేశాల్లో కొనసాగుతోంది). అదే 'ఇంటింటి దీపావళి'గా వినతికెక్కింది. అజ్ఞానపు చీకట్లను తరుముతూ, జ్ఞాన కాంతులకు పలికే ఆహ్వానమే 'బౌద్ధ దీపావళి'.

• బొర్రా గోవర్ధన్

సమాచారం

## దక్షిణ భారత వేద సమ్మేళనం

అపురూపమైన వేదాలను సంరక్షించాలనే లక్ష్యంతో కర్ణాటకలోని శ్రీ సోందా స్వర్ణవల్లి మఠం దక్షిణ భారత సమ్మేళనాన్ని నవంబరు రెండోతేదీ నుంచి నాలుగో తేదీ వరకూ నిర్వహిస్తోంది. ఆ రాష్ట్రంలోని ఉత్తర కన్నడ జిల్లా శిరసిలోని శ్రీ సోందా స్వర్ణవల్లి క్షేత్రంలో జరిగే ఈ కార్యక్రమానికి స్వర్ణవల్లిలోని రాజరాజేశ్వరీ విద్యా సంస్థ, మహర్షి సాందీపని జాతీయ వేద విద్యా ట్రస్టు సహకారాన్ని అందిస్తున్నాయి. వాదిరాజ మఠాధిపతి వల్లభ తీర్థ స్వామీజీ సమక్షంలో ఈ సమ్మేళనం ప్రారంభం అవుతుంది. ఈ సందర్భంగా ఉప వేదాలకు సంబంధించిన ప్రత్యేక చర్చా గోష్ఠులు ఉంటాయని మఠాధిపతి గంగాధరేశ్వర సరస్వతి స్వామీజీ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి నాలుగు వేదాల్లోని ఎనిమిది శాఖలకు చెందిన 150 మందికి పైగా విద్వాంసులు దీనిలో పాల్గొంటారు.

నవజీవన వేదం

# పని మీదే దృష్టి ఉండాలి!



**భ**గవద్గీతలో అందరూ ముఖ్యమైనదిగా భావించే శ్లోకం ఇది. దీనికి నవజీవనంతో ఎంత అనుబంధం ఉందో చూడండి.

**కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన**
**మా కర్మఫల హేతుర్భూర్మా తే సంగోస్త్వ కర్మణి**

ఈ ఒక్క శ్లోకం గుర్తుపెట్టుకుంటే సంసారాలు, ఉద్యోగాలు, వ్యాపారాలు, వ్యవసాయం... అన్నీ ఎటువంటి ఆటంకాలు లేకుండా నడుస్తాయి. "అర్జునా! 'కర్మణ్యేవాధికారస్తే' - అంటే పని చేసేటప్పుడు పనిమీదే దృష్టి పెట్టు. 'మా ఫలేషు కదాచన' - అంటే పని తాలూకు ఫలితంపై కాదు. ఇప్పుడు యుద్ధం మీద దృష్టి పెట్టు. కర్మఫలానికి నువ్వొక్కడివే కారణమని అనుకోకు. అలాగే పని చేయడం మానేయవద్దు" అని శ్రీకృష్ణపరమాత్మ బోధిస్తున్నాడు. ఇప్పుడు ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. ఆందోళన ఎక్కువైంది. ఎందుకు? టార్గెట్ మీద దృష్టి పెట్టడం వల్ల! ఫలితంపై దృష్టి పెట్టడం వల్ల!! అలా కాకుండా పని మీద దృష్టిపెట్టాలి. అప్పుడు ఫలితం దానంతట అదే వస్తుంది.

• • •

**చూడాల్సింది హోదాలు కాదు!**

**విద్యచే భూషితుండయి వెలయుచున్న**
**తొడరి వర్జింపనగు సుమీ దుర్జనుండు**
**చారు మాణిక్య భూషిత శస్తమస్త**
**కంబైన పన్నగము భయంకరము గాదె!**

ఇవ్వాళ సమాజంలో దీని గురించి ప్రధానంగా చెప్పుకోవాలి. ఎందుకంటే విద్యావంతుల వల్లనే సమాజం చెడిపోతోంది. 1985 ప్రాంతాల నుంచి ఈ ధోరణి మొదలైంది. తెలుగు మీడియం పాఠశాలల స్థానంలో ఇంగ్లీషు మీడియం పాఠశాలలు వచ్చి చేరడం ప్రారంభమైంది. ఎంసెట్ కోచింగ్‌లు పెరిగాయి. ఇంజనీరింగ్ ప్రాధాన్యం పెరిగింది. విద్యార్థికి ఇష్టం లేకపోయినా డబ్బులొచ్చే విద్యను చదివించడం పెరిగింది. నిజానికి మనిషి ఎంత విద్యావంతుడైనా సరే ఆ మనిషి మంచివాడో, కాదో చూడాలి. అంతేకానీ ఆయన డిగ్రీలు, హోదాలు చూడకూడదు. విద్య మణి లాంటిది. కానీ, దుర్జనుడు పాములాంటి వాడు. 'మణి ఉంది కదా!' అని పాము దగ్గరకు వెళితే కాటేస్తుంది కదా! అలాగే ఎంత చదువుకున్నా.. చెడ్డవాడు చెడ్డవాడే! ఇవ్వాళ పెళ్లి సంబంధాలు చూసే, కుదుర్చుకునే విషయంలో జీతం ఎంత సంపాదిస్తున్నాడో చూస్తున్నారే తప్ప 'దుర్జనుడా, సజ్జనుడా' అని చూడడం లేదు. ఈ విషయంలో తల్లితండ్రులు అందరూ ఒక్కసారి ఆలోచించాలి.



• డా. గరికిపాటి నరసింహారావు

దైవమార్గం

# విశ్వాసంపై వ్యాపారం కూడదు!



**వ్యా**పార ధోరణి మిళితమైన ఆధునిక జీవన శైలితో వచ్చిన చిక్కేమిటంటే మనిషిలో అది అధికార దాహం, విలాసాలు, సుఖభోగాల పట్ల ఆసక్తిని రేకెత్తిస్తుంది. వాటికోసం వెంపర్లాడేలాగా చేస్తుంది. యుగయుగాలుగా అతనిలో నిక్షిప్తమై ఉన్న పూర్వ సంస్కృతి తాలూకు ఆత్మీయత, దైవ భయం, దైవభక్తి నుంచి దూరమైతే తప్ప మనిషి ఆధునికతతో అల్లుకుపోలేడు. కాబట్టి జీవన శైలిలో పెచ్చరిల్లుతున్న వ్యాపార సంస్కృతి చేసే కుట్ర, దాని లక్ష్యం వాటిని దూరం చేయడమే. బైబిల్ పాతనిబంధన నాటి ప్రవక్తలు యెషయా, యిర్మీయా 2,700 ఏళ్ళ క్రితమే ఈ సామాజిక దౌర్బల్యాన్నీ, వ్యాపార సంస్కృతినీ తమ ప్రవచనాల్లో క్షుణ్ణంగా చర్చించారు.

కాలం గడిచే కొద్దీ మార్పు సహజమే. అయినా ఆలోచనల్లో, జీవనవిధానాల్లో స్వార్థం అంతరించి సమష్టి తత్త్వం విస్తరించాలన్నది యేసుక్రీస్తు ప్రబోధాల మూలాంశం. అయితే పెచ్చరిల్లే వాణిజ్య సంస్కృతి దానికి గొడ్డలి పెట్టయ్యింది. అందుకే మతపెద్దలైన శాస్త్రులు, పరిసయ్యుల ద్వంద్వ ప్రవృత్తినీ, వ్యాపార దృష్టినీ ఖండిస్తూ "వేషధారులారా! ధర్మశాస్త్రం బోధించే కనికరాన్నీ, న్యాయాన్నీ వదిలేసి దోమలను వడగట్టి, ఒంటెల్ని దిగమింగేవారు మీరు!" అని ప్రభువు గద్దించాడు. మతం వ్యాపారమైతే దేవుడికి మనిషి ఎంత దూరమవుతాడో, అది ఎంత ప్రమాదకరమో యేసు ప్రభువు తన బోధల్లో వివరించాడు. ఈ జీవన శైలికి బాధితులైన నిరుపేదలు, దీనులు, నిరాశ్రయులను పల్లెత్తుమాట కూడా అనలేదు సరికదా, "వాళ్లంతా ధన్యులు" అన్నాడు ప్రభువు. అయితే మతపెద్దలను మాత్రం ఆయన తీవ్రంగా దుయ్యబట్టాడు. ఒకసారి నేరుగా దేవాలయానికి వెళ్లి అక్కడి వ్యాపారాల మీదా, వ్యాపారుల మీదా కొరడా ఝుళిపించాడు. తనను శిలువ వేసిన శత్రువులందరినీ ప్రేమించి క్షమించిన యేసు దేవాలయాన్ని వ్యాపారాలకు నిలయంగా మార్చిన వారిని మాత్రం క్షమించలేదు (మత్తయి 21:12). అవును మరి! కట్లపాము ఇంట్లో దూరితే దాన్ని క్షమిస్తామా, కర్ర అందుకుంటామా?

• సుశీల్ సందేశ్

## డైలీ సుడోకు -176

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 3 | | 8 | 4 | 7 | 9 | | |
| 7 | | | 5 | | 6 | | | |
| | 5 | | | 2 | 9 | | | |
| 5 | | | 2 | 8 | 4 | 1 | 9 | |
| 9 | | | 7 | 5 | 3 | | | 4 |
| | 2 | 8 | 9 | 6 | 1 | | | 3 |
| | | | 3 | 7 | | | 4 | |
| | | | 6 | | 8 | | | 1 |
| | | 7 | 4 | 1 | 2 | | 3 | 8 |

**సుడోకు - 175 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 7 | 3 | 6 | 1 | 9 | 8 | 4 | 2 | 5 |
| 5 | 2 | 8 | 3 | 4 | 6 | 1 | 9 | 7 |
| 4 | 9 | 1 | 7 | 2 | 5 | 3 | 6 | 8 |
| 2 | 4 | 7 | 6 | 8 | 3 | 9 | 5 | 1 |
| 9 | 8 | 3 | 2 | 5 | 1 | 7 | 4 | 6 |
| 6 | 1 | 5 | 9 | 7 | 4 | 2 | 8 | 3 |
| 3 | 6 | 2 | 8 | 1 | 9 | 5 | 7 | 4 |
| 8 | 5 | 9 | 4 | 3 | 7 | 6 | 1 | 2 |
| 1 | 7 | 4 | 5 | 6 | 2 | 8 | 3 | 9 |

**ఎలా పూరించాలి?** ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.


RASAMAYI FILMS
'Dil' Raju Release
దీపావళి శుభాకాంక్షలతో...
తుపాకి రాముడు
నేడే విడుదల
రసమయి బాలకిషన్ టి. ప్రభాకర్


ADITYA MUSIC
నేడే విడుదల
వనవాసం
EDITOR: PRABHU & NAGA VIJAYKUMAR.M REDSTUDIO'S PRO: MADHU VR DAILOGUES: RAVINAYAK
ఈ రోజు విడుదల కానున్న మా ఈ "వనవాసం" చిత్రానికి మద్దతిచ్చి ప్రోత్సహించిన త్రివిక్రమ్ గారికి,
సునీల్ గారికి మరియు అల్లరి నరేష్ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు - వనవాసం టీం


GRAND RELEASING ON 01-11-2019
VENKAAT MOVIES PRODUCTIONS
దండుపాళ్యం 4
THE CRIMES TO BE CONTINUED
PRODUCER VENKAAT
DIRECTOR K.T.NAYAK
CINEMATOGRAPHER R.GIRI - BENAKARAJU MUSIC ANAND RAJA VIKRAMA EDITOR BABU A SRIVATSAVA - PREETH MOHAN
DIALOGUES/LYRICS RAJASHEKARA REDDY STUNTS KUNGFU CHANDRU CHOREOGRAPHER BABA BHASKAR PRO VENUGOPAL
ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రిలీజ్ వెంకట్ మూవీస్: 96200 00197 - 6301444130
గుంటూరు: రాఘవేంద్ర సాయి యాడ్స్: 9963099995, సీడెడ్: బాబా ఫిలింమ్స్ MOB: 8328109848, 9393823182


OAK
నవ్వుల HIT
2ND WEEK
SUCCESS TOUR
VIZAG E.GODAVARI 25TH OCT
W.GODAVARI KRISHNA GUNTUR 26TH OCT
ONGOLE NELLORE TIRUPATHI 27TH OCT
రాజు గారి గది 3
OHMKAR
OAK ENTERTAINMENTS


ags entertainment
MAHESH S KONERU
KALPATHI S.AGHORAM
THALAPATHY VIJAY
బిగిల్
WRITTEN & DIRECTED BY ATLEE
MUSIC BY A R RAHMAN
PRODUCED BY KALPATHI S.AGHORAM KALPATHI S.GANESH KALPATHI S.SURESH
CREATIVE PRODUCER ARCHANA KALPATHI
నేడే విడుదల


DREAM WARRIOR PICTURES
VIVEKANANDA
దీపావళి శుభాకాంక్షలతో...
నేడే విడుదల
Sri Sathya Sai Arts
K.K.Radhamohan presents
KARTHI
ఖైదీ
WRITER, DIRECTOR LOKESH KANAGARAJ
DOP SATHYAN SOORYAN MUSIC SAM CS EDIT PHILOMINRAJ ART N.SATHEESKUMAR STUNTS ANBARIV
EXECUTIVE PRODUCER ARAVENDRAJ BASKARAN
PRODUCED BY SR PRAKASHBABU SR PRABHU TIRUPPUR VIVEK





విజయవాడ కృష్ణలంక బాలాజీ నగర్‌లోకి వరద రావడంతో ఇళ్లను ఖాళీ చేస్తున్న బాధితులు

గుంటూరు జిల్లా దాచేపల్లి మండలం రామాపురం పల్లెకారుల కాలనీలో వరద నీరు చేరడంతో ఇంటి పైకప్పు పైకి సామగ్రి తరలిస్తున్న బాధితులు



విజయనగరం జిల్లా భోగాపురంలో నీట మునిగిన గృహాలు, ఇల్లంతా జలమయం కావడంతో దిక్కుతోచని స్థితిలో మహిళ

# ఉత్తరాంధ్రలో వర్ష బీభత్సం

## వేలాది ఎకరాల్లో పంట పొలాలు మునక



విజయనగరం జిల్లా నెల్లిమర్ల-రామతీర్థం రోడ్డులో కాజ్‌వేపై నుంచి ప్రవహిస్తున్న చంపావతి నది

- పలు రహదారులు ఛిద్రం, రాకపోకలు బంద్
- కుంటికోట వద్ద వరద నీటిలో వ్యక్తి గల్లంతు
- గొట్టా బ్యారేజీ 22 గేట్లు ఎత్తివేత
- సువర్ణముఖీ నదిపై కుంగిన అంతర్రాష్ట్ర వంతెన

శ్రీకాకుళం/విజయనగరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో ఉత్తరాంధ్ర జిల్లాలు అతలాకుతలం అవుతున్నాయి. గురువారం శ్రీకాకుళం జిల్లాఅంతటా వర్షాలు కురిశాయి. వంశధార , నాగావళి, మహేంద్ర తనయ, బహుదా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వందలాది ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. దాదాపు 6వేల హెక్టార్ల వరిపంట నీట మునిగిందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. నీటి ఉధృతి పెరుగుతుండడంతో గొట్టా బ్యారేజీ 22గేట్లు ఎత్తివేశారు. పెదరోకలపల్లి రహదారి వంతెనపై నుంచి వరద ప్రవహించింది. రెంటికోట గ్రామం వద్ద కాలువ గట్టు తెగిపడటంతో ఆంధ్రా, ఒడిశా మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి. ఉప్పుటేరు ఉధృతికి పూడిలంక గ్రామం వరదలో చిక్కుకుపోయింది. శ్రీకాకుళం జిల్లా మందస మండలం కొర్రాయిగేటు- కుంటికోట రహదారిలో సంకుజోడి కాలువను దాటుతుండగా సరియాపల్లి గ్రామానికి చెందిన గస్యావాసు(52) గల్లంతయ్యాడు. పక్కనే ఉన్న చెట్టును పట్టుకొనే ప్రయత్నం చేసినా, అది విరిగిపోవటంతో ప్రవాహంలో చిక్కుకున్నాడు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు విజయనగరం పట్టణం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ప్రధాన మార్కెట్‌కు వెళ్లే రోడ్డులోకి పెద్ద చెరువు నీరు ప్రవహించింది. గుర్ల సమీపంలోని ఎస్‌ఎస్‌ఆర్ పేట వద్ద కెల్ల గెడ్డ పొంగడంతో పాలకొండ, రాజాం, చీపురుపల్లి, గరివిడి వెళ్లాల్సిన బస్సులు నిలిచిపోయాయి. నెల్లిమర్ల వద్ద చంపావతి నది కాజ్‌వే పై నుంచి ప్రవహించింది. 15వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. సీతానగరం మండలంలో సువర్ణముఖి నదిపై ఉన్న అంతర్రాష్ట్ర వంతెన మధ్యభాగం కుంగింది. ఇప్పటికే శిథిలమైన ఈ వంతెన వర్షాలకు బాగా నానిపోయి శ్లాబు బీటలిచ్చి కిందకు కుంగిపోయింది. పోలీసులు వంతెన పైనుంచి రాకపోకలను నిలిపేశారు.



తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి రూరల్‌లో నీట మునిగిన వరి

### కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం

విశాఖపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉత్తర కోస్తా, దక్షిణ ఒడిశాను ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. దాని ప్రభావంతో రాగల 24గంటల్లో పలుచోట్ల ఉరుములు, మెరుపులతో ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఒకటి, రెండుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. గురువారం అనంతపురంలో 10సెంటీమీటర్లు, పాతపట్నంలో 6, కొమరాడలో 4, ఇచ్ఛాపురంలో 3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

### పలు రైళ్లు రద్దు

విశాఖపట్నం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా విజయనగరం రైల్వేస్టేషన్ యార్డులో నీరు నిలిచిపోవడంతో ట్రాక్ సర్క్యూట్లు దెబ్బతిన్నాయి. ఈ కారణంగా పలు రైళ్లను రద్దు చేసినట్టు తూర్పు కోస్తా రైల్వే అధికారులు తెలిపారు. విశాఖలో గురువారం బయలుదేరాల్సిన విశాఖపట్నం-బెర్హంపూర్ పాసింజర్ (58526), శుక్రవారం బెర్హంపూర్- విశాఖపట్నం పాసింజర్ (58525), విశాఖలో గురువారం బయలుదేరాల్సిన విశాఖపట్నం-భువనేశ్వర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్(22820), శుక్రవారం భువనేశ్వర్‌లో బయలుదేరాల్సిన భువనేశ్వర్-విశాఖపట్నం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్(22819)లను రద్దు చేశారు. జగదల్‌పూర్-భువనేశ్వర్ హీరఖండ్ ఎక్స్‌ప్రెస్ (18448)ను రీషెడ్యూల్ చేశారు.

### విరిగిపడిన కొండచరియలు

అనంతగిరి/అరకులోయ, అక్టోబరు 24: కొత్తవలస-కిరండోల్ (కేకే లైన్) రైలుమార్గంలో గురువారం కొండచరియలు విరిగిపడ్డాయి. చిమిడిపల్లి-బొర్రా స్టేషన్ల మధ్య ట్రాక్‌కు ఆనుకుని ఉన్న కొండచరియలు జారిపడ్డాయి. ఈ సమయంలో చెట్లు విరిగి ఓహెచ్‌ఈ లైన్‌పై పడి 2500వాట్ల విద్యుత్ తీగలు తెగిపోయి మంటలు చెలరేగాయి. ఈ ఘటనతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది

## శ్రీశైలానికి భారీ వరద

- 6.63లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 10 గేట్ల నుంచి నీటి విడుదల

శ్రీశైలం/విజయవాడ/గుంటూరు, అక్టోబరు 24: ఎగువ ప్రాజెక్టుల నుంచి శ్రీశైలం డ్యాంకు భారీ వరద కొనసాగుతోంది. దీంతో డ్యాం 10 క్రస్ట్‌గేట్లను ఎత్తి సాగర్‌కు నీరు విడుదల చేస్తున్నారు. డ్యాం నీటిమట్టం గురువారం సాయంత్రం 6గంటల సమయానికి 884.20 అడుగులు, నీటి నిల్వ 210.9946 టీఎంసీలుగా నమోదయ్యాయి. జూరాల, తుంగభద్ర నుంచి జలాశయానికి 6,63,054 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డ్యాం 10 గేట్లను ఎత్తి 5,47,630 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఔట్‌ఫ్లో 6,16,147 క్యూసెక్కులు ఉంది.

### ఒకే ఏడాది ఏడుసార్లు గేట్ల ఎత్తివేత

శ్రీశైలం ప్రాజెక్టు రికార్డుల పరంపర కొనసాగిస్తోంది. 14ఏళ్ల అనంతరం ఒక ఏడాదిలో ఏడుసార్లు క్రస్ట్‌గేట్లను తెరచి నీటిని విడుదల చేసిన ఘనతను సాధించింది. 1984లో శ్రీశైలం డ్యాంను జాతికి అంకితం చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు 14సార్లు మాత్రమే 10 క్రస్ట్‌గేట్లు తెరిచి సాగర్‌కు నీరు విడుదలచేశారు. 1990, 1991, 1993, 1996, 1997, 1998, 2005లో జూన్, సెప్టెంబరు, అక్టోబరులో, 2009, 2011, 2013లో జూలై, జనవరిలో, మళ్లీ ఆరేళ్ల తరువాత ఈ ఏడాదిలోనే 10క్రస్ట్‌గేట్లు తెరిచారు. డ్యాం ప్రారంభమైనప్పటి నుంచి 2005లో ఏడుసార్లు క్రస్ట్‌గేట్లు తెరిచారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఒకే ఏడాదిలో ఏడుసార్లు క్రస్ట్‌గేట్లు తెరిచిన సందర్భాలు లేవు. గతంలో 1994లో ఒకే ఏడాదిలో 8సార్లు గేట్లను ఎత్తారు. 2019లోనూ ఏడుసార్లు క్రస్ట్‌గేట్లను తెరిచి సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. కాగా, కృష్ణమ్మ ఉధృత ప్రవాహం లోతట్టు ప్రాంతాల్లోని పొలాలు, తోటలు, నివాస ప్రాంతాలను ముంచెత్తింది. సాగర్ నుంచి విడుదల చేసిన అదనపు నీటితో గుంటూరు జిల్లా దాచేపల్లి మండలం రామాపురం పల్లెకారుల కాలనీలోకి వరద చేరింది. 60కి పైగా ఇళ్లు నీటమునిగాయి.

## చుట్టూ నీళ్లున్నా..!

- నిండని చెరువులు, రిజర్వాయర్లు
- కర్నూలు జిల్లాలో విచిత్ర పరిస్థితి

కర్నూలు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా చుట్టూ వరదనీరు పారుతోంది.. కానీ జిల్లాలో మాత్రం నీటి ప్రవాహం లేదు. కర్ణాటక, మహారాష్ట్రల్లో కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణా నదికి వరద వస్తోంది. శ్రీశైలం జలాశయంలోకి దాదాపు 86 రోజులుగా వరద కొనసాగుతోంది. ఆ నీరు వృథాగా సముద్రంలో కలిసిపోతోంది. శ్రీశైలం నుంచి అటు రాయలసీమకు నీరివ్వాలన్నా.. ఇటు సాగర్‌కు పంపాలన్నా కర్నూలు జిల్లా గుండానే పంపాలి. జిల్లాలోని 72% రిజర్వాయర్లు నిండినా.. చెరువులను మాత్రం జిల్లా యంత్రాంగం నింపలేకపోయింది. 50 మండలాల్లో 574 చెరువులు ఉండగా.. 93 మాత్రమే వంద శాతం నిండాయి. 30% పైన నిండినవి 118 ఉండగా, 20-30 శాతం లోపు నిండినవి 139 చెరువులున్నాయి. నేటికీ 224 చెరువులు చుక్క నీరు లేక బీడు గుంతలుగా దర్శనమిస్తున్నాయి. హొళగుంద నుంచి కర్నూలు వరకు ఉన్న 198 చెరువుల్లో నీరు నిల్వ చేయలేని పరిస్థితి ఏర్పడింది. నంద్యాల పరిసరాల్లోని 14 చెరువుల్లోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది. వరదలకు కట్టలు కొట్టుకుపోయాయి. మరమ్మతులకు ఒక్కో చెరువుకు రూ.10 లక్షల ఖర్చవుతుంది. పశ్చిమ ప్రాంతం, నంద్యాలతోపాటు మరో 156 చెరువులు కూడా ఇదే పరిస్థితిలో ఉన్నాయి. రూ.10 లక్షల చొప్పున దాదాపు 368 చెరువులకు మరమ్మతులు చేపట్టాలంటే రూ.36.8 కోట్లు అవసరం.

## అయ్యో..ఆర్థికం!

(మొదటి పేజీ తరువాయి)

విలీనం చేసింది. 'మీరు కోరినంత ఇవ్వలేం. కానీ, వెయ్యి కోట్ల వరకు ఇవ్వగలం' అని ఆ బ్యాంకు అధికారులు చెప్పినట్టు తెలిసింది. అదే సమయంలో... దీనికి తాము విలీనం అయిన మరో బ్యాంకు ఆమోదం కూడా తప్పనిసరని చెప్పినట్టు సమాచారం. ఈ విషయంపై ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఎస్ రావత్‌ను గురువారం ఫోన్‌లో, మెసేజ్ ద్వారా సంప్రదించగా ఆయన స్పందించలేదు.

### అప్పుతోనే జీతాలు

నవంబరు 1వ తేదీన ప్రభుత్వోద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇచ్చే వేతనాలు, పెన్షన్ల కోసం అప్పు చేయక తప్పని పరిస్థితి నెలకొంది. 1వ తేదీ నాటికి ఖజానాలో రూ.1400 కోట్ల వరకు ఉండే అవకాశాలున్నాయి. 29వ తేదీన ఆర్‌బీఐ నుంచి రూ.1000 కోట్లు రుణం, ఎస్‌డీఎల్ నుంచి రూ.1500 కోట్లు, వేస్ అండ్ మీన్స్ నుంచి రూ.1500 కోట్లు చేబదులుగా తీసుకోవాల్సి ఉంటుంది. వేస్ అండ్ మీన్స్ నుంచి తెచ్చే నిధులపై రెపో రేటు కంటే 1 శాతం తక్కువ వడ్డీ, ఎస్‌డీఎల్ నిధులపై రెపో కంటే 2 శాతం తక్కువ వడ్డీ పడుతుంది. ఉద్యోగుల జీతాలు, పెన్షన్లకు ఇవి సరిపోయినా... నవంబరు 3 తర్వాత నుంచి సంక్షేమ పెన్షన్ల చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. ఈలోగా ఖజానాలోకి నిధులు వస్తే ఇబ్బంది లేదు. లేదంటే మరోసారి ఓవర్ డ్రాఫ్ట్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది.

### బాండ్ల వేలం ఉండకపోవచ్చు

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా బాండ్ల వేలం వేసి ప్రతి వారం రూ.1000 కోట్లు రుణం సమీకరించుకునే అవకాశం డిసెంబరు నెల తర్వాత ఉండకపోవచ్చని ఆర్థిక శాఖ అధికారులు భావిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 9 నెలలకు గాను రూ.29,000 కోట్లు రుణం తీసుకునేందుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. ఇందులో అక్టోబర్ 15వ తేదీ నాటికి రూ.24,000 కోట్లు తీసుకున్నారు. ఇంకా రూ.5,000 కోట్ల రుణం సమీకరించుకునే అవకాశం ఉంది. ఈ రూ.5,000 కోట్లు ప్రస్తుతం ఏపీ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల ఒక్క నెల వేతనాలు, పెన్షన్లకు సరిపోవు.

### జనవరిలో పరిస్థితేంటి?

గత ఏడాది సెప్టెంబరుతో పేల్చితే ఈ ఏడాది సెప్టెంబరులో రాష్ట్ర ఆదాయం 12.5 శాతం వరకు తగ్గింది. అక్టోబరులోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. బాండ్ల వేలం ద్వారా రుణ సమీకరణ అవకాశాలూ కనుమరుగవుతున్నాయి. ఇన్ని ఆర్థిక దిగ్బంధనాల నేపథ్యంలో... జనవరి నెలలో వచ్చే అమ్మ ఒడి, రెండో విడత రైతు భరోసా చెల్లింపులు ఆర్థిక శాఖ అధికారులను కలవర పరుస్తున్నాయి. జనవరి 26వ తేదీన నవరత్నాల్లో ఒకటైన 'అమ్మ ఒడి' పథకం ప్రారంభిస్తున్నారు. ఈ పథకం కింద ఒక్కో లబ్ధిదారుకి రూ.15,000 ఇవ్వనున్నారు. రైతు భరోసాను మించిన భారీ పథకం ఇది. ఇందుకు బడ్జెట్లో రూ.6455 కోట్లు కేటాయించారు. ఇది కాకుండా రైతు భరోసా రెండో విడత నిధులను జనవరిలోనే విడుదల చేయాల్సి ఉంది. ఇవి కాకుండా కొత్త జిల్లాల ప్రతిపాదన కూడా ఉంది. జనవరి నాటికి కొత్త జిల్లాల ప్రకటన కూడా పూర్తవుతుందని భావిస్తున్నారు. అంటే మరో 13 జిల్లాలు కొత్తగా వచ్చి చేరతాయి. ఇది కూడా ఖర్చుతో కూడుకున్న వ్యవహారమే. వీటన్నింటికీ నిధులు ఎక్కడి నుంచి తేవాలో తెలియక ఆర్థిక శాఖ సతమతమవుతోంది.

**ఆదాయం...**

రాష్ట్రానికి సగటున నెలకు రూ.10,000 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. ఇందులో కేంద్రం నుంచి వచ్చే పన్నుల్లో వాటా, వివిధ పథకాలకు, ప్రాజెక్టులకు వచ్చే గ్రాంట్లు రూ.4500 కోట్ల నుంచి రూ.5,000 కోట్ల వరకు ఉంటాయి. రాష్ట్ర సొంత ఆదాయం మరో రూ.4,500 కోట్ల నుంచి రూ.5,000 కోట్లు.

**ఖర్చు...**

నెలకు సగటున వచ్చే పదివేల కోట్ల ఆదాయంలో... ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లకు రూ.5,400 కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోంది. సంక్షేమ పెన్షన్లకు రూ.1000 కోట్లు, లోన్లు, వాటి వడ్డీల చెల్లింపులకు రూ.2,500 కోట్ల వరకు చెల్లించక తప్పనిసరి పరిస్థితి. ఈ 3 పద్దుల మొత్తమే రూ.8800 కోట్ల నుంచి రూ.8900 కోట్లు ఉంది.

***మిగులు... తగులు!***

ప్రధానమైన 3 ఖర్చుల పద్దులు పోను మిగిలేది రూ.600 కోట్ల నుంచి 700 కోట్లు మాత్రమే. ఇందులో విద్యుత్ ఎల్‌వోసీల కోసం నెలా నెలా రూ.500 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇక ఖజానాలో మిగిలేది వందా రెండొందల కోట్ల రూపాయలు మాత్రమే. ఇవి కాక, నవంబరు, డిసెంబరు నెలలకుగాను ఆర్‌బీఐ నుంచి బాండ్ల వేలం ద్వారా రూ.5000 కోట్లు తెచ్చుకోవచ్చు. వీటితో కొత్తగా ప్రకటించిన సంక్షేమ పథకాలైన వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద డిసెంబరు 21న రూ.180 కోట్లు, నవంబర్ 21న అమలు చేయనున్న మత్స్యకారులకు వేట నిషేధ భృతి, మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ పథకానికి కలిపి మరో రూ.200 కోట్లు ఖర్చు కానున్నాయి. మిగిలిన నిధులను అత్యవసర బిల్లులు చెల్లించేందుకు ఉపయోగించే అవకాశాలున్నాయి.



## ట్రక్కు ఇసుక 60 వేలు

- అక్రమ రవాణాలో వైసీపీ నేతలు: బాలకృష్ణ
- యథేచ్ఛగా మద్యం అమ్మకాలు: కళా



హిందూపురం, రాజాం, అక్టోబరు 24: "రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన నూతన ఇసుక పాలసీ అనే జగన్నాటకంలో జన జీవితం చిక్కుకుని చితికిపోతోంది" అని సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. గురువారం అనంతపురం జిల్లా హిందూపురంలో పార్టీ నాయకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వంలోని ఉచిత ఇసుక పాలసీని రద్దు చేసి జగన్ ప్రభుత్వం తెచ్చిన కొత్త పాలసీతో ఇక్కట్లు పెరిగాయని విమర్శించారు. సొంత ఇంటి నిర్మాణం కోసం కలలు కన్న సామాన్యులకు ఇసుక దొరికే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో రూ.10 వేలు ఉండే ట్రక్కు ఇసుక రూ.40 నుంచి రూ.60 వేల వరకూ అమ్ముడవుతోందన్నారు. అదనంగా వసూలు చేసే సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళుతుందని ప్రశ్నించారు. విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో వందలాది మంది వైసీపీ నాయకులకు మాత్రం రీచ్‌ల వద్ద అనుమతులు లభిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కృష్ణ, గోదావరి నదులు పొంగిపార్లుతుంటే ఆ నీటిని వినియోగించుకోలేని పరిస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందని విమర్శించారు. వైసీపీ 150 రోజుల పాలనలో రాష్ట్రం 20 సంవత్సరాలు వెనక్కి వెళ్లిపోయిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళావెంకట్రావు రాజాంలో విమర్శించారు.జే ట్యాక్స్ కోసం కీలకమైన రాజధాని నిర్మాణాన్ని నిలిపివేశారని, నిర్మాణ రంగం కుదేలైందని అన్నారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ మాత్రమే మద్యం అమ్మకాలు హర్షించదగ్గ పరిణామమన్నారు. కానీ రాత్రి 8 గంటల తరువాత వైసీపీ చొక్కాలు వేసుకున్న వ్యక్తులు యథేచ్ఛగా విక్రయాలు సాగిస్తున్నారని ఆరోపించారు.

## హోదాపై అఖిలపక్షం

- చలసాని డిమాండ్



విజయవాడ (పాయకాపురం), అక్టోబరు 24: ప్రత్యేక హోదాపై అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో అందరినీ కలుపుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని ప్రత్యేక హోదా సాధన సమితి ఛైర్మన్ చలసాని శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. వెనుక బడిన ఉత్తరాంధ్ర, రాయలసీమలను ప్రత్యేక హోదాతో అభివృద్ధి చేయాలని, ఎటువంటి షరతులు లేకుండా వైజాగ్ రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కడపకు స్టీల్ ఫ్యాక్టరీని తేవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సీఎం ఢిల్లీ పర్యటనలో కీలకమైన అంశాలను అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లడం కోసం వెళ్తే అపాయింట్‌మెంట్ లేదంటారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే నెలలో బహిరంగ సభ ఏర్పాటు చేసి ఢిల్లీ దాకా మళ్లీ ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

## టీడీపీ బీమా... కార్యకర్తలకు ధీమా

**నాలుగేళ్లలో 4 వేల మందికి 80 కోట్ల సాయం**

అమరావతి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రారంభించిన బీమా పథకం ఆ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు కొంత మేర అండగా నిలుస్తోంది. నాలుగేళ్ల క్రితం ఆ పార్టీ నేత నారా లోకేశ్ కార్యకర్తలకు అండగా నిలిచేందుకు ఈ బీమా పథకానికి రూపకల్పన చేశారు. దీని వల్ల ఈ నాలుగేళ్లలో 4000 మందికి రూ.80 కోట్ల సాయం అందింది. పార్టీ సభ్యత్వం తీసుకునే సమయంలోనే కార్యకర్తలు బీమా కోసం రూ.100 చెల్లిస్తే... కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి దానికి కొంత జత చేసి పేరొందిన బీమా సంస్థలకు చెల్లిస్తారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ ఈ సౌకర్యం కల్పించారు. కార్యకర్తలెవరైనా ప్రమాదవశాత్తూ చనిపోతే వారి కుటుంబాలకు రూ.2 లక్షలు పరిహారం అందేలా చేశారు. ఇలాంటి ఏర్పాటు చేసి, ఇంత మొత్తం కార్యకర్తల కుటుంబాలకు బీమా సాయం అందేలా చేసింది ఒక్క తెలుగుదేశం పార్టీయేనని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. కార్యకర్తలు ప్రమాదంలో చనిపోతే... పార్టీ సంక్షేమ విభాగం నెంబర్ 7306299999కు ఫోన్ చేసి చెప్పాల్సి ఉంటుంది. ప్రమాదానికి సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీ, ఫిర్యాదు లేఖ, పోస్టుమార్టం నివేదిక, మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. వీటితో పాటు కుటుంబ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ, రేషన్ కార్డు, 4 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు నెల రోజుల్లోగా పార్టీ రాష్ట్ర కార్యాలయంలోని కార్యకర్తల సంక్షేమ విభాగానికి అందించాలి. ఆ విభాగమే బీమా కంపెనీలతో సమన్వయం చేసి పరిహారం అందేలా చేస్తుంది.

## నీ అంతు చూస్తా

- తిరుపతి రూరల్ తహశీల్దార్‌కు వైసీపీ నేత బెదిరింపు
- కేసు నమోదు... అదుపులో నిందితుడు

తిరుపతి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ తహశీల్దార్ కిరణ్ కుమార్‌పై వైసీపీ నాయకుడు బొమ్మగుంట రవి గురువారం దౌర్జన్యానికి దిగారు. పరుష పదజాలంతో దూషించారు. 'నీ అంతు చూస్తా' అంటూ బెదిరించారు. తహశీల్దార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి రవిని అదుపులోకి తీసుకున్నారు. ఓ స్థల వివాదానికి సంబంధించి ఫిర్యాదు ఇచ్చేందుకు బొమ్మగుంట రవి తన అనుచరులతో తహశీల్దార్ కార్యాలయానికివచ్చారు. వచ్చిన వెంటనే పిలిచి కూర్చోబెట్టలేదన్న కోపంతో తన అనుచరులతో కలసి తహశీల్దార్‌పై పరుష పదజాలంతో మాట్లాడారు. ఫిర్యాదుపై సీసీ ఫుటేజ్‌లు, మొబైల్ వీడియో రికార్డులను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. బొమ్మగుంట రవి, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి సన్నిహిత అనుచరుడు. తిరుపతి రూరల్ మండలం చంద్రగిరి నియోజకవర్గం పరిధిలో ఉంది. తహశీల్దార్‌తో జరిగిన వాగ్వివాదంలో 'నువ్వు ఎమ్మెల్యేకు (చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డికి) తొత్తుగా ఉన్నావు' అంటూ రవి ఆరోపించారు. దీంతో వైసీపీలో వర్గ విభేదాలున్నాయనే ప్రచారం సాగుతోంది.

## 'ఇసుక'పై భవన నిర్మాణ కార్మికుల కన్నెర్ర

తాడేపల్లిగూడెం అర్బన్, అక్టోబరు 24 : ఇసుక సరఫరా విషయంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు కదం తొక్కారు. ఏఐటీయూసీ అనుబంధ ఏరియా తాపీ, వడ్రంగి, ర్యాడ్ బెండింగ్, సెంట్రింగ్, పెయింటింగ్, ఎలక్ట్రికల్, ప్లబింగ్, వర్కర్స్ యూనియన్ల పిలుపు మేరకు గురువారం పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం భారీ నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. ప్రదర్శనకారులను పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కార్మికులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ బారికేడ్లను దాటుకుంటూ తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరి నినాదనాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడుడు ఓవీరాజు, ఏరియా కార్యదర్శి దూసనపూడి సోమసుందర్ మాట్లాడుతూ ఇసుక ఆన్‌లైన్ విధానం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వం తన యంత్రాంగం ద్వారానే రీచ్‌ల వద్ద పర్మిట్లు ఇచ్చి ఇసుకను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని నెలలుగా ఉపాధి పోయిన భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు నిధుల నుంచి రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జనసేన నాయకులు బొలిశెట్టి రాజేష్ మాట్లాడుతూ త్వరలో ఇసుక విషయమై కార్మిక సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ పవన్‌కల్యాణ్ ఉద్యమించనున్నట్లు తెలిపారు.



తాడేపల్లిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

# నేడు టీడీపీ ఆందోళనలు

- రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు
- ఇళ్ల నిర్మాణాలు వాయిదా వేసుకోవాలా?
- ఇలా చెప్పడం ప్రభుత్వ అసమర్థతే
- కూలీలను పస్తుపెడుతున్నారు
- పరిహారం ఇవ్వననడం అమానుషం
- చంద్రబాబు ఆగ్రహం



అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇసుక కొరతపై తెలుగుదేశం పార్టీ శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనుంది. ఇసుక కొరతతో లక్షల మంది ఉపాధి కోల్పోయిన నేపథ్యంలో ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఆ పార్టీ నిరసనలకు పిలుపిచ్చింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు గురువారం అన్ని జిల్లాల నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇసుక కొరతపై ఇది టీడీపీ చేపట్టిన రెండో ఆందోళన కార్యక్రమమని, అన్నిచోట్లా ధర్నాలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపిచ్చారు. 'ఇది వైసీపీ ప్రభుత్వం సృష్టించిన సమస్య. లక్షలాదిమంది రోజు కూలీలను పస్తులు పెడుతున్నారు. కొరతను అడ్డుపెట్టుకుని వైసీపీ నేతలు ఇసుక వ్యాపారం చేస్తున్నారు. కూలీల గోడు వారికి పట్టడం లేదు. పనులు కోల్పోయిన కార్మికులకు మనం అండగా ఉండాలి. తాపీ పనివారు, కార్పెంటర్లు, ప్లంబర్లు, పెయింటర్లు, ఎలక్ట్రికల్ పనివారు, భవన నిర్మాణ కార్మికులు, అనేక వృత్తులవారు ఉపాధి కోల్పోయారు. అటు అమరావతిని.. ఇటు పోలవరాన్ని నిలిపివేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణ కార్యక్రమాలన్నీ స్తంభింపజేశారు. జీవనోపాధి కోల్పోయిన కార్మికులకు పరిహారం ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత. ఇచ్చేది లేదని చెప్పడం అమానుషం' అని ధ్వజమెత్తారు. ఇసుక అందించలేక ఇళ్ల నిర్మాణాలు వాయిదా వేసుకోవాలని చెప్పడం అసమర్థతేనని.. సమస్యకు పరిష్కారం చూపలేక వాయిదాల మార్గాన్ని ఎంచుకున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా నిరసన కార్యక్రమాలు ఉండాలని, భారీ వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో పండుగ తర్వాత నిర్వహించాలని సూచించారు. వైసీపీ నేతలు అవినీతిలో కూరుకుపోయి అయిన కాడికి అన్నీ అమ్ముకొంటున్నారని విమర్శించారు. 'సబ్ స్టేషన్లలో షిఫ్ట్ ఆపరేటర్ల పోస్టులు ఒక్కోటి రూ.పది లక్షలకు అమ్ముకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.200 కోట్ల వసూళ్లు జరుగుతున్నాయి. కమీషన్ల కోసం వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీల మధ్య కొట్లాటలు జరుగుతున్నాయి. ఉద్యోగుల బదిలీల్లో భారీగా దండుకుంటున్నారు. ఇసుక రీచ్‌ల కోసం కుమ్ములాటలు చోటు చేసుకుంటున్నాయి. వీటన్నింటి గురించి సమాచారం సేకరించాలి. ప్రజల్లోకి తీసుకెళ్లాలి. వైసీపీ కార్యకర్తలు గ్రామాల్లో పక్కా ఇళ్ల దరఖాస్తులు రద్దు చేస్తున్నారు. ఇళ్లకు డిపాజిట్ కట్టిన వాళ్ల పేర్లు మారుస్తున్నారు. వలంటీర్ల ముసుగులో తమ కార్యకర్తలకు దోచి పెడుతున్నారు. ఉపాధి హామీ పనులు చేసిన వాళ్లకు బిల్లులు ఇవ్వకుండా వేధిస్తున్నారు. గ్రామాల్లో పనులు చేసి అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు రావడం బాధాకరం. ఎవరూ ఇటువంటి అఘాయత్యాలకు పాల్పడవద్దు. ధైర్యంగా పోరాడదాం. 18 మంది టీడీపీ ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేలపై తప్పుడు కేసులు పెట్టారు. ఆర్థికంగా ఇబ్బందులు సృష్టిస్తున్నారు. టీడీపీ కార్యకర్తలను వేధిస్తున్నారు. ఈ అక్రమ కేసులపై న్యాయ పోరాటం చేయాలి. అవసరమైతే ప్రైవేటు కేసులు వేయాలి. వైసీపీ నేతల అవినీతిని వెలికితీసి దానిపై కూడా పోరాడాలి' అని నేతలకు సూచించారు.




## రాజధానిపై ఇప్పుడు కమిటీయా?

- ప్రధాని శంకుస్థాపన చేసి నాలుగేళ్లు
- దానిని నిర్మించే సత్తా వైసీపీకి లేదు
- అంగీకరించే నిజాయితీ కూడా లేదు
- ట్విటర్‌లో చంద్రబాబు ధ్వజం

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రధాని శంకుస్థాపన చేసిన నాలుగేళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ రాజధానిని నిర్ణయించేందుకు కమిటీ వేయడం ఏమిటని మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు విస్మయం వ్యక్తం చేశారు. పురపాలక శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలపై గురువారం ఆయన ట్విటర్‌లో స్పందించారు. 'రాష్ట్రం నడిబొడ్డున, నది ఒడ్డున అందరికీ అందుబాటులో ఉండాలని అమరావతిని రాజధానిగా నిర్ణయించాం. ఇదే జగన్మోహన్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా దానిని ఆ రోజు స్వాగతించారు. శివరామకృష్ణన్ కమిటీ చేసిన ప్రజాభిప్రాయ సేకరణలోనూ.. కమిటీకి వచ్చిన మెయిల్స్‌లో కూడా అమరావతినే అనుకూల ప్రాంతంగా ధ్రువీకరించారు. నాలుగేళ్ల తర్వాత దీనిపై ఇప్పుడు కమిటీ ఏమిటి? హైకోర్టు వద్ద తాగడానికి టీ కూడా లేని పరిస్థితి ఉందన్న వ్యాఖ్యలు మీకు తలవంపులుగా లేవా? వైసీపీ ప్రభుత్వానికి రాజధానిని నిర్మించే సత్తా లేదు. ఆ విషయాన్ని ప్రజల ముందు ఒప్పుకొనే నిజాయితీ కూడా లేదు' అని చంద్రబాబు దుయ్యబట్టారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న యనమల, టీడీపీ నేతలు

## తలసరిలోనూ రివర్స్
### 17 వేలు తగ్గిన ఆదాయం

- వైసీపీ అసమర్థతతోనే 8 శాతానికి పడిపోయిన వృద్ధి రేటు
- అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థిక స్థితిపై చర్చకు సిద్ధం: టీడీపీ నేతలు

గుంటూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): "రాష్ట్రంలో ప్రస్తుతం అన్ని రంగాల్లో తిరోగమనం తప్ప.. పురోగమనం లేదు. అభివృద్ధి కుంటుపడింది. తలసరి ఆదాయంలో నెలకు రూ.17 వేలు తగ్గింది. వృద్ధి రేటు 8 శాతానికి పడిపోవడానికి వైసీపీ ప్రభుత్వం చేతకాని తనమే కారణం" అని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు విమర్శించారు. గుంటూరులోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, ఎంపీ కనకమేడల, ఎమ్మెల్సీ పోతుల సునీత, బీటీ నాయుడుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర విభజన సమయంలో రెవెన్యూ లోటులో ఆంధ్ర, తెలంగాణ మధ్య 8 శాతం తేడా ఉందని అన్నారు. టీడీపీ అధికారం కోల్పోయే నాటికి దానిని 1 శాతానికి తెచ్చామని చెప్పారు. వైసీపీ అధికారం చేపట్టే సమయానికి 11.2 శాతం వృద్ధిరేటు అందించామని యనమల వివరించారు. టీడీపీ హయాంలో రూ1.64 లక్షల తలసరి ఆదాయం ఉంటే.. 5 నెలల్లో అది రూ.17వేలు తగ్గిందని వారే ఒప్పుకున్నారన్నారని చెప్పారు. పోలవరం, అమరావతి, ఇతర ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ ఆగిపోవడం, ఇసుక కృత్రిమ కొరతతో నిర్మాణ రంగం పూర్తిగా పడకేసిందన్నారు. దీంతో సామాన్యుడికి పనిలేకపోవటంతో, కొనుగోలు శక్తి తగ్గి రాష్ట్ర ఆదాయం పడిపోయిందని విమర్శించారు. గత ప్రభుత్వంలోని పథకాలను నిలిపివేసి రూ.40 వేల కోట్ల దాకా మిగుల్చుకొన్నారని అన్నారు. ఇప్పుడు వాటికే పేర్లు మార్చి సొమ్మును మళ్లిస్తున్నారని ఆరోపించారు. సీఎం జగన్‌పై నమ్మకం లేకపోవటంతోనే బ్యాంకులు వెనక్కి పోయాయన్నారు. అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చర్చకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. మీడియాపై ఆంక్షలు విధించటం సరికాదన్నారు. ఒక రాజకీయ పార్టీ అధ్యక్షుడు సొంతంగా మీడియా సంస్థ నడపటం ప్రజాస్వామ్యానికి ప్రమాదమని.. దానిపై తాను అనేకసార్లు ప్రెస్ కౌన్సిల్‌లో ఫిర్యాదు చేశానన్నారు. సంక్షేమ రంగాన్ని జగన్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు దుయ్యబట్టారు. రాజధానిపై మంత్రి బొత్స వ్యాఖ్యలను పట్టించుకునే పనిలేదని రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ అన్నారు. కాంగ్రెస్‌లో మంత్రిగా ఉన్న సమయంలో వైఎస్ మృతి వెనుక జగన్, ఆయన తల్లి విజయలక్ష్మి పాత్ర ఉందని బొత్స చేసిన వ్యాఖ్యలను ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు.

# 4 నెలల్లో రెండేళ్లు వెనక్కి!

**టీడీపీపై కక్షతో కార్మికుల పొట్టగొట్టారు**

**ఇసుక లేక లక్షల మంది ఉపాధి కోల్పోయారు**

- వారికి అండగానే 3వ తేదీన చలో విశాఖ
- పోలీసులతో అడ్డుకునే యత్నం: పవన్



భవన నిర్మాణ కార్మికులతో సమావేశంలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

మంగళగిరి, అక్టోబరు 24: రాష్ట్రంలో గత నాలుగు నెలల్లో రెండేళ్ల అభివృద్ధి వెనక్కి వెళ్లిందని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తంచేశారు. తెలుగుదేశం పార్టీని దెబ్బతీసే క్రమంలోనే వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా భవన నిర్మాణ కార్మికుల పొట్టగొట్టిందని విమర్శించారు. రాష్ట్రంలో ఇసుక కొరతతో ఉపాధి లేక కార్మికులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, గత నాలుగు నెలలుగా వారు పడుతున్న కష్టాలు తనకు ఎంతో బాధ కలిగించాయని పేర్కొన్నారు. గురువారం మంగళగిరిలోని జనసేన రాష్ట్ర కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారినుద్దేశించి పవన్ మాట్లాడారు.'ఇసుక కొరతతో లక్షలాది మంది ఉపాధి లేక ఇబ్బందులు పడుతుంటే.. మరోపక్క ప్రభుత్వ కార్యాలయాల్లో సామాన్య ప్రజలు లంచాలు ఇచ్చుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం గత టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను తీసివేసి కొత్త పథకాలను అమలు చేస్తోంది. 5 లక్షల మందికి వలంటీర్ల ఉద్యోగాలిచ్చి.. ఐదింతల మంది కార్మికులకు ఉపాధి లేకుండా చేసింది. ఇసుక గందరగోళానికి వీలైనంత త్వరగా తెరదించాలి. ఇసుక విధానంపై జనసేన పొలిటికల్ ఎఫైర్స్ కమిటీతో ఇటీవల హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించి కార్యాచరణ సిద్ధం చేశాం. అందులో భాగంగానే నవంబరు 3న విశాఖపట్నంలో నిరసన ర్యాలీ చేపట్టబోతున్నాం. ర్యాలీ అనగానే ప్రభుత్వం ఇసుకపై సమీక్ష సమావేశం పెట్టింది. దీనిని బట్టి చూస్తుంటే ఈ నిరసన కార్యక్రమాన్ని ప్రభుత్వం పోలీసుల ద్వారా అడ్డుకునేందుకు యత్నిస్తుందని అర్థమవుతోంది. తెలంగాణలో 42 వేల మంది ఆర్టీసీ కార్మికులు సమ్మె తలపెడితే జనసేన సహా అన్ని పార్టీలు కలసి వచ్చాయి. ఆంధ్రలో లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కరువై రోడ్డున పడితే జనసేన తప్ప ఇతర ఏ పార్టీ కూడా ముందుకు రాకపోవడం బాధాకరం' అనివ్యాఖ్యానించారు.

### అసభ్య పోస్టులపై పోలీసులు స్పందించరా?

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులపై సోషల్ మీడియాలో చిన్న పోస్టు పెడితే వ్యక్తిగత హక్కులకు భంగం కలిగించారంటూ కేసులు పెడుతున్నారని, అదే జనసేనకు చెందిన ఓ ఆడబిడ్డపై కులం పేరుతో పోస్టులు పెట్టి దూషిస్తే పోలీసులు స్పందించడం లేదని పవన్ కల్యాణ్ ఆరోపించారు. తనను వ్యక్తిగతంగా దూషిస్తూ వేధిస్తున్నారని ప్రకాశం జిల్లాకు చెందిన అనంత స్వాతి అనే జనసేన మహిళా కార్యకర్త గురువారం మంగళగిరిలో పవన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. మనకోసం పనిచేసిన ఆడపిల్లను రక్షించుకోకపోతే సిగ్గుచేటని, స్వాతికి ప్రకాశం జిల్లా నాయకులు, జనసైనికులు అండగా నిలవాలని కోరారు.

### బాబాయి, కోడికత్తి కేసులేమయ్యాయి?

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి పీఠం ఎక్కి ఐదు నెలలు గడుస్తున్నా సొంత బాబాయిని ఎవరు హ్యతచేశారో, కోడి కత్తితో దాడి చేయించింది ఎవరో తెలుసుకోలేని వ్యక్తి ఇక ప్రజలకు ఏం భరోసా ఇస్తారని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సీఎం జగన్‌ను ప్రశ్నించారు. గురువారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో నెల్లూరు జిల్లాకు చెందిన పార్టీ నాయకులు, అభ్యర్థులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'జగన్‌పై దాడి జరిగినప్పుడు ఏపీ పోలీసులపై నమ్మకం లేదంటూ తెలంగాణ పోలీసులను ఆశ్రయించారు. ఇప్పుడు రాష్ట్రంలో ఉన్న మీ ప్రభుత్వమే. కోడికత్తితో దాడి చేయడానికి ఆ కుర్రాడిని ప్రేరేపించింది ఎవరు? బయటకు వస్తే చంపేస్తామని బెదిరిస్తోంది ఎవరో కనుక్కోండి. ప్రభుత్వం మీదే అయినా ఎందుకు పొడిచాడో తెలుసుకోలేకపోతున్నారు. చింతమనేని ప్రభాకర్ దారిలోనే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి నడుస్తున్నారు. మహిళా అధికారిపై దాడి చేసిన చింతమనేని ఏ పరిస్థితిలో ఉన్నారో తెలుసుకోవాలి. అప్రజాస్వామికంగా ముందుకెళ్తే కాలం ఏదొక రోజు శిక్షిస్తుంది. జమీన్‌రైతు ఎడిటర్‌పై, మహిళా అధికారిపై దాడి చేసిన శ్రీధర్‌రెడ్డి తప్పించుకోలేరు. జనసేన ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్‌పైనా కేసులు పెడుతున్నారు' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇసుకను స్వలాభానికి వాడుకున్న టీడీపీ ఎలా నష్టపోయిందో వైసీపీకి కూడా అదే గతి పడుతుందని హెచ్చరించారు. మద్యనిషేధం విధిస్తే ఆదాయం తగ్గాలని, కానీ విచిత్రంగా ఆదాయం పెరుగుతోందని ఎద్దేవాచేశారు. తెలుగుదేశం లక్ష్యం లోకేశ్‌ను సీఎం చేయడమైతే.. వైసీపీ లక్ష్యం జగన్‌ను 30 ఏళ్లు సీఎంగా ఉంచడమని పవన్ అన్నారు. అంతేతప్ప భావి తరాలకు ఏదైనా చేద్దామని వారికి లేదని వాపోయారు. అధికారమే అంతిమ లక్ష్యంగా పెట్టిన పార్టీలు కాలగర్భంలో కలిసిపోయాయన్నారు. తాను ఏ పార్టీతో అయినా పొత్తు పెట్టుకుంటే అది ప్రజా శ్రేయస్సు కోసమేనన్నారు.

## దేశానికి ప్రథమ శత్రువు మోదీనే

- నియంతలా వ్యవహరిస్తున్న కేసీఆర్
- చానళ్లపై నిషేధం సరికాదు: సీపీఐ నారాయణ
- నేడు రాజమహేంద్రిలో భిక్షాటన: రామకృష్ణ

ఏలూరు, గూడూరు, అక్టోబరు 24: "దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న ప్రధాని మోదీనే దేశానికి మొదటి శత్రువు. 1947 నుంచి దేశాన్ని బీజేపీ పాలించి ఉంటే నాలుగు ముక్కలై ఉండేది. వ్యవస్థలన్నింటినీ వారి చేతుల్లోకి తీసుకుని, ప్రశ్నించే వారిని జైళ్లలో పెడుతూ, పనికిమాలిన వారిని నెత్తిపై పెట్టుకుంటున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నారు" అని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మండిపడ్డారు. నెల్లూరు జిల్లా గూడూరులో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖ భూ కుంభకోణంలో వైసీపీ, టీడీపీ, కాంగ్రెస్ నేతలు ఉన్నారని, దీన్ని సర్వే నెంబర్లతో సహా బయటపెడతామన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. ఆంధ్ర సీఎం జగన్మోహన్‌రెడ్డి రివర్స్ టెండరింగ్‌తో రాష్ట్రాభివృద్ధి తిరోగమనం బాట పట్టిందన్నారు. నిజాలను నిర్భయంగా ప్రసారం చేసే చానళ్లపై ఆంక్షలు సరికాదన్నారు. "ఎన్నికల ముందు కేంద్రం మెడలు వంచైనా రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తామని ప్రగల్భాలు పలికారు. ఇప్పుడేమో ఆ ఊసే ఎత్తటం లేదు. ఢిల్లీ వెళ్ళి ప్రధాని మోదీని కలిసి వస్తున్నారే తప్ప దీనిపై కేంద్రం వైఖరి ఏమిటా అనేది తేల్చి చెప్పలేకపోతున్నారు. ప్రత్యేక హోదాపై ఎందుకీ దోబూచులాట?" అని సీఎం జగన్‌పై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఏలూరులో మండిపడ్డారు. 'మోదీని కలిసి అన్నీ మాట్లాడానంటారు. హోదాను ప్రస్తావించామంటారు. ఇదంతా మీనోట కాకుండా ఎంపీ విజయసాయిరెడ్డితో పలికిస్తారు. ఇదేమి విచిత్రం?" అని నిలదీశారు. 4 నెలలుగా ఇసుక లేక 21 లక్షల భవన నిర్మాణ కార్మిక కుటుంబాలు అర్ధాకలితోనే జీవిస్తుంటే మంత్రి పెద్దిరెడ్డి ఇష్టానుసారం మాట్లాడుతున్నారని విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి దివాళా తీయడానికి పాలనలో సీఎం జగన్ వైఫల్యం చెందడమే కారణమన్నారు. ఇసుక కార్మికుల అవస్థలను దృష్టిలో పెట్టుకుని నేడు రాజమహేంద్రవరంలో భిక్షాటన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ ప్రకటించారు.

## దేశవ్యాప్తంగా ఇసుక దోపిడీ

- నటుడు ఆర్.నారాయణమూర్తి



తాడేపల్లిగూడెం అర్బన్, అక్టోబర్ 24 : 'దేశవ్యాప్తంగా ఇసుకపై దోపిడీ జరుగుతోంది. దీనివల్ల సామాన్యప్రజలు నలిగిపోతున్నారు. ఎమ్మెల్యే అవ్వడానికి రూ.100 కోట్లు, ఎంపీ అవ్వడానికి రూ.200 కోట్లు ఖర్చు పెడుతున్నారు. ఆ తర్వాత జంపింగ్‌లు జరుగుతున్నాయి. వీటి ఇతివృత్తంగానే 'మార్కెట్లో ప్రజాస్వామ్యం' అనే సినిమా తీశానని ప్రముఖ నటుడు, నిర్మాత, దర్శకుడు ఆర్.నారాయణ మూర్తి తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ నివాసంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు దేశంలోనూ ఇసుక మాఫియా పెరిగిపోయిందన్నారు. పార్టీ ఫిరాయింపులు రాజ్యమేలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నూతన ఇసుక విధానంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. జాతీయ సంపదైన ఇసుకను ప్రభుత్వం ఆధీనంలో ఉంచి ప్రజల సంక్షేమ కోసం ఇవ్వాలని కోరారు. అలా కాకుండా మాఫియా చేతికి ఇవ్వడం తగదన్నారు.

# అలవిమాలిన కోర్కెలు

- అమిత్ షాకు జగన్ ఇచ్చిన వినతిపై సుజనా వ్యాఖ్యలు



అమరావతి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సీఎం జగన్ ఇచ్చిన వినతిపత్రంలోని అంశాల్లో ఆచరణ సాధ్యమయ్యేది ఒక్కటీ లేదని ఎంపీ సుజనా చౌదరి వ్యాఖ్యానించారు. రెవెన్యూ లోటు విషయంలో తప్పుడు లెక్కలతో ఢిల్లీకి వచ్చిన జగన్ రాష్ట్రానికి కేంద్రం ఎంతివ్వాలన్న అంశంపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. పోలవరం విషయంలో వైసీపీ ప్రభుత్వం తీసుకొంటున్న నిర్ణయాలపై కేంద్రం అసంతృప్తిగా ఉందన్నారు. గురువారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీలో ఐదునెలల తర్వాత కూడా పాలన మొదలైనట్లు కనిపించడం లేదన్నారు. తాము గ్రామాల్లోకి వెళ్తుంటే ప్రజలు ఇసుక కోసమే మాట్లాడుతున్నారని చెప్పారు. 'సీలేరు జలాశయానికి గండి పడి రెండు నెలలైనా పూడ్చలేదు.. శ్రీశైలంలో ప్లాంటు మరమ్మతుల కారణంగా విద్యుదుత్పత్తి ఆగిపోయింది. రాష్ట్రం రూ.500కోట్ల విద్యుత్ కొనుగోలు చేసింది. ఇదేనా పాలన.?' అని ప్రశ్నించారు. రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ కోసం ఎస్‌పీవీ సిద్ధం చేయడంలో గత ప్రభుత్వం జాప్యం చేసిందన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వానికి ఎస్‌పీవీ సిద్ధంచేసి కేంద్రాన్ని ఒప్పించే శక్తి లేదన్నది తన వ్యక్తిగత అభిప్రాయంగా పేర్కొన్నారు. పోలవరం టెండర్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోన్న వైఖరిపట్ల కేంద్రం అసంతృప్తితో ఉందని, ఏపీ విధివిధానాలు సరికాదని భావిస్తోందన్నారు. రీటెండర్లతో రూ.వేల కోట్ల పంట దిగుబడి రాకుండా పోతోందని, అవినీతి జరిగితే బాధ్యులను శిక్షించాలి తప్ప ఇతరత్రా ప్రయోజనాల కోసం ఏదో చేస్తామంటే ఎలా సాధ్యపడుతుందని ప్రశ్నించారు. రాజధాని విషయంలోనూ ప్రభుత్వానికి స్పష్టత లేదని, ప్రజల్లో గందరగోళం సృష్టిస్తోందన్నారు. అమరావతిలో రూ.9వేల కోట్లు ఖర్చు చేశారని చెబుతూనే మరోవైపు రూ.30వేల కోట్ల అవినీతి జరిగిందని రాష్ట్ర మంత్రులు మాట్లాడటం విడ్డూరమని సుజనా ఎద్దేవా చేశారు. 'సీఎంవో, ఢిల్లీలో ఏపీ ప్రభుత్వ ప్రతినిధులు సమన్వయం చేసుకోవడం చేతగాక అమిత్ షా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదనడం సరికాదు' అని అన్నారు.

| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలరుకు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 39,020.39 | 11,582.60 | 38,450 | 45,535 | 71.02 | 61.42 |
| 38.44 | 21.50 | 19 | | 3 పైసలు | |
| | | ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత) | | | |

# సులభతర వ్యాపారంలో భారత్‌కు 63వ స్థానం

## ఏడాదిలో 14 స్థానాలు పైకి

### ర్యాంకులు ప్రకటించిన ప్రపంచ బ్యాంకు

### టాప్ 10 పెర్‌ఫార్మర్స్ జాబితాలో వరుసగా మూడోసారి చోటు

### మోదీ ప్రభుత్వ సంస్కరణలతో దూసుకుపోతున్న భారత్

వాషింగ్టన్: సులభతరంగా వ్యాపారాన్ని నిర్వహించే విషయంలో భారత్ స్థానం మరింత మెరుగుపడింది. ప్రపంచ బ్యాంకు ఈ ఏడాదికి ప్రకటించిన ర్యాంకుల్లో భారత్‌కు 63వ స్థానం లభించింది. ఏడాది కాలంలోనే భారత్ 14 స్థానాలు ఎగబాకడం విశేషం. ప్రభుత్వం తీసుకున్న పలు విధానాలు ఇందుకు దోహదపడ్డాయి. 'భారత్‌లో తయారీ' పథకంతోపాటు ఇతర కీలక సంస్కరణలతో భారత్ విదేశీ పెట్టుబడులను అపారంగా ఆకర్షించగలిగింది. మరోవైపు టాప్ 10 పెర్‌ఫార్మర్స్ జాబితాలో వరుసగా మూడోసారి భారత్‌కు చోటు దక్కడం విశేషం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనం నేపథ్యంలో భారత రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ), ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) లతోపాటు వివిధ రేటింగ్ ఏజెన్సీలు భారత్ వృద్ధి రేటు అంచనాను తగ్గించిన తరుణంలో తాజా ర్యాంకింగ్స్ వెలువడటం విశేషం. 2014లో నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టేనాటికి 190 దేశాల్లో భారత్ స్థానం 142గా ఉంది. నాలుగేళ్ల పాటు చేపట్టిన వివిధ సంస్కరణలతో భారత్ స్థానం ప్రపంచ బ్యాంకు 'డూయింగ్ బిజినెస్' 2018 నివేదికలో 100కు చేరుకుంది. 2017 సంవత్సరంలో ఇది 130గా ఉంది. అప్పుడు ఇరాన్, ఉగాండాకన్నా భారత్ స్థానం తక్కువగా ఉంది. గత ఏడాదిలో భారత్ 23 స్థానాలు ఎగబాకి 77కు చేరుకుంది. దివాలా, పన్నులు, ఇతర విభాగాల్లో చేపట్టిన సంస్కరణలు భారత్ పనితీరు మెరుగుపడటానికి దోహదపడినాయి.

ఈ ఏడాదికి టాప్ 10 పెర్‌ఫార్మర్స్ జాబితాలో భారత్‌తోపాటు సౌదీ అరేబియా (62), జోర్డాన్ (75), టాగో (97), బహ్రెయిన్ (43), తజకిస్తాన్ (106), పాకిస్తాన్ (108), కువైట్ (83), చైనా (31), నైజీరియా (131) ఉన్నాయి. భారత్ చేపట్టిన సంస్కరణలను 'వ్యాపార నిర్వహణ' 2020 నివేదికలో ప్రపంచబ్యాంకు ప్రశంసలు కురిపించింది. "వ్యాపార నిర్వహణలోని టాప్ 10 దేశాల్లో భారత్ వరుసగా మూడోసారి స్థానం దక్కించుకుంది. గత 20 ఏళ్ల కాలంలో కొన్ని దేశాలు మాత్రమే ఈ ఘనత సాధించాయి" అని ప్రపంచ బ్యాంకు డెవలప్‌మెంట్ ఎకనామిక్స్ డైరెక్టర్ సిమియెన్ జాంకోవ్ పేర్కొన్నారు. 2019 మే 1తో ముగిసిన 12 నెలల కాలంలో వ్యాపార కార్యకలాపాలను ప్రభావితం చేసే పది విభాగాల్లో చేపట్టిన సంస్కరణల ఆధారంగా ర్యాంకులను ఇచ్చారు.




### జీఎస్‌టీని మరింత సరళతరం చేస్తాం: నిర్మల



వస్తుసేవల పన్ను (జీఎస్‌టీ)ని మరింత సులభతరం చేస్తామని, దీని వల్ల సులభతర వ్యాపార నిర్వహణలో భారత్ స్థానం మరింతగా పెరిగే అవకాశం ఉంటుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. దేశంలో వ్యాపార వాతావరణాన్ని మెరుగుపరిచేందుకు రాష్ట్రాలు కూడా తమ వంతు కృషి చేయాలని చెప్పారు. దివాలా, బ్యాంక్‌రప్టసీ కోడ్ (ఐబీసీ) అమలు భారత్ ర్యాంకు పెరగడానికి దోహదపడిందన్నారు. ప్రస్తుతం ఢిల్లీ, ముంబైలోని వ్యాపార వాతావరణాన్ని ప్రపంచ బ్యాంకు పరిగణనలోకి తీసుకుందని, తర్వాతి ర్యాంకింగుల్లో కోల్‌కతా, బెంగళూరును కలిపే అవకాశం ఉందని చెప్పారు. బ్యాంకుల రుణ మేళాల నిర్వహణ ద్వారా ఎంఎస్‌ఎంఈ రంగానికి రుణ లభ్యత పెరిగేందుకు దోహదపడిందని ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణియన్ అన్నారు. సంస్కరణల విషయంలో ప్రభుత్వం తన ప్రయత్నాలను కొనసాగించిన ఫలితంగా భారత్ స్థానం మరింతగా మెరుగుపడిందని వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పేర్కొంది.

### సంస్కరణల ఫలితమే : ఇండియా ఇంక్

సులభతర వ్యాపార నిర్వహణలో భారత్ స్థానం మెరుగుపడటం పట్ల భారత పరిశ్రమ (ఇండియా ఇంక్) హర్షం వ్యక్తం చేసింది. మోదీ ప్రభుత్వ సంస్కరణలకు ఇది సూచికగా పేర్కొంది. భారత్ భవిష్యత్‌లో టాప్ 50 దేశాల్లో స్థానం సంపాదించుకునే అవకాశం ఉందన్న విశ్వాసాన్ని పారిశ్రామిక సంఘాలైన భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), అసోచామ్ వ్యక్తం చేశాయి. ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల వల్ల ఇన్వెస్టర్లలో విశ్వాసం పుంజుకుందని, పలు రకాల ప్రక్రియలు వేగవంతం అయ్యాయని సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ పేర్కొన్నారు. భారత్ స్థానం పెరిగిన నేపథ్యంలో మరిన్ని విదేశీ పెట్టుబడులు రావడానికి, వ్యాపార అవకాశాలు పెంచడానికి,. ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉందని పారిశ్రామికవేత్తలు, స్టార్టప్స్ పేర్కొన్నాయి.

### మేక్ ఇన్ ఇండియా దన్ను

భారత్‌లో తయారీ (మేక్ ఇన్ ఇండియా) ప్రచారం ద్వారా ప్రభుత్వం విదేశీ పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా ప్రైవేటు రంగానికి ఊతమిచ్చింది. అంతేకాకుండా దేశ పోటీతత్వాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుందని ప్రపంచ బ్యాంకు తన నివేదికలో పేర్కొంది. సంస్కరణలకు కట్టుబడి ఉండటమే కాకుండా తాము తీసుకున్న చర్యల వల్ల ఏర్పడిన ప్రగతిని ప్రభుత్వం పెట్టుబడిదారుల ముందుంచిందని తెలిపింది. దివాలా, బ్యాంక్‌రప్టసీ చట్టాన్ని 2,000 కంపెనీలు వినియోగించుకున్నాయని, వీటిలో దాదాపు 470 కంపెనీలు లిక్విడేషన్‌ను ప్రారంభించగా.. 120కి పైగా కంపెనీలు పునర్‌వ్యవస్థీకరణ ప్రణాళికను అనుమతించాయి. కాగా సులభతర వ్యాపారానికి సంబంధించి 2020నాటికి టాప్ 50 ఆర్థిక వ్యవస్థల్లో స్థానం సంపాదించుకోవడం భారత్ లక్ష్యంగా ఉంది.

## పన్ను చెల్లింపుదారులకు తాయిలాలు?

- వ్యక్తిగత ఆదాయపు పన్ను శ్లాబ్‌ల సవరణ
- వచ్చే బడ్జెట్‌లోనే ప్రతిపాదనలు

న్యూఢిల్లీ: వ్యక్తిగత ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు మరింత ప్రోత్సాహం కల్పించే దిశగా కేంద్రం పావులు కదుపుతున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. దేశంలో గణనీయంగా పడిపోయిన వినియోగ డిమాండును పెంచడం, తద్వారా ఆర్థికాభివృద్ధిరేటును కూడా పరుగులు తీయించడం లక్ష్యంగా కేంద్రం ఈ ఆలోచన చేస్తున్నట్టు ఆ పరిణామంతో సన్నిహితంగా పని చేస్తున్న వర్గాల వారు తెలిపారు. పేర్లు వెల్లడించడానికి నిరాకరిస్తూ అవన్నీ ప్రస్తుతం ప్రైవేటు చర్చల్లోనే ఉన్నాయని వారన్నారు. ప్రధానంగా ప్రస్తుతం 30 శాతం పన్ను రేటు వర్తిస్తున్న రూ.10 లక్షల వార్షికాదాయ పన్ను శ్లాబ్‌లో ఉన్న వారికి పన్ను చెల్లింపు ఆదాయ పరిమితి పెంచే అంశం పరిశీలిస్తున్నట్టు వారు చెప్పారు. ఇంటి అద్దె చెల్లింపులు, బ్యాంకు డిపాజిట్లపై ఆర్జించే వడ్డీ ఆదాయం వంటి వాటికి పన్ను బ్రేక్‌లను రద్దు చేయవచ్చునని వారు తెలిపారు. వచ్చే ఫిబ్రవరిలో ప్రతిపాదించనున్న బడ్జెట్‌లో ఈ ప్రతిపాదనలుండవచ్చునంటున్నారు. అయితే దీన్ని ధ్రువీకరించడానికి ఆర్థిక శాఖకు చెందిన అధికారులెవరూ అందుబాటులో లేరు. ఒకవేళ ఆ వర్గాలు చెబుతున్నదే నిజం అయితే ఆర్థిక వ్యవస్థను పునరుజ్జీవం చేసే దిశగా ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన పలు చర్యలకు ఇది కూడా జోడవుతుందన్నది పరిశీలకుల అభిప్రాయం.

## కీలక మద్దతు 11550

**టెక్ వ్యూ**

నిఫ్టీ 11650 వద్ద పాజిటివ్ ట్రెండ్‌లోనే ప్రారంభమైనా తదుపరి రోజంతా మైనర్ బలహీనతను ప్రదర్శించింది. చివరిలో 11550 వద్ద స్వల్ప రికవరీ సాధించినా 21 పాయింట్ల నష్టంతో క్లోజయింది. 11700 పాయింట్ల వద్ద ఏర్పడిన మైనర్ కరెక్షన్ కొనసాగుతోంది. అయితే 11550 వద్ద మద్దతు సాధిస్తోంది. భద్రతకు, మరింత కరెక్షన్ నివారించుకోవడానికి ఈ స్థాయిలో పునరుజ్జీవం తప్పనిసరి. అలాగే తక్షణ అప్‌ట్రెండ్ అవకాశాల కోసం సానుకూల సంకేతం ఇవ్వాలి. మార్కెట్ ప్రస్తుతం స్వల్పకాలిక సగటు సూచీలకు చేరువవుతోంది.

**శుక్రవారం స్థాయిలివే...**

**నిరోధం : 11640 మద్దతు : 11550**

- మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమించాలంటే ఇంట్రాడే నిరోధం 11640 వద్ద నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం, స్వల్పకాలిక ట్రెండ్ నిర్ణయ స్థాయి 11700.
- గత నాలుగు రోజుల్లో ఏర్పడిన మైనర్ బాటమ్ 11550 కన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్‌లో ప్రవేశించే ప్రమాదం ఉంది.

■ వి.సుందర్ రాజా

## ఉదయం సెషన్ మెరుగు

**ఆస్ట్రో వ్యూ**

**తిథి :** ఆశ్వయుజ కృష్ణ ద్వాదశి

**నక్షత్రం-అప్రమత్తం :** పుబ్బ/ఉత్తరాషాఢ; మృగశిర, చిత్త, ధనిష్ట/ఆర్ద్ర, స్వాతి, శతభిషం నక్షత్ర జాతకులు, తుల, కుంభ రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**నిఫ్టీ : 11582.60 (-21.50)**

**ట్రెండ్ మార్పు వేళలు : 10.58**

**ధోరణి :** నిఫ్టీ ఫ్యూచర్స్ నిలకడగా ప్రారంభమై మధ్యాహ్నం 2 గంటల వరకు మెరుగ్గా ట్రేడవుతూ ఆ తర్వాత 3.15 వరకు నిస్తేజం ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

**ట్రేడింగ్ వ్యూహం :** నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 1.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 2.15 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవాలి.

**నిరోధం : 11700, 11740**

**మద్దతు స్థాయిలు : 11620, 11585**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**గమనిక :** ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinanciala strologer.blogspot.in

# శరీరంలో కరిగిపోయే స్టెంట్‌ను అభివృద్ధి చేస్తాం

- వచ్చే ఏడాది చివరకు లిథియం అయాన్ బ్యాటరీ
- టెక్నాలజీ బదిలీకి 12 కంపెనీలతో చర్చలు
- 10 శాతం వరకూ తక్కువ వ్యయం!
- ఏఆర్‌సీఐ డైరెక్టర్ పద్మనాభం

*ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ*



*ఆటోమోటివ్, విద్యుత్, ఆయిల్ అండ్ గ్యాస్, టెక్స్‌టైల్ తదితర రంగాలకు కొత్త మెటీరియల్స్, ఉత్పత్తులను అభివృద్ధి చేస్తున్న ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్ (ఏఆర్‌సీఐ)సంస్థ బయో మెడికల్ డివైసెస్ వంటి కొత్త రంగాల్లోకి అడుగుపెట్టనుంది. సోడియం అయాన్ బ్యాటరీలను అభివృద్ధి చేసే ప్రక్రియలో ఉంది. హైదరాబాద్‌లోని ఏఆర్‌సీఐ శాస్త్ర, సాంకేతిక విభాగం కిందకు వచ్చే స్వతంత్ర పరిశోధన సంస్థ. టెక్నాలజీలను అభివృద్ధి చేసి వాణిజ్యపరంగా వాటిని వినియోగించుకోవడానికి కంపెనీలకు బదిలీ చేస్తుంది. ఇప్పటి వరకూ దాదాపు 20 టెక్నాలజీలను అభివృద్ధి చేసి ఆయా రంగాల్లోని 32 కంపెనీలకు బదిలీ చేసింది. ప్రతి రంగంలో ఉత్పత్తుల సామర్థ్యాలు, నిర్వహణను పెంచే మెటీరియల్స్ అభివృద్ధి సవాలు వంటిదని.. ఆటోమోటివ్ నుంచి ఏరోస్పేస్ వరకూ అన్ని రంగాలకు అవసరమైన ఉత్పత్తులు, సొల్యూషన్లను అభివృద్ధి చేస్తున్నామని ఏఆర్‌సీఐ డైరెక్టర్ జీ పద్మనాభం తెలిపారు. విద్యార్థులకు పరిశోధన, అభివృద్ధిపై ఆసక్తి కలిగించే లక్ష్యంతో ఏఆర్‌సీఐ 'అవుట్‌రీచ్' కార్యక్రమానికి తొలిసారి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా విద్యార్థులకు ఏఆర్‌సీఐని సందర్శించే అవకాశం కల్పించింది. ఈ సందర్భంగా పద్మనాభం 'ఆంధ్రజ్యోతి బిజినెస్'తో మాట్లాడారు.*

**కొత్త రంగాల్లో ఉత్పత్తులను ఏఆర్‌సీఐ అభివృద్ధి చేయనుందా?**

ప్రత్యామ్నాయ ఇంధన ఉత్పత్తులు, సొల్యూషన్లను అభివృద్ధి చేయడంపై ప్రస్తుతం ప్రధానంగా దృష్టి పెడుతున్నాం. కొత్త రంగాల్లోకి కూడా అడుగుపెట్టనున్నాం. బయో మెడికల్ ఉత్పత్తులను అభివృద్ధి చేయనున్నాం. లేజర్ మైక్రో మిషన్‌తో స్టెంట్‌లను అభివృద్ధి చేయాలని భావిస్తున్నాం. ఏడాది, ఏడాదిన్నర కాలంలో క్లినికల్ ట్రయిల్స్ స్థాయికి పరిశోధనను తీసుకువచ్చి ప్రొటోటైప్ స్టెంట్‌ను అభివృద్ధి చేయాలని భావిస్తున్నాం. ఇప్పుడున్న లోహాలతోనే అవసరం తీరిన తర్వాత శరీరంలో కరిగిపోయే స్టెంట్‌ను తయారు చేయనున్నాం. ఇందుకోసం శ్రీ చిత్ర తిరునాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌తో కలిసి పని చేస్తున్నాం. బయో మెడికల్ డివైసెస్‌లో ముందుగా స్టంట్‌నే అభివృద్ధి చేయనున్నాం. స్టెంట్ పనితీరు, వ్యయం పూర్తిగా ఆమోదయోగ్యమైనవని రుజువైన తర్వాత ఈ టెక్నాలజీని బదిలీ చేస్తాం. ఏఆర్‌సీఐ తయారీ, మెటీరియల్ సామర్థ్యాలను వినియోగించి విమానాల మరమ్మతు టెక్నాలజీలను, పరికరాలను అభివృద్ధి చేయనున్నాం. యాడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ (3డీ ప్రింటింగ్) టెక్నాలజీల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు రానున్నాయి. ఇప్పటికే ఒక యూనిట్ ఉంది. కొన్ని అప్లికేషన్లు అభివృద్ధి చేశాం. దీన్ని మరింత పెంచనున్నాం. యాడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్‌పై భవిష్యత్తులో దృష్టి కేంద్రీకరించనున్నాం.

**ఆటోమోటివ్ రంగంలో ఎలక్ట్రిక్ వాహనాలు వస్తున్నాయి. ఈ రంగానికి ఏమైనా ఉత్పత్తులను అభివృద్ధి చేస్తున్నారా?**

లిథియం అయాన్ బ్యాటరీ సెల్ టెక్నాలజీని అభివృద్ధి చేస్తున్నాం. ప్రస్తుతం ఈ టెక్నాలజీ క్షేత్ర స్థాయి పరిశీలనలో ఉంది. సెల్ కాకుండా అందులో వినియోగించే మెటీరియల్‌ను కూడా అభివృద్ధి చేశాం. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేయడానికి దాదాపు డజను కంపెనీలతో చర్చలు జరుపుతున్నాం. టెక్నాలజీ పొందిన కంపెనీ వచ్చే ఏడాది చివరినాటికి వాణిజ్యపరంగా లిథియం అయాన్ బ్యాటరీలు తయారు చేసే యూనిట్ ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ద్విచక్ర, త్రిచక్ర వాహనాలను దృష్టిలో పెట్టుకుని సెల్ టెక్నాలజీని అభివృద్ధి చేశాం. ఈ వాహనాల్లో వినియోగించే బ్యాటరీ పరిమాణం ఒక కిలోవాట్ నుంచి 2 కిలోవాట్ల వరకూ ఉంటుంది. భవిష్యత్తులో ఈ టెక్నాలజీని బస్సులు, కార్లలో కూడా వినియోగించుకోవచ్చు. సెల్ తయారీలో 40 శాతం మెటీరియల్ వ్యయం ఉంటుంది. దేశీయంగా మెటీరియల్‌ను అభివృద్ధి చేసినందున సెల్ వ్యయం 10 శాతం వరకూ తగ్గడానికి అవకాశం ఉంది. ఎలక్ట్రిక్ వాహనాల్లో మోటర్ ఆల్టర్నేటర్లు ఉంటాయి. వాటికి కావాల్సిన ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ మెటీరియల్స్ అభివృద్ధి చేస్తున్నాం. సూపర్ కెపాసిటర్ టెక్నాలజీలను కూడా అభివృద్ధి చేయనున్నాం. ఇది వాణిజ్య పరంగా అందుబాటులోకి రావడానికి రెండేళ్లు పట్టొచ్చు. ఇవి ఎలక్ట్రిక్ వాహనాల్లో బ్యాటరీలపై ఎక్కువ భారం పడకుండా చేస్తాయి. బ్యాటరీ పని చేసే కాలం పెరుగుతుంది. మెటీరియల్స్‌ను ఇప్పటికే తయారు చేశాం. లిథియం నిల్వలు అన్ని చోట్ల లేనందున ప్రత్యామ్నాయ బ్యాటరీలను అభివృద్ధి చేయాలని భావిస్తున్నాం. సోడియం అయాన్ బ్యాటరీల వంటి వాటిని తయారు చేయడంపై పరిశోధనలు చేపట్టాం. బ్యాటరీల్లో సేఫ్టీని పెంచడానికి సాలిడ్ స్టేట్ బ్యాటరీలను అభివృద్ధి చేయనున్నాం.

**ఇంధన రంగంలో కొత్త ఉత్పత్తులు అభివృద్ధి చేస్తున్నారా?**

భారత్‌లో దుమ్ము ఎక్కువగా ఉంటుంది. సౌర విద్యుత్ రంగంలో వినియోగించే సోలార్ ఫోటో వోల్టాయిక్ ప్యానళ్లపై దుమ్ము పడి వాటి సామర్థ్యం తగ్గుతుంది. కొద్దిగా నీళ్లు వినియోగించిన వెంటనే దుమ్ము పోయే విధమైన కోటింగ్ టెక్నాలజీని అభివృద్ధి చేశాం. ఈ కోటింగ్ వల్ల ఫోటో వోల్టాయిక్ ప్యానల్‌ను ఎక్కువసార్లు శుభ్రం చేయాల్సిన అవసరం ఉండదు. సూర్యరశ్మి నుంచి వేడిని తీసుకునే పరికరాలు మరింత ఎక్కువ వేడిని తీసుకునే కోటింగ్‌లను తయారు చేశాం. ప్రస్తుతమున్న థర్మల్ విద్యుత్ ప్లాంట్ల సామర్థ్యాలను పెంచడానికి అవసరమైన మెటీరియల్స్, తయారీ టెక్నాలజీలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం రూ.40 కోట్ల నిధులు ఇచ్చింది. ఈ విభాగంలో హై టెంపరేచర్ కోటింగ్‌లు మొదలైన వాటిపై పరిశోధన జరుగుతోంది. సిరామిక్స్ రంగంలో ప్రస్తుతం ఎక్కువ వేడిని తట్టుకుని వ్యాపించకుండా ఉండే అల్ట్రా లో ఎక్స్‌పాన్షన్ గ్లాస్ సిరామిక్‌ను అభివృద్ధి చేస్తున్నాం.

*- హైదరాబాద్, ఆంధ్రజ్యోతి బిజినెస్*

## టెలికాం కంపెనీలకు చుక్కెదురు

- ఏజీఆర్‌పై డాట్ వాదనను సమర్థించిన సుప్రీం కోర్టు
- కంపెనీలపై రూ.1.33 లక్షల కోట్ల భారం

న్యూఢిల్లీ: సర్దుబాటు చేసిన స్థూల ఆదాయం (ఏజీఆర్) విషయంలో టెలికాం కంపెనీలకు సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. ఈ విషయంలో సర్వోన్నత న్యాయస్థానం.. టెలికాం శాఖ (డాట్) వాదనను సమర్థించింది. జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ ఎస్ఏ నజీర్, జస్టిస్ ఎంఆర్ షాలతో కూడిన ధర్మాసనం గురువారం ఈ మేరకు తీర్పు వెలువరించింది. దీంతో లైసెన్సు ఫీజు, స్పెక్ట్రమ్ యూసేజ్ చార్జీల (ఎస్‌యూసీ) రూపంలో కంపెనీలపై రూ.1.34 లక్షల కోట్ల చెల్లింపుల భారం పడనుంది. ఇందులో లైసెన్సు ఫీజు కింద చెల్లించాల్సిన బకాయిల భారమే రూ.92,000 కోట్ల వరకు ఉంటుందని అంచనా. వడ్డీ, జరిమానాతో సహా ఈ మొత్తాన్ని చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కంపెనీలు ఎప్పటిలోగా ఈ మొత్తాన్ని చెల్లించాలనే విషయాన్ని కోర్టు త్వరలో నిర్ణయిస్తుంది.

**ఏ కంపెనీపై ఎంత భారం**

| | |
|---|---|
| భారతి ఎయిర్‌టెల్ | రూ.42,000 కోట్లు |
| వొడాఫోన్-ఐడియా | రూ.40,000 కోట్లు |
| ఆర్ కామ్ | రూ.16,500 కోట్లు |
| బీఎస్ఎన్ఎల్ | రూ.2,100 కోట్లు |
| ఎంటీఎన్ఎల్ | రూ.2,537 కోట్లు |
| రిలయన్స్ జియో | రూ.14 కోట్లు |

**ఏమిటీ వివాదం?**

ప్రతి టెలికాం కంపెనీ ఏటా తనకు వచ్చే ఏజీఆర్‌లో 8 శాతం లైసెన్సు ఫీజుగా, 3 శాతం ఎస్‌యూసీగా టెలికాం శాఖకు చెల్లించాలి. అయితే ఈ ఏజీఆర్ నిర్వచనంపై 2005 నుంచి టెలికాం వివాదాల అప్పీళ్ల ట్రిబ్యునల్ (టీడీశాట్), హైకోర్టులు, సుప్రీం కోర్టుల్లో కేసు నడుస్తోంది. అద్దెలు, డివిడెండ్ ఆదాయం, వడ్డీ ఆదాయం, స్థిరాస్తుల అమ్మకంపై వచ్చే లాభాల వంటి నాన్-టెలికాం కార్యకలాపాల ఆదాయాన్ని ఏజీఆర్‌లో కలపకూడదని కంపెనీల వాదన. డాట్ మాత్రం ఈ ఆదాయాలు కూడా ఏజీఆర్ పరిధిలోకే వస్తాయని వాదిస్తోంది. దీంతో కంపెనీలు డాట్ డిమాండ్ చేసిన మొత్తంలో 85 శాతం చెల్లిస్తూ, మిగతా 15 శాతాన్ని పెండింగ్‌లో పెట్టాయి. టీడీశాట్, హైకోర్టుల్లో తీర్పు కంపెనీలకే అనుకూలంగా వచ్చింది. సుప్రీంకోర్టులో మాత్రం చుక్కెదురైంది. రోమింగ్ చార్జీలు, టెర్మినేషన్ ఫీజు మినహా మిగతా అన్ని ఆదాయాలు ఏజీఆర్ పరిధిలోకి వస్తాయని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. మరోవైపు తీర్పు నేపథ్యంలో ఈ బకాయిల వసూలు కోసం టెలికాం ఆపరేటర్లకు 10 రోజుల్లో నోటీసులు జారీ చేయబోతున్నట్టు అధికార వర్గాలు చెప్పాయి.

## సైయెంట్, క్లియర్ హారిజోన్ మధ్య సహకారం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నాణ్యమైన అసెట్ డేటా నిర్వహణకు బ్రిటన్‌కు చెందిన క్లియర్ హారిజోన్‌తో సైయెంట్ చేతులు కలిపింది. ఇందులో భాగంగా క్లియర్ హారిజోన్‌కు చెందిన మొబైల్ ప్రొడక్ట్‌తో యుటిలిటీ పరిశ్రమలోని సిస్టమ్స్ ఇంటిగ్రేషన్‌లో తనకున్న అనుభవాన్ని ప్రపంచ వ్యాప్త విస్తరణను సైయెంట్ కలుపుతుంది. దీని వల్ల అడ్వాన్స్‌డ్ అసెట్ మేనేజ్‌మెంట్, నిర్ణయ మద్దతు సామర్థ్యాల ద్వారా ఖాతాదారులు ప్రయోజనం పొందుతారు. క్లియర్ హారిజోన్ మొబైల్ ప్రొడక్ట్ సీహెచ్ఐఎంఈని విద్యుత్, ఆయిల్ అండ్ గ్యాస్, రైల్వేలు మొదలైన రంగాల్లోని కంపెనీని వినియోగిస్తాయి. ఇది మొబైల్ డేటాను సమీకరించే ఉత్పత్తి.

## భారత్ వృద్ధి రేటు 5.5 శాతమే: ఫిచ్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను భారత్ వృద్ధి రేటు అంచనాను అంతర్జాతీయ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ మరింతగా తగ్గించింది. కేవలం 5.5 శాతం మాత్రమే వృద్ధి రేటు నమోదవుతుందని అంచనా వేసింది. బ్యాంకుల నుంచి రుణలభ్యత తగ్గిపోవడంతోనే ఆర్థిక వ్యవస్థ ఆరేళ్ల కనిష్ఠానికి దిగజారిందని విశ్లేషించింది. అయితే.. ఈ ఏడాది జూన్‌లో వృద్ధి రేటును 6.6 శాతంగా ఫిచ్ అంచనా వేయడం గమనార్హం.

**24న ఫారం గేటు అమ్మకం ధరలు**

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.45 — నెక్ (100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| | | 25వ తేదీకి.. | |
| హైదరాబాద్ | 383 | విశాఖపట్నం | 385 |
| బెంగళూరు | 400 | వరంగల్ | 386 |
| విజయవాడ | 380 | చెన్నై | 430 |
| గోదావరి | 380 | చిత్తూరు | 423 |
| నమక్కల్ | 400 | ముంబై | 438 |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 79 | విజయవాడ | 80 |
| వరంగల్ | 79 | గుంటూరు | 81 |
| మహబూబ్‌నగర్ | 79 | ఒంగోలు | 82 |
| కరీంనగర్ | 79 | చిత్తూరు | 89 |
| కర్నూలు | 79 | నెల్లూరు | 89 |
| విశాఖపట్నం | 68 | అనంతపురం | 90 |
| గోదావరి | 76 | | |

**బులియన్**



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 38,530 | 38,500 | 39,660 | 38,400 | 38,280 |
| క్రితం ముగింపు | 38,310 | 38,450 | 39,650 | 38,400 | 38,320 |
| 22 క్యారెట్లు | 36,680 | 35,700 | 36,480 | 35,670 | 36,630 |
| క్రితం ముగింపు | 36,500 | 35,650 | 36,470 | 35,580 | 36,670 |
| వెండి (కిలో) | 45,300 | 46,800 | 46,700 | 46,700 | 49,000 |
| క్రితం ముగింపు | 45,400 | 47,000 | 46,800 | 46,700 | 49,100 |

## ఇన్ఫీపై ఎన్ఎఫ్ఆర్ఏ ఆరా

న్యూఢిల్లీ: ఇన్ఫోసిస్‌కు చిక్కులు పెరుగుతున్నాయ్. కంపెనీ సీఈఓ, సీఎఫ్ఓపై వచ్చిన 'అనైతిక అకౌంటింగ్' ఆరోపణలపై ఆరా తీయాలని నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ (ఎన్ఎఫ్ఆర్ఏ)ని కేంద్ర ప్రభుత్వం కోరింది. ఎన్ఎఫ్ఆర్ఏ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆడిటింగ్ సంబంధిత నియంత్రణ మండలి. స్వంతంగా లేదా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఆడిటింగ్ అక్రమాల కేసులను చేపడుతుంది. ఇప్పటికే ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ గ్రూప్‌లో జరిగిన ఆడిటింగ్ అక్రమాలపై విచారణ జరుపుతున్న ఎన్ఎఫ్ఆర్ఏకు తాజాగా కేంద్రం ఇన్ఫోసిస్ కేసును సైతం అప్పజెప్పింది. మరోవైపు ప్రజావేగు చేసిన ఫిర్యాదుపై అమెరికాకు చెందిన సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (సెక్) కూడా దర్యాప్తు మొదలుపెట్టింది.

## ఈ ఏడాది 18 శాతం వృద్ధి

- థామస్‌కుక్ ఇండియా అంచనా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్):దేశ, విదేశీ ప్రయాణ, విహారయాత్రలు తదితర సర్వీసులు అందిస్తున్న థామస్‌కుక్ ఇండియా ఈ ఏడాదిలో 15-18 శాతం వృద్ధిని అంచనా వేస్తోంది. గడచిన సంవత్సరంలో ఈ కంపెనీ 20 శాతం వృద్ధిని సాధించింది. ఏపీ, తెలంగాణ ప్రయాణికుల కోసం 'సమ్మర్ 2020' ప్యాకేజీని విడుదల చేసింది. ఈ సందర్భంగా థామస్‌కుక్ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్, హెడ్ రోమిల్ పంత్ మాట్లాడుతూ.. తెలంగాణలో హైదరాబాద్ మార్కెట్ చాలా కీలకంగా ఉందని చెప్పారు. సంస్థ మొత్తం వ్యాపారంలో ఏపీ, తెలంగాణ వాటా పది శాతంఉందని తెలిపారు. ఇప్పటికే రెండు రాష్ట్రాల్లో 14 కార్యాలయాలను నిర్వహిస్తున్నామని, త్వరలోనే హైదరాబాద్, వరంగల్‌లో ఒక్కో కార్యాలయాన్ని ప్రారంభిస్తామన్నారు. థామస్‌కుక్ యూకే దివాలా తీసిన ప్రభావం ఇండియా వ్యాపారంపై లేదన్నారు.

## 39 శాతం తగ్గిన మారుతీ లాభం

### జూలై-సెప్టెంబరులో రూ.1,391 కోట్లు

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద కార్ల విక్రయ సంస్థ మారుతీ సుజుకీ త్రైమాసిక లాభం 8 ఏళ్లలో ఎన్నడూ లేనంత తగ్గుదలను నమోదు చేసుకుంది. సెప్టెంబరుతో ముగిసిన మూడు నెలల్లో కంపెనీ నికర లాభం 38.99 శాతం తగ్గి రూ.1,3911.11 కోట్లకు పడిపోయింది. వాహన రంగంలో విక్రయాల మందగమనం కారణంగా లాభాలకు భారీ గండిపడింది. గత ఏడాది జూలై-సెప్టెంబరు కాలానికి కంపెనీ రూ.2,280.20 కోట్ల లాభం గడించింది. చివరిసారి 2011-12 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో మారుతీ సుజుకీ లాభం 56 క్షీణతతో రూ.241 కోట్లకు పడిపోయింది.

**ముఖ్యాంశాలు**

- సమీక్షా కాలానికి(ఈ ఏడాది జూలై-సెప్టెంబరు) ఆదాయం వార్షిక ప్రాతిపదికన 25.19 శాతం తగ్గి రూ.16,123.20 కోట్లకు జారుకుంది. వాహనాల విక్రయాలు 30.2 శాతం తగ్గి 3,38,317 యూనిట్లకు పరిమితం అయ్యాయి.
- 2019-20 ప్రథమార్ధానికి లాభం 35.55 శాతం పడిపోయి రూ.2,767.9 కోట్లకు తగ్గగా.. ఆదాయం రూ.34,862 కోట్లకు జారుకుంది. విక్రయాలు 24 శాతం క్షీణించి 7,40,911 యూనిట్లుగా నమోదయ్యాయి.
- చిన్న కార్ల విక్రయాలు భారీగా తగ్గిన కారణంగా సెప్టెంబరు చివరినాటికి ప్యాసింజర్ వాహనాల విభాగంలో మారుతీ సుజుకీ మార్కెట్ వాటా 60 శాతానికి తగ్గింది. గత ఏడాది ఇదే కాలానికి వాటా 65 శాతంగా ఉంది.



వేదవిద్య ఫలితాలను విడుదల చేస్తున్న కోన రఘుపతి, వెలంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు తదితరులు

## అర్చకుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- దేవదాయశాఖ మంత్రి వెలంపల్లి
- అర్చక పరీక్ష ఫలితాలు విడుదల చేసిన మంత్రి

అమరావతి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో అర్చకుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని దేవదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాస రావు తెలిపారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఈ ఏడాది జులై 13, 14 తేదీల్లో నిర్వహించిన అర్చక (ఆగమ కోర్సులు) పరీక్ష ఫలితాలను గురువారం ఆయన అమరావతి సచివాలయంలో డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి, ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో కలిసి విడుదల చేశారు. మొత్తం 5176 మంది హాజరుకాగా 4396 మంది(84.93శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు మంత్రి ప్రకటించారు. వీరిలో 'ప్రవేశ' 3167 మంది, 'వర' 712 మంది, 'ప్రవర' 517 మంది ఉత్తీర్ణులయ్యారని, 37 మంది ఫలితాలను విత్‌హోల్డ్‌లో ఉంచినట్లు మంత్రి వెలంపల్లి తెలిపారు. పరీక్షల్లో ఫెయిల్ అయిన అభ్యర్థులకు ఎలాంటి అనుమానాలున్నా, రీ వెరిఫికేషన్‌కు అవకాశం ఉందని, ఫలితాలను https://tms.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు దేవదాయ కమిషనర్ పద్మ తెలిపారు. రీకౌంటింగ్ కోసం దరఖాస్తు చేయదలచినవారు రూ. 200 డీడీతో 'కంట్రోలర్, అర్చక(ఆగమ) పరీక్షలు, ఆంధ్రప్రదేశ్, విజయవాడ' పేరుతో డీడీ తీసి దేవదాయశాఖ కార్యాలయానికి అందించాలని సూచించారు. కాగా, ఈ సందర్భంగా మంత్రి వెలంపల్లి మాట్లాడుతూ అర్చకుల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారనటానికి ఈ పరీక్షల నిర్వహణే నిదర్శనమన్నారు. గత ప్రభుత్వం అర్చక పరీక్షలకు ఎలాంటి ప్రయత్నం చేయలేదని మంత్రి విమర్శించారు. డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, దేవదాయ కమిషనర్ పద్మ, రాష్ట్ర అర్చక సమాఖ్య అధ్యక్షుడు కామేశ్ శర్మ పాల్గొన్నారు.

## ప్రజాభిప్రాయం మేరకే ఏపీ రాజధాని

- కేసీఆర్ తెలివైన నేత: స్పీకర్ సీతారాం



దైవ దర్శనం చేసుకుంటున్న తమ్మినేని సీతారాం

భద్రాచలం, అక్టోబరు 24: ఏపీ కొత్త రాజధాని విషయంలో ప్రజాభిప్రాయం మేరకే నిర్ణయం తీసుకొంటారని ఏపీ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గురువారం ఆయన కుటుంబసమేతంగా భద్రాచలం వచ్చి శ్రీరాముడిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాజధాని విషయమై అమరావతే మంచిదని ప్రజాభిప్రాయం వస్తే దాన్నే ఖాయం చేస్తూ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని చెప్పారు. ఏదైనా ప్రజాభిప్రాయం మేరకే నిర్ణయం తీసుకుంటారని ఆయన అన్నారు. భద్రాచలం మండలం నుంచి ఏపీలో కలిసిన ఐదు పంచాయతీలపై తెలుగు రాష్ట్రాల సీఎంలు సానుకూల దృక్పథంతో ఉన్నారని తెలిపారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన తాను ఆ మొక్కును తీర్చుకునేందుకే భద్రాద్రి రామయ్యను దర్శించుకున్నానన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్ తనకు మంచి మిత్రుడని, ఎంతో గొప్ప తెలివైన నాయకుడన్నారు. ఏపీలో జగన్మోహన్‌రెడ్డి పాలన అద్భుతంగా ఉందని, అక్కడ 'సామాజిక' ప్రభుత్వం నడుస్తోందని అన్నారు.

## తిరుపతిలో ఆధ్యాత్మిక నగరం: వైవీ



ఒంగోలు కల్చరల్, అక్టోబరు 24: తిరుమలలో రద్దీ తగ్గించేందుకు.. తిరుమలకు అనుసంధానంగా తిరుపతిలో 200 ఎకరాల్లో అన్ని వసతులతో కూడిన ఆధ్యాత్మిక నగరాన్ని నిర్మించాలని టీటీడీ నిర్ణయించినట్లు బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం ఒంగోలు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. తిరుమల కొండపై ప్రస్తుతం పరిశుభ్రమైన జల ప్రసాదాన్ని భక్తులకు అందిస్తున్నామన్నారు. అలాగే, పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్‌ను దశలవారీగా నియంత్రిస్తామన్నారు. ప్లాస్టిక్ బాటిల్స్‌కు ప్రత్యామ్నాయం తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు సుబ్బారెడ్డి తెలిపారు. పర్యావరణ హితమైన లడ్డూ సంచులపైనా కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం నడుస్తున్న డీజిల్ వాహనాలకు బదులు తిరుమలలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడతామని చెప్పారు. శ్రీవాణి పథకం ద్వారా రూ.10వేలు చెల్లించే భక్తులకు బ్రేక్ దర్శనం కల్పిస్తున్నట్లు చైర్మన్ పేర్కొన్నారు.

## 1 నుంచి కంటివెలుగు రెండో దశ: సీఎస్

అమరావతి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అంధత్వ నివారణకు చేపట్టిన వైఎస్సార్ కంటి వెలుగు పథకం సత్ఫలితాలిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం సచివాలయంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ పథకం ద్వారా 5.3 కోట్ల మందికి కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేసి కళ్లజోళ్లు అందించామన్నారు. మొదటి దశలో 60,693 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 70 లక్షల మంది విద్యార్థులకు ప్రాథమిక పరీక్షలు నిర్వహించామని వైద్యశాఖ అధికారులు సీఎస్‌కు తెలిపారు. రెండో దశ కంటివెలుగు కార్యక్రమాన్ని నవంబరు 1 నుంచి నిర్వహిస్తామన్నారు.

## వైద్యఆరోగ్య శాఖలో డిప్యూటేషన్లన్నీ రద్దు

వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో ఉన్న డిప్యుటేషన్లు, అదర్ డ్యూటీ(ఓడీ) నియామకాలు రద్దు చేయాలని ఆ శాఖను సీఎంవో ఆదేశించింది. ప్రజలకు మెరుగైన సేవలందించాలంటే వైద్యులు, ఇతర ఉద్యోగులు మందు తమకు కేటాయించిన స్థానాల్లోనే విధులు నిర్వర్తించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ముఖ్యంగా స్పెషలిస్టు డాక్టర్లు తాము ఏ సబ్జెక్టులో అయితే స్పెషలైజేషన్ చేస్తారో ఆ యూనిట్‌లోనే పని చేయాలని ఈమేరకు అన్ని ఏర్పాట్లు చేయాలని సీఎంవో ఆదేశించింది.

## మందులు, సర్జికల్స్ ఉన్నాయి!

- 'ఆంధ్రజ్యోతి' కథనంపై ఆరోగ్యశాఖ స్పందన

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సెంట్రల్ డ్రగ్ స్టోర్స్‌లో మందులు అందుబాటులో ఉన్నాయని ఏపీఎస్ఎంఐడీసీ ఎండీ ఒక ప్రకటనలో తెలిపారు. 'సూదీ లేదు.. దూదీ లేదు' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనంపై ఆరోగ్యశాఖ స్పందించింది. అన్ని స్టోర్లలో మందులు, సర్జికల్స్ అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా 500 గ్రాముల కాటన్ బ్యాండేజీ 8570, వంద గ్రాముల బ్యాండేజీలు 50,644 ఉన్నట్లు తెలిపింది.





## వంద పోటీల్లో నెగ్గిన ఒంగోలు గిత్త మృతి

గన్నవరం, అక్టోబరు 24: ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా వందకు పైగా పోటీల్లో ప్రథమ బహుమతి.. ఏపీ, తెలంగాణ, కర్ణాటక ఎక్కడికెళ్లినా అగ్రస్థానం కొల్లగొడుతూ.. రికార్డులతో సత్తా చాటుతున్న ఒంగోలు జాతి గిత్త అకస్మాత్తుగా మృతిచెందింది. గన్నవరానికి చెందిన కాసరనేని రాజుకు చెందిన రూ.15 లక్షల విలువైన గిత్త ఉన్నట్టుండి అస్వస్థతకు గురై బుధవారం రాత్రి మరణించింది. కడప జిల్లా పోతిరెడ్డిపల్లికి చెందిన ఈ ఒంగోలు జాతి గిత్తను రాజా 2017 నవంబరులో రూ.15 లక్షలకు కొనుగోలు చేశారు. అప్పటి నుంచి మరో మూడు ఎద్దులతో కలసి ఈ గిత్త ఏపీ, తెలంగాణ, కర్ణాటకల్లో 123 జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంది. వీటిలో వందకు పైగా పోటీల్లో అగ్రస్థానం సాధించింది. తమకు జాతీయ స్థాయిలో పేరు తెచ్చిన ఒంగోలు జాతి గిత్త మృతదేహాన్ని పూలతో అలంకరించిన ట్రాక్టర్‌పై రైతులు ఊరేగించి ఖననం చేశారు.

# పరిశ్రమలకు నైపుణ్య యువత

- అందించే బాధ్యత రాష్ట్రప్రభుత్వానిదే
- 25 లోక్‌సభ స్థానాల్లో స్కిల్ సెంటర్లు
- శిక్షణ పొందినవారికి త్వరగా ఉద్యోగాలు
- ఉపాధి కల్పనకు '75% స్థానికులకే' చట్టం
- సూరంపల్లి సీపెట్ ప్రారంభోత్సవంలో జగన్
- రెండో సీపెట్ నాయుడుపేటలో ఏర్పాటు
- కేంద్ర మంత్రి సదానంద గౌడ వెల్లడి



సూరంపల్లిలో సీపెట్ భవన ప్రారంభోత్సవంలో సీఎం జగన్, కేంద్ర మంత్రి సదానందగౌడ

విజయవాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టబోయే పారిశ్రామిక సంస్థలకు నైపుణ్యం కలిగిన యువతను అందించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం 25 పార్లమెంటు నియోజకవర్గాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కృష్ణా జిల్లా సూరంపల్లిలో రూ.50 కోట్ల వ్యయంతో నిర్మించిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్) నూతన భవనాన్ని గురువారం కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రి కె.సదానందగౌడతో కలిసి సీఎం ప్రారంభించారు. శిలాఫలకం ఆవిష్కరణతో పాటు ప్రాంగణంలో ఇద్దరూ మొక్క నాటారు. అనంతరం సీపెట్ విద్యార్థులు ప్రదర్శించిన ప్లాస్టిక్ డిజైన్స్ నమూనాల ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. 'సీపెట్‌లో శిక్షణ పొందిన విద్యార్థులతో పాటు నైపుణ్య శిక్షణ పొందిన వారికి త్వరగా ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో రాష్ట్రంలో ఎవరు పరిశ్రమలు పెట్టినా 75 శాతం ఉద్యోగాలు స్థానిక యువతకే ఇవ్వాలని చట్టం చేశాం. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పారదోలేందుకు, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా ఇక్కడ చట్టం తీసుకొచ్చాం. పరిశ్రమలు పెట్టే వారికి నైపుణ్యవంతమైన యువతను అందించాలని కృతనిశ్చయంతో ఉన్నాం. 25 లోక్‌సభ స్థానాల్లో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటుచేస్తాం. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దడానికి రానున్న రోజులలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడతాం' అని చెప్పారు.

### ప్లాస్టిక్ రీసైక్లింగ్‌తో సరికొత్త ఆవిష్కరణలు

సదానందగౌడ మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పాటైన రాష్ట్రాల ఆర్థికాభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించిందని, రాష్ట్రంలో నెల్లూరు జిల్లా నాయుడుపేటలో రెండో సీపెట్ కేంద్రం ఏర్పాటు చేస్తామని తెలిపారు. 'కేంద్రం ప్లాస్టిక్ రీసైక్లింగ్ పరిశోధనలపై దృష్టి సారించింది. సీపెట్ ద్వారా ప్లాస్టిక్ రీసైక్లింగ్‌తో సరికొత్త ఆవిష్కరణలకు రూపకల్పన జరుగుతోంది. విజయవాడ కేంద్రంగా 2015లోనే సీపెట్ ఏర్పాటుకు బీజం పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి రూ.25 కోట్లు భరించడంతో మొత్తం రూ.50 కోట్ల వ్యయంతో నూతన భవన నిర్మాణం సాకారమైంది. దీనిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తాం' అని పేర్కొన్నారు. కేంద్రమంత్రి తన ప్రసంగంలో కాస్త తడబడ్డారు. ముఖ్యమంత్రి జగన్‌ను తెలంగాణ డైనమిక్ సీఎంగా ముందు పేర్కొన్నారు. తర్వాత పొరపాటును దిద్దుకుని ఆంధ్రప్రదేశ్ డైనమిక్ సీఎంగా అభివర్ణించారు. కార్యక్రమంలో కేంద్ర పెట్రోలియం, ఎరువుల శాఖ కార్యదర్శి రాఘవేంద్రరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, మంత్రులు మేకపాటి గౌతమ్ రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వెలంపల్లి శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, పార్థసారథి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

### సీపెట్ వెనుక అనంతకుమార్ కృషి: బాబు

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీపెట్ ఏర్పాటులో ఆనాటి కేంద్ర మంత్రి దివంగత అనంతకుమార్ కృషి చాలా ఉందని మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రశంసించారు. గురువారం విజయవాడ శివార్లలోని సూరంపల్లిలో సీపెట్ నూతన భవనం ప్రారంభించిన సందర్భంగా ఆయన ఓ ప్రకటన చేశారు. 'టీడీపీ ప్రభుత్వ హయాంలో 2016లో దీని నిర్మాణానికి శంకుస్థాపన చేశాం. దీని ఏర్పాటు, నూతన భవన నిర్మాణంలో అప్పటి ఎరువులు, రసాయనాల మంత్రి అనంతకుమార్ చాలా సహాయం చేశారు. ఆయన కృషిని కొనియాడాలి. ప్లాస్టిక్ ఇంజనీరింగ్ సంస్థల స్థాపన వల్ల ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఇలాంటి శిక్షణ సంస్థ ద్వారా యువత అవకాశాలను అందిపుచ్చుకొని తమ కలలను సాకారం చేసుకోవాలి' అని పిలుపిచ్చారు.

# 'ఉపాధి'లో నిర్మాణాలకు బ్రేక్?

- పంచాయతీ భవనాలు, సైడ్ డ్రైన్లపైనే దృష్టి
- ఇతరత్రా నిర్మాణాలు ఇక కుదరవంటున్న అధికారులు
- బిల్లులు చెల్లించక పనులు చేసేందుకు గ్రామాల్లో విముఖత

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా రాష్ట్రంలో ఇకపై నిర్మాణాలు జరిగే పరిస్థితి కనిపించడం లేదు. ఈ పథకంలో ఇప్పటికే చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేపట్టేందుకు పలువురు విముఖత చూపుతున్నారు. సచివాలయ కార్యకలాపాల నిర్వహణకు రాష్ట్రవ్యాప్తంగా ఇంకా 2వేల గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరముంది. ఉన్నవాటిలో చాలా భవనాలకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. చాలాచోట్ల ప్రస్తుతం ఉన్న గదులు చాలకపోవడంతో వాటిని విస్తరించాల్సిన అవసరముంది. ఉపాధి హామీ పథకం ద్వారానే ఈ పనులన్నీ చేపట్టాలని భావిస్తున్నారు. దీనికోసం రూ.1000- 1500కోట్ల వరకు వ్యయం చేయాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో ఉపాధి హామీ పథకంలో ఇతర మెటీరియల్ పనులు చేపట్టడం వీలుకాదని అధికారులు పేర్కొంటున్నారు. ఇక నుంచి చేపట్టబోయే ఉపాధి పనుల్లో సైడ్ డ్రైన్లు, సచివాలయాల భవనాల నిర్మాణాలకు ప్రాధాన్యమివ్వాలని సీఎంఓ సూచించడంతో వాటిపైనే దృష్టి సారించారు. అవెన్యూ ప్లాంటేషన్, ఉద్యానవన పంటల అభివృద్ధి తదితర కార్యక్రమాలకూ ప్రాధాన్యమిస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో గతేడాది నవంబరు నుంచి మెటీరియల్ కాంపోనెంట్‌కు సంబంధించిన బిల్లులేవీ చెల్లించలేదు. రైతులకు ఉద్యాన పంటల నిర్వహణ వ్యయం చెల్లింపులు నిలిపేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డుకిరువైపులా అవెన్యూ ప్లాంటేషన్, పలు జిల్లాల్లో మండలానికో విలేజ్ పార్కు పనులు పూర్తిచేసి ఆర్నెల్లవుతున్నా బిల్లులివ్వలేదు. గత ప్రభుత్వం ఘనవ్యర్థాల నిర్వహణ కోసం ప్రతి గ్రామంలో షెడ్లను నిర్మించి, స్వచ్ఛభారత్ ఆధ్వర్యంలో గ్రీన్ అంబాసిడర్లను నియమించింది. దీనికి సంబంధించిన బకాయిలు ఇప్పటికీ అందకపోవడంతో పనులు చేపట్టినవారు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లోని పాఠశాలల్లో ఆటస్థలాల అభివృద్ధి, టాయ్‌లెట్ల పనులు చేపట్టిన పాఠశాల విద్యా కమిటీలు కూడా బిల్లులు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపాధి పథకంలో పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, సిమెంట్‌రోడ్లు, డ్రైన్లు, మినీ గోకులం ద్వారా పశువుల షెడ్లు నిర్మించుకున్నవారు లబోదిబోమంటున్నారు.

**కేంద్రం నుంచి నిధులొచ్చినా...:** గతేడాది చేపట్టిన పనులకుగాను కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ నుంచి రూ.1962కోట్లు వచ్చినా వాటిని చెల్లించకుండా ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లించింది. బిల్లులడిగితే పనులు తనిఖీ చేసి చెల్లింపులు చేస్తామని అధికారులకు సాక్షాత్తూ మంత్రివర్యులే స్పష్టం చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో పనులు చేసేందుకు ఎవరూ ముందుకొచ్చే పరిస్థితి లేదు.

## జీఎన్ రావు కమిటీ భేటీ

- మాస్టర్ ప్లాన్, రాజధానిపై సీఆర్డీయే ఉన్నతాధికారుల వివరణ

అమరావతి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాజధానితోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను పరిశీలించి, అన్ని ప్రాంతాలూ సమానాభివృద్ధి చెందేందుకు అవసరమైన సలహాలు, సూచనలను ఇచ్చేందుకు గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జీఎన్ రావు కమిటీ గురువారం రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఏపీసీఆర్డీయే ఉన్నతాధికారులతో భేటీ అయింది. రాజధానిని అమరావతిలోనే కొనసాగించాలా, లేదా దీనికంటే అనువైన మరొక ప్రదేశానికి తరలించాల్సిన అవసరమేమన్నా ఉందా అనే అత్యంత కీలకమైన అంశంపై కూడా ఈ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి తగిన సూచనలను చేయాల్సిన దృష్ట్యా ఈ సమావేశానికి విశేష ప్రాధాన్యం సమకూరింది. ఈ కమిటీకి సీఆర్డీయే ఉన్నతాధికారులు అమరావతి, దాని మాస్టర్‌ప్లాన్, అందులోని వివిధ ప్రాజెక్టుల గురించి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రదేశాల్లోనూ, అమరావతిలోనూ పర్యటించి, వివిధ వర్గాలతో సంప్రదింపులు జరిపిన అనంతరం 6 వారాల్లో ఈ కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంది. అమరావతికి సంబంధించిన అవగాహన పెంపొందించుకునేందుకు సమావేశం నిర్వహించినట్లు జీఎన్ రావు తెలిపారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా కమిటీ పర్యటిస్తుందని చెప్పారు.

### పురపాలక, టిడ్కో అధికారులతో బొత్స సమావేశం

పురపాలక శాఖ కార్యదర్శి జె.శ్యామలరావు, ఏపీ టిడ్కో ఎండీ దివాన్ మైదీన్ తదితర ఉన్నతాధికారులతో మంత్రి బొత్స సమావేశమయ్యారు. సీఆర్డీయే ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆయా శాఖలు, విభాగాలకు చెందిన పలు అంశాలను బొత్స సమీక్షించారు.

# ఆఖరి భేటీలోనూ అనుమానాలే!

- అంచనాలు పెంచేశారు.. అవార్డులిచ్చారా?
- ధరలు, భూసేకరణ విస్తీర్ణం ఎందుకు పెరిగింది?
- జల వనరులశాఖను మళ్లీ ప్రశ్నించిన కేంద్రం

అమరావతి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పోలవరం సాగునీటి ప్రాజెక్టు నిర్మాణంలో అంచనాలు ఎప్పటికప్పుడు ఎందుకు పెరిగాయని రాష్ట్ర జల వనరులశాఖను కేంద్ర ఆర్థిక శాఖ పరిధిలోని అంచనాల సమీక్షా కమిటీ(ఆర్‌సీఈ) నిలదీసింది. ప్రాజెక్టు నిర్మాణం కోసం భూసేకరణ ప్రారంభ సమయానికి, చివరికొచ్చే సరికి ఎందుకు తేడా వచ్చిందంటూ ప్రశ్నించింది. భూసేకరణ విస్తీర్ణంతోపాటు సేకరణ ధరలూ భారీగా ఎందుకు పెరిగాయి? నిర్వాసిత కుటుంబాల సంఖ్య మూడింతలకు ఎందుకు చేరింది? అంచనాలు పెంచినప్పుడు ప్రభుత్వ ఆమోదం తెలుపుతూ అవార్డులు జారీ చేశారా? అని ఆరా తీసింది. పెంచిన వ్యయానికి సంబంధించి చెల్లింపులు జరుపుతున్నప్పుడు ప్రభుత్వం ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేసిందా అని ప్రశ్నించింది. ఆఖరి సమావేశంలో కేంద్ర ఆర్థికశాఖ అంచనాల సమీక్షా కమిటీ సంధించిన ఈ ప్రశ్నలకు రాష్ట్ర జల వనరుల శాఖ విస్తుబోయింది.

పోలవరం తుది అంచనాలపై కేంద్ర ఆర్థికశాఖ పరిధిలోని ఈ కమిటీ గురువారం ఢిల్లీలో సమావేశమైంది. ఈ సమావేశానికి రాష్ట్ర జల వనరుల శాఖ నుంచి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్, ఇంజనీర్-ఇన్-చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు, పోలవరం ప్రాజెక్టు సీఈ సుధాకరబాబు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు... ఈ కమిటీ వేసిన ప్రశ్నలకు రాష్ట్ర జల వనరులశాఖ అక్కడికక్కడే సమాధానాలు చెప్పింది. పోలవరం ప్రాజెక్టు ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ చోటు చేసుకున్న పరిణామాలన్నింటినీ వరుస క్రమంలో వెల్లడించింది. అయితే.. 2004-05లో పనులు ప్రారంభించేనాటికి పోలవరం సాగునీటి ప్రాజెక్టు కోసం అవసరమైన భూమి ఎంత? ఎంత సేకరించారు? అప్పట్లో భూముల ధరలెంత? అని కమిటీ ప్రశ్నించింది. ఈ భూముల ధరలు 2010 నాటికి ఎంతకు చేరుకున్నాయి? 2013లో ఎంత ఉన్నాయంటూ ఆరా తీసింది. 2014లో ఈ భూముల ధరలు భారీగా ఎందుకు పెరిగాయని సందేహం వ్యక్తం చేసింది. నిర్వాసిత కుటుంబాలకు చెల్లింపులు జరిగిన తీరుపైనా రాష్ట్ర జల వనరులశాఖ సహాయ, పునరావాస కమిషనర్ నుంచి కేంద్రం సమాచారం రాబట్టింది. ఆఖరి సమావేశమంటూనే కమిటీ ఇన్ని ప్రశ్నలు వేస్తుందేంటని రాష్ట్ర జల వనరులశాఖ సందేహం వ్యక్తం చేసింది.

'రాష్ట్ర విభజన చట్టంలో పోలవరం సాగునీటి ప్రాజెక్టును జాతీయ హోదా ప్రాజెక్టుగా కేంద్రం ప్రకటించింది. వాస్తవానికి ఈ ప్రాజెక్టు నిర్మాణం, పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్రానిదే. ఈ ప్రాజెక్టు ప్రయోజనాలు రాష్ట్రానికి దక్కుతాయి. అందువల్ల ఈ ప్రాజెక్టు నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలను మాత్రమే రాష్ట్రం స్వీకరించింది. ఈ ప్రాజెక్టు పూర్తయ్యేంత వరకూ కేంద్రమే నిధులు మంజూరు చేయాలి. పోలవరం తుది అంచనాలను కేంద్రం త్వరగా ఆమోదిస్తే... నిర్మాణ సంస్థలకు బిల్లులు, భూ నిర్వాసితులకు త్వరితగతిన పరిహారమూ చెల్లించేందుకు అవకాశం ఉంది. లేదంటే.. ప్రాజెక్టు నిర్మాణం జాప్యం జరుగుతుంది. అంచనాల పెంపుదల నిర్ణయం అంతిమంగా కేంద్రానిదే' అని రాష్ట్ర జల వనరులశాఖ స్పష్టం చేసింది. దీంతో ఈ సమావేశం మినిట్స్‌ను త్వరలోనే తెలియజేస్తామని కేంద్ర ఆర్థికశాఖ స్పష్టం చేస్తూ సమావేశాన్ని ముగించింది.

### యథాతథంగా కేంద్రం ఆమోదిస్తుందా?

పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర జల వనరుల శాఖ పంపిన తుది అంచనాలు రూ.55,548.87 కోట్లకు కేంద్ర ఆర్థికశాఖ ఆమోదం తెలుపుతుందా?.. లేదంటే ఇందులో కోత విధిస్తుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో జిల్లాల్లోని ఇంజనీరింగ్ అధికారులు సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్)ను పంపినప్పుడు రాష్ట్రస్థాయిలోని ప్రాజెక్టు రివ్యూ కమిటీ సమీక్షిస్తుంది. ఈ కమిటీ.. అంచనాలపై లోతైన అధ్యయనం చేస్తుంది. చివరికి వాస్తవ అంచనాలు, డిజైన్ల ఆధారంగా ప్రాజెక్టు వ్యయాన్ని ఖరారు చేస్తుంది. ఇప్పుడు కేంద్రం కూడా ఇదే తరహా విధానాన్ని అమలు చేస్తుందని రాష్ట్ర జల వనరుల శాఖ చెబుతోంది. తుది అంచనాలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో?.. ఎంతకు పరిమితం చేస్తుందో?.. అనే సందేహాలను వ్యక్తం చేస్తోంది. అయితే కేంద్ర జల సంఘం పరిధిలోని టీఏసీ నిర్ధారించిన రూ.55,548.87 కోట్లు కంటే తక్కువకు ఆమోదం తెలిపే అవకాశం ఉందన్న అభిప్రాయాన్ని రాష్ట్రం వ్యక్తం చేస్తోంది. ప్రధానంగా భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాల వ్యయాన్ని కుదించే వీలుందని భావిస్తోంది.

## ప్రజలను భాగస్వాములుగా చేస్తాం

- టెండర్ల విధివిధానాలపై పరిగణనలోకి అభిప్రాయాలు
- ప్రజాధనం దుర్వినియోగం కానివ్వం
- ఏపీ జ్యుడీషియల్ ప్రివ్యూ కమిటీ చైర్మన్ జస్టిస్ శివశంకరరావు



గుంటూరు(తూర్పు), అక్టోబరు 24: రూ.100 కోట్లకు పైబడిన కాంట్రాక్టులను పారదర్శకంగా నిర్వహించాలనేది ప్రభుత్వ లక్ష్యమని, ఈ దిశగా ప్రజలు, మేధావులు, విద్యావేత్తలు సూచనలు ఇవ్వాలని ఏపీ జ్యుడీషియల్ ప్రివ్యూ కమిటీ చైర్మన్ జస్టిస్ శివశంకరరావు కోరారు. వాటిని పరిశీలించి పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. సలహాలను www.judicialpreview.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో ఉన్న పబ్లిక్‌డొమైన్‌లో తెలపాలన్నారు. మెయిల్ ద్వారా పంపాలంటే apjudicialpreview@gma-il.com కు పంపవచ్చన్నారు. గురువారం గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టే పనుల్లో అవినీతి లేకుండా, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడటం, కాంట్రాక్టులు పారదర్శకంగా అమలు చేయడమే జ్యుడీషియల్ ప్రివ్యూ కమిటీ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. రూ.100 కోట్లకు పైబడిన పనులకు సంబంధించిన ప్రతిపాదనలు జ్యుడీషియల్ ప్రివ్యూ కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖ అధికారులతో సమీక్షించి ఎటువంటి అభ్యంతరాలు లేకపోతే పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతామన్నారు. పబ్లిక్ డొమైన్‌లో ఉంచిన తరువాత ఏడు పనిదినాలలో సంబంధిత పనులపై ప్రజలు తెలిపిన అభ్యంతరాలు, సలహాలు స్వీకరిస్తామని చెప్పారు. అభ్యంతరాలను ఎప్పటికప్పుడు సంబంధిత శాఖకు పంపుతామని, అవసరమైతే ప్రజల అభ్యంతరాలపై క్షేత్రస్థాయిలో సాంకేతిక నిపుణులను పంపి వారి నుంచి వివరణ తీసుకుంటామన్నారు. పబ్లిక్ డొమైన్‌లో ప్రతి సలహాకు రెండు పేజీలను కేటాయించినట్లు తెలిపారు. పబ్లిక్‌డొమైన్‌లోనేగాకుండా మెయిల్, ఉత్తరాల ద్వారా కూడా ప్రజలు తమ అభిప్రాయాలను తెలపవచ్చని అన్నారు. ప్రస్తుతం ఏపీఎంఎస్ఐడీసీ నుంచి 1,04, 108, ఆపరేషన్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్స్ ఏర్పాటుకు సంబంధించి మూడు ప్రతిపాదనలు వచ్చాయని, వీటిని పరిశీలించి రివ్యూ వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. వీటిపై ఏవైనా సలహాలు, సూచనలు ఉంటే ఈ నెల 31లోపు పబ్లిక్‌డొమైన్ ద్వారా ప్రజలు తెలపాలన్నారు.

## సమాచార శాఖకు 142 పోస్టులు

సమాచార పౌరసంబంధాల శాఖకు 142 పోస్టులు మంజూరు చేస్తూ సాధారణ పరిపాలన శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర మంత్రుల వద్ద, సీఎంవో, సీసీసీ, ఎంఐఎంఎస్, ఎస్ఐసీ, పబ్లిసిటీ సెల్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను ఔట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయాలని జీవోలో పేర్కొన్నారు. ఈ 142 పోస్టుల్లో 50 పీఆర్వో పోస్టులున్నాయి. ఇందులో 25 పీఆర్వో పోస్టులు మంత్రుల పేషీల్లో, మిగిలిన 25 మందిలో 13 జిల్లాలకు 13 మంది పీఆర్వోలు, మిగిలిన 12 మందిని సీఎంఓ, సీసీసీ, ఎంఐఎంఎస్, ఎస్ఐసీ, పబ్లిసిటీ సెల్‌లో పీఆర్వోలుగా విధులు నిర్వర్తించనున్నారు. వీరితో పాటు ఒక ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్, ఒక అసిస్టెంట్ ఫొటోగ్రాఫర్, మరో 15 మంది ఫొటోగ్రాఫర్లు, 15 మంది వీడియోగ్రాఫర్లు, 30 మంది ఇన్ఫర్మేషన్ టెక్నీషియన్లు, 15 మంది డీఈవోలు, ఐదుగురు డ్రైవర్లు, 10 మంది ఆఫీస్ బాయ్ పోస్టులు ఉన్నాయి.

# మందు బంద్?

- డిస్టిలరీలకు 1700కోట్ల బకాయి
- మద్యం సరఫరా నిలిపివేత
- నిల్వలతో నెట్టుకొస్తున్న ఎక్సైజ్
- వారంలో సరుకు మొత్తం ఖాళీ!
- చేతులు ఎత్తేసిన డిస్టిలరీలు

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రమంగా మద్యం కొరత ఏర్పడుతోంది. డిస్టిలరీల (ఉత్పత్తిదారులు)కు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు పేరుకుపోవడంతో అవి క్రమంగా మద్యం సరఫరాను తగ్గించాయి. కొన్ని కంపెనీలు పూర్తిగా నిలిపివేశాయి. డిమాండ్ ఉన్న లిక్కర్ ఉత్పత్తి చేసే డిస్టిలరీలు కూడా సరఫరా విషయంలో చేతులెత్తేశాయి. బకాయిలు ఇవ్వకుంటే ఉత్పత్తి తమ వల్ల కాదని, పెట్టుబడి పెట్టలేమని ప్రభుత్వానికి తేల్చి చెప్పాయి. దీంతో షాపుల్లో మద్యం కొరత ఏర్పడింది. మద్యం పంపాలని రోజూ డిపోల అధికారులు కోరుతున్నా డిస్టిలరీలు పట్టించుకోవడం లేదు. డబ్బులిస్తేనే ఉత్పత్తి చేయగలమని, ఉత్పత్తి ఖర్చులు కూడా తమ వద్ద లేవని వారు తేల్చి చెబుతున్నారు. దీంతో ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టలేక, మద్యం కొరతను అధిగమించలేక ఎక్సైజ్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఎవరు ఏ మద్యం సరఫరా చేసినా తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తున్నారు. దీంతో మందుబాబులకు పెద్దగా ఆదరణ లేని, ఎప్పుడూ చూడని బ్రాండ్లే దిక్కవుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే మరో వారంలో షాపులన్నీ ఖాళీ అయ్యే ప్రమాదం ఉందనే వాదన వినిపిస్తోంది.

### రూ.1700 కోట్లు చెల్లించాలి

గత ప్రభుత్వంలోనే డిస్టిలరీలకు బకాయిలు పెద్దఎత్తున ఉన్నాయి. ఈ ప్రభుత్వం వచ్చాక వాటిని చెల్లించకపోగా ఇంకా పెంచారు. దీంతో ఇప్పుడవి రూ.1700 కోట్లకు చేరాయి. చివరగా సెప్టెంబరు 30న డిస్టిలరీలకు బిల్లులు చెల్లించారు. ఈ నెలలో ఒక్క రూపాయి కూడా వారికి విడుదల చేయలేదు. ఇప్పటికే పాత బకాయిలు ఉండటం, కొత్తవి కూడా ఆపడం వల్ల డిస్టిలరీలకు ఆర్థిక కష్టాలు పెరిగాయి. డిస్టిలరీలు మద్యం ఉత్పత్తి చేసి సరఫరా చేస్తాయి. అయితే మద్యం ఉత్పత్తికి అయ్యే ఖర్చుతో పాటు, డ్యూటీలు ముందుగా వారే కట్టాలి. మద్యం సరఫరాతో పాటు డ్యూటీలు కట్టి ఎక్సైజ్‌కు ఇస్తే, వాటిని అమ్మిన తర్వాత ఉత్పత్తి ధరను, డ్యూటీలను రీయింబర్స్ చేస్తారు. అంటే ఉత్పత్తితో పాటు డ్యూటీలు వారికి అదనపు భారం. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రభుత్వం నిధులు ఇవ్వకపోతే పూర్తిగా సరఫరా ఆపేయడం తప్ప వేరే మార్గం లేదని డిస్టిలరీలు చెబుతున్నాయి. అలాగే సరఫరా చేసిన మద్యానికి సంబంధించిన లెక్కలు ఇంతవరకూ తేల్చకపోవడం డిస్టిలరీల్లో ఆందోళనను పెంచుతోంది. ఈ నెలలో సుమారు 22 లక్షల కేసుల మద్యాన్ని డిస్టిలరీలు సరఫరా చేశాయి. గతంలో ఎప్పటికప్పుడు లెక్కలు తేల్చేవారు. కానీ ఈనెలలో ఇంతవరకూ చెప్పలేదు. కొత్త సాఫ్ట్‌వేర్ గందరగోళం వల్ల లెక్కలు తేలడం లేదు. దీంతో తమ మద్యం ఏమైందోనని డిస్టిలరీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. లెక్కలు తేడా వస్తే నష్టం ఏర్పడుతుందని భయపడుతున్నాయి.

### డిమాండ్ ఉన్న బ్రాండ్లు దూరం

రాష్ట్రంలో 15 డిస్టిలరీలు ఉంటే అందులో 6 ఈ నెలలో ఉత్పత్తిని పూర్తిగా నిలిపివేశాయి. ఇప్పుడు డిమాండ్ ఉన్న బ్రాండ్లను ఉత్పత్తిచేసేవారు సరఫరా ఆపేశారు. ఇది అమ్మకాలపై ఎక్కువ ప్రభావం చూపుతోంది. రాష్ట్రంలో వినియోగదారులు ఎక్కువగా తాగేవి కాకుండా, ఎప్పుడూ చూడనివి, పెద్దగా ఆదరణ లేనివి షాపుల్లో అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో వేరే దారిలేక కొందరు అవే కొంటుంటే, కొన్ని చోట్ల అమ్మకాలు బాగా తగ్గిపోతున్నాయి.

# హరియాణాలో హంగ్




## అధికారానికి ఆరు సీట్ల దూరంలో ఆగిన బీజేపీ

**పుంజుకొన్న కాంగ్రెస్..... జాట్ల ఓటుతో సీట్లు.. దుష్యంత్ పార్టీకి 10 సీట్లు- ఇతరులు మరో 10 మంది**

'అబ్ కీ బార్.. 75 కే పార్' అని ధీమాగా హరియాణా ఎన్నికల రణాంగంలోకి దూకిన బీజేపీ అంచనాలు అనూహ్యంగా తలకిందులయ్యాయి. ఇక్కడ త్రిశంకు సభ ఏర్పడింది. అతి ఎక్కువ స్థానాలు గెలిచిన పార్టీగా (40) అవతరించడం ఒక్కటే బీజేపీకి కాస్త ఊరట. సీట్లు భారీగా తగ్గినప్పటికీ అధికారం మాత్రం ఇప్పటికీ కమలనాథులకు అందే ద్రాక్షగానే ఉంది. ఓ ఆరుగురిని తమవైపుకు తిప్పుకొంటే మళ్లీ వారిదే ప్రభుత్వం..! ఇందుకోసం ప్రయత్నాలు మొదలయ్యాయి. ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాల్సిందిగా మనోహర్‌లాల్ ఖట్టార్ ఇప్పటికే రాష్ట్ర గవర్నర్ సత్యదేవ్ నారాయణ్ ఆర్యను కలిసి అభ్యర్థించారు.


హిస్సార్‌లో బీజేపీ కార్యకర్తల సంబురాలు

చండీగఢ్, అక్టోబరు 24: 90 సీట్లున్న రాష్ట్ర అసెంబ్లీలో 70 పైచిలుకు స్థానాలు ఖాయమని బీజేపీతో పాటు మెజారిటీ చానెళ్ల ఎగ్జిట్ పోల్ ఫలితాల్లో అంచనా వేశాయి. కానీ ఈవీఎంలను లెక్కించేసరికి బీజేపీ ఖాతా 40 దాటలేకపోయింది. అంటే ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మెజారిటీ (46)ని కూడా సాధించలేక చతికిలబడిపోయింది. అంతర్గత కుమ్ములాటలతో కకావికలైపోయిన కాంగ్రెస్ పది కూడా దాటడం కష్టమని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కానీ కాంగ్రెస్ అంచనాలను మించి పుంజుకొని 30 సీట్లు సాధించింది. కొత్త పార్టీ జననాయక్ జనతా పార్టీ (జేజేపీ) పది స్థానాలను కైవసం చేసుకొని ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా మారింది. గత ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచిన అవిభక్త ఐఎన్ఎల్‌డీ పార్టీ- చీలికలతో కుదేలై చివరకు ఒక్క స్థానానికి పరిమితమైంది. సమాజ్‌వాదీ పార్టీ రెండు స్థానాలను గెల్చుకోగా ఏడుగురు స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. ఓ రకంగా 2018లో కర్ణాటక అసెంబ్లీ తరహా పరిస్థితి ఇపుడు హరియాణాలో ఏర్పడింది.

### భూపిందర్ పట్టు..!

దాదాపుగా నిస్తేజంగా ఉన్న స్థితి నుంచి కాంగ్రెస్‌ను అధికార రేసులోకి తీసుకొచ్చిన ఘనత మాజీ సీఎం, జాట్ యోధుడు భూపీందర్‌సింగ్ హుడాదే! ఆయన ఇప్పటికే ప్రభుత్వ ఏర్పాటు దిశగా ప్రయత్నాలు ఆరంభించారు. కాంగ్రెస్ వ్యూహం ఒకటే.. ఆరునూరైనా బీజేపీ తిరిగి అధికారంలోకి రాకుండా అడ్డుకోవడం! దుష్యంత్ కోరికను మన్నించేందుకు హుడా సిద్ధంగా లేరని తెలుస్తోంది. చౌటాలాకు ఉప ముఖ్యమంత్రి పదవిని ఆఫర్ చేసేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉంది.

### బీజేపీకే అడ్వాంటేజి..?

మేజిక్ మార్క్‌ను చేరుకోలేకపోయినప్పటికీ పరిస్థితి ప్రస్తుతం బీజేపీకే ఎక్కువ అనుకూలంగా ఉంది. కారణం... బీజేపీకి తగ్గిన సీట్లు 6. కానీ విజయం సాధించిన ఏడుగురు స్వతంత్రుల్లో ఐదుగురు బీజేపీ రెబెల్సే. టికెట్ ఇవ్వలేదన్న కారణంతో ఇండిపెండెంట్‌లుగా బరిలో దిగారు. వీరందరినీ తమవైపు తిప్పుకోవడం బీజేపీకి కష్టమేమీ కాదు. ఖట్టార్ ఇప్పటికే వారితో టచ్‌లో ఉన్నారు. మిగిలిన ఇద్దరు స్వతంత్రులలో ఒకరు కాంగ్రెస్ రెబెల్ కాగా, మరొకరు ఐఎన్ఎల్‌డీ రెబెల్. వీరిద్దరిలో ఒకరిని లాగేస్తే బీజేపీ మళ్లీ అధికార పీఠాన్ని చేజిక్కించుకుంటుంది. తాజా సమాచారం ప్రకారం కొందరు స్వతంత్ర ఎమ్మెల్యేలు ఇప్పటికే డిల్లీ చేరుకుని బీజేపీ గూట్లో చేరసారాలు సాగిస్తున్నారు.

### 8 మంది మంత్రుల పరాజయం

ఖట్టార్ ప్రభుత్వంలోని 8 మంది మంత్రులు ఈ ఎన్నికల్లో ఓడిపోయారు. క్రీడాప్రముఖుల్లో రెజ్లర్లు యోగేశ్వర్ దత్ ఓడిపోయారు. తొలిసారిగా బరిలో దిగిన 29 ఏళ్ల బబితా కుమారి కూడా భారీ తేడాతో పరాయజయం పాలయ్యారు. హాకీ మాజీ కెప్టెన్ సందీప్ సింగ్ ఒక్కరే గెలుపొందారు. టిక్ టాక్ స్టార్ సొనాలీ ఫొగాట్ కూడా ఓటమి చెందారు. కాంగ్రెస్ జాతీయ ప్రతినిధి, రాహుల్ గాంధీ సన్నిహితుడు రణదీప్ సింగ్ సూర్జేవాలా వరుసగా రెండోసారి కూడా కైథాల్ నుంచి ఓడిపోయారు. దుష్యంత్ చౌటాలా తల్లి నైనీ చౌటాలా విజయం సాధించారు. కర్నాల్‌లో ముఖ్యమంత్రి ఖట్టార్, భూపీందర్‌సింగ్ హుడా, దుష్యంత్, కుల్‌దీప్ బిష్ణోయ్‌లాంటి ప్రముఖులు భారీ మెజారిటీతో గెలుపొందారు.

## బీజేపీని ఓడించిన జాట్లు

బీజేపీ అంచనాలు దెబ్బతినడానికి ప్రధాన కారణం జాట్‌లు. చౌటాలా కుటుంబంలో చీలిక వచ్చినప్పటికీ ఆ వర్గం ఆ కుటుంబ తాజా ఆశాకిరణం దుష్యంత్ చౌటాలా వెన్నంటి నిలిచారు. నిజానికి వారు 2014లో బీజేపీకే మద్దతిచ్చారు. కానీ జాట్లు కోరుకున్న రిజర్వేషన్లు, ఇతర డిమాండ్లను తీర్చడంలో మనోహర్‌లాల్ ఖట్టార్ ప్రభుత్వం విఫలమైంది. దీనికి ఇప్పుడు జాట్లు ప్రతీకారం తీర్చుకున్నారు. త్రిముఖ పోటీ ఏర్పరచడంలో, బీజేపీని ఖంగు తినిపించడంలో దుష్యంత్ సఫలమయ్యారు. రాష్ట్ర ఓటర్లలో 25 శాతం జాట్లే. నిజానికి చౌటాలా కుటుంబంలో చీలికను ప్రోత్సహించి దుష్యంత్ ద్వారా కాంగ్రెస్, ఐఎన్ఎల్‌డీ రెండింటినీ ఈ ఎన్నికల్లో దెబ్బతీయాలన్నది బీజేపీ వ్యూహం. అది కూడా బెడిసి కొట్టి బీజేపీ తానే బలైపోయింది. కాంగ్రెస్ గణనీయంగా లాభపడింది. కాంగ్రెస్, జేజేపీల్లో బలమైన అభ్యర్థులున్న చోట్ల జాట్లు వారినే గెలిపించారు. నాన్ జాట్ ఓటును సంఘటితం చేయడానికి బీజేపీ పన్నిన ఎత్తుగడలూ ఫలించలేదు.

## తగ్గిన బీజేపీ ఓట్లు

2014 ఎన్నికల్లో బీజేపీ 46 స్థానాల్లో గెలుపొంది బొటాబొటి మెజారిటీతోనైనా అధికారాన్ని కైవసం చేసుకోగలిగింది. ఆనాడు బీజేపీకి లభించిన ఓటు షేరు 33.2 శాతం. కానీ 2019 లోక్‌సభ ఎన్నికల వేళకు అది 58 శాతానికి పెరిగింది. తాజా ఎన్నికల్లో బీజేపీ ఓటు షేరు 22 శాతం తగ్గిపోయింది. ప్రస్తుతం ఈసీ ఇచ్చిన డేటా ప్రకారం బీజేపీ ఓటు షేరు 36.3 శాతం మాత్రమే! కాంగ్రెస్‌కు 2014లో 20 శాతం ఓటే లభించినా లోక్‌సభ ఎన్నికల్లో, ఇపుడు 28.2 శాతం ఓట్లు సాధించింది.

## ▶ దుష్యంత్..
## జాట్ యువకిశోరం..



బీజేపీ, కాంగ్రెస్ మధ్య హోరాహోరీగా సాగిన హరియాణా ఎన్నికల్లో అనూహ్యంగా సత్తా చాటిన యువ నాయకుడు.. దుష్యంత్‌చౌటాలా. మాజీ ఉప ప్రధాని దేవీలాల్ మునిమనవడు.. హరియాణా మాజీ సీఎం ఓంప్రకాశ్ చౌటాలా మనవడు.. ఇదీ దుష్యంత్ నేపథ్యం. 1988 ఏప్రిల్ 3న అజయ్ చౌటాలా, నైనా సింగ్ దంపతులకు దుష్యంత్ జన్మించారు. కాలిఫోర్నియా వర్సిటీ నుంచి బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో పట్టా పొందిన దుష్యంత్.. నేషనల్ లా యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ చేశారు. వారసత్వంగా రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో హిసార్ నుంచి ఐఎన్ఎల్‌డీ అభ్యర్థిగా పోటీ చేసి.. హరియాణా మాజీ సీఎం భజన్‌లాల్ కుమారుడు కుల్దీప్ బిష్ణోయిని ఓడించారు. లోక్‌సభలో అడుగుపెట్టిన అత్యంత పిన్నవయస్కుడైన ఎంపీగా రికార్డు సృష్టించారు. అప్పటికి ఆయన వయసు 26ఏళ్లు. ఐఎన్ఎల్‌డీలో చీలిక రావడంతో ఆయన బాబాయి అయిన అభయ్ చౌటాలా.. దుష్యంత్‌ను పార్టీ నుంచి బహిష్కరించారు. దీంతో ఆయన సొంతంగా 'జననాయక్ జనతా' పార్టీని (జేజేపీ) స్థాపించి ఈ ఎన్నికల్లో సత్తా చాటారు. హరియాణా యువత.. ముఖ్యంగా జాట్ యువతకు సరికొత్త ఆశాకిరణంగా దుష్యంత్ నిలిచారు. దేవీలాల్ వారసత్వానికి అర్హులెవరనే చర్చకు చుక్క పెట్టారు.

## ఆఖరు క్షణంలో పగ్గాలిచ్చినా..

**▸▸ హరియాణాలో కాంగ్రెస్‌కు భూపీందర్ ఊపిరి**



రాజకీయంగా తీసుకునే కొన్ని కొన్ని నిర్ణయాలు.. కొడిగడుతున్న పార్టీల దీపాలను మలిగిపోకుండా ఆపుతాయి! హరియాణాలో కాంగ్రెస్ పార్టీ ప్రచార పగ్గాలను.. ఆ పార్టీ సీనియర్ నేత, 2005 నుంచి 2014 దాకా ముఖ్యమంత్రిగా ఉన్న భూపిందర్‌సింగ్ హుడాకు అప్పగించాలన్న సోనియాగాంధీ నిర్ణయం ఆ పార్టీకి కొత్త ఊపిర్లు ఊదింది. అక్టోబరులో ఎన్నికలు కాగా.. సోనియా భూపీందర్‌కు సెప్టెంబరులో.. అంటే చివరిక్షణాల్లో పగ్గాలు అప్పజెప్పారు. కానీ, ఈ ఐదేళ్లలో ఆయన రాజకీయంగా ఖాళీగా కూర్చోకుండా ప్రజలతో మమేకం కావడం పార్టీకి బాగా కలిసొచ్చింది. అంతేకాదు.. బీజేపీ వేసిన 'జాటేతర ఓట్ల ఏకీకృతం' ఎత్తుగడ ఎదురుతన్నింది. భూపీందర్ జాట్ నేత కావడంతో.. జాట్ల ఓట్లలో చాలావరకూ కాంగ్రెస్‌కు పడ్డాయి. ఖట్టర్‌తో పోలిస్తే సమర్థ ముఖ్యమంత్రిగా భూపీందర్‌కున్న పేరు కాంగ్రెస్‌కు కలిసొచ్చింది.

## దుష్యంత్‌తోనూ మంతనాలు..!



అటు దుష్యంత్ చౌటాలాను కూడా బీజేపీ నాయకత్వం సంప్రదించినట్లు తెలుస్తోంది. కుమారస్వామి తరహాలో ఆయన సీఎం పదవిని ఆశించడంతో బీజేపీ ఆయనతో బేరసారాలను అంత చురుగ్గా సాగించడం లేదని కూడా వినిపిస్తోంది. 40 సీట్లు సాధించిన మనది పైచేయి కావాలనేది కమలనాథుల వాదన. ఇది తెలిసి దుష్యంత్ ఓ వ్యాఖ్య చేశారు. "హరియాణా ప్రజలు మార్పును కోరుతున్నారు. ఆ మార్పును నేను అందిస్తాను.." అని అన్నారు. దీని అర్థం బీజేపీ నుంచి దూరం జరగడమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ శిబిరానికి ఆయన వెళతారా, సీఎం పదవి ఇవ్వడానికి కాంగ్రెస్ సుముఖంగా ఉందా...అనేవి స్పష్టం కావాల్సి ఉంది.


కర్నాల్‌లో కాంగ్రెస్ అభిమానుల వేడుకలు



## 'నాయకుడు' కాని నాయకుడు!

**▸▸ హరియాణాలో బీజేపీ దుస్థితికి కారణం ఖట్టరే**

నాయకుడంటే.. నడిపించేవాడు. జనంలోంచి వచ్చేవాడు. కానీ.. హరియాణా ముఖ్యమంత్రి అధికారులు దిద్దిన నాయకుడు. అందుకే.. గిట్టనివారు ఆయన్ను 'బ్యూరోక్రాట్ పొలిటీషియన్' అంటుంటారు! ఈ ఎన్నికల్లో హరియాణాలో బీజేపీ దుస్థితికి ఖట్టర్ అసమర్థతే కారణమని నిపుణుల విశ్లేషణ. 2014లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి, పార్టీ అధిష్ఠానం ఆశీస్సులతో సీఎం అయిపోయిన ఖట్టర్ పాలనలో అధికారులపైనే ఎక్కువగా ఆధారపడ్డారు. ఐదేళ్ల పాలనలో తొలి సగమంతా.. గోరక్ష, సరస్వతీ నది పునరుద్ధరణ, గీతామహోత్సవ్ వంటివాటితోనే గడిచిపోవడంతో ప్రజల్లో అసంతృప్తిని కలిగించింది. 2016లో రిజర్వేషన్ల కోసం జాట్లు చేసిన ఆందోళనను డీల్ చేయలేకపోయారు. ఆ ఆందోళనల్లో దాదాపు పాతికమంది దాకా ప్రాణాలు కోల్పోయారు. కోట్లాది రూపాయల ఆస్తినష్టం సంభవించింది. డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ అరెస్టు అయినప్పుడు ఆయన అనుచరులు, భక్తులు వీధుల్లో వీరంగం సృష్టిస్తే దాన్నీ అడ్డుకోలేకపోయారు. దీంతో ఖట్టర్ అసమర్థత చర్చనీయాంశమైంది. వీటన్నిటికీ తోడు.. జాటేతర ఓట్లను ఏకీకృతం చేయాలన్న ఖట్టర్ వ్యూహం బీజేపీకి ఎదురుదెబ్బ కొట్టింది. జాట్ ఓట్లన్నీ దుష్యంత్ చౌటాలా నేతృత్వంలోని జననాయక్ జనతా పార్టీకి, భూపీందర్ సింగ్ హుడా నేతృత్వంలో ప్రచారం సాగించిన కాంగ్రెస్‌కు పడడంతో బీజేపీ అధికారానికి అల్లంత దూరంలో నిలిచింది.

# ఫలితాలు నేర్పిన పాఠాలు

మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు ఐదారు నెలల ముందు నుంచే వ్యూహప్రతివ్యూహాల రచన! ప్రచార సమయంలో విమర్శలు.. ప్రతివిమర్శల జోరు!! ఆ హడావుడి అంతా ముగిసింది. ఫలితాలు వెల్లడయ్యాయి. ఈ ఫలితాలు ఎవరికి ఎలాంటి పాఠాలు నేర్పాయి? ఏ సందేశాన్నిచ్చాయి.. అనే ప్రశ్నలకు రాజకీయ నిపుణులు ఇలా విశ్లేషిస్తున్నారు.

### నరేంద్ర మోదీ



ప్రధాని మోదీ మహారాష్ట్ర, హరియాణాల్లో కలిపి 16 సభల్లో పాల్గొన్నారు. 'జాతీయవాదం' సెంటిమెంటును రగల్చడం ద్వారా ఓట్లు కొల్లగొట్టే వ్యూహంతో ఆయన ప్రసంగాలు సాగాయి. అయినా కూడా హరియాణాలో వచ్చిన ఫలితాలు ఆందోళన కలిగించేవే. జాతీయవాద భావోద్వేగాలను రగల్చడం ద్వారా ఓట్లు పొందే వ్యూహం అన్ని చోట్లా పనిచేయదని.. స్థానిక పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని, స్థానిక సమస్యలను పరిష్కరించకపోతే ఓట్లు రాలవని హరియాణా ఫలితాలు స్పష్టం చేశాయి.

### అమిత్ షా



రెండు రాష్ట్రాల్లో గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అమిత్ షా.. పార్టీ గెలుపు కోసం అహర్నిశలూ కృషి చేశారు. ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా పాల్గొన్నారు. కానీ, రెండు చోట్లా వచ్చిన ఫలితాలు ఆయనకు నిరాశ కలిగించేవే. అంతగా ప్రాబల్యం లేని కులాలను ఏకం చేయడం ద్వారా గెలవాలన్న ఆయన 'లెక్క' తప్పింది. ముఖ్యంగా.. హరియాణాలో షా వ్యూహం కారణంగా జాట్లు ఏకమయ్యారు. ఏదైనా వ్యూహం పన్నేటప్పుడు దాని పర్యవసానాలపై ఒకటికి పదిసార్లు ఆలోచించాలనే పాఠాన్ని ఈ ఫలితాలు అమిత్ షాకు నేర్పాయి.

### సోనియాగాంధీ



కాంగ్రెస్ సారథిగా సోనియా గాంధీ తాత్కాలికంగా బాధ్యతలు చేపట్టాక వచ్చిన తొలి ఎన్నికలివి. ఆమె నిర్ణయాత్మకంగా ఆలోచించి హరియాణాలో భూపీందర్ సింగ్ హుడాకు పూర్తిగా బాధ్యతలు అప్పజెప్పడం గణనీయమైన ఫలితాలనే ఇచ్చిందిగానీ.. పూర్తిస్థాయి విజయాన్ని కాదు. మహారాష్ట్రలో ఎన్సీపీ కన్నా కాంగ్రెస్‌కు తక్కువ సీట్లు రావడం.. హరియాణాలో స్థానిక నాయకుల వల్లనే ఎక్కువ ఓట్లు రావడం.. పార్టీలో గాంధీ-నెహ్రూ ప్రాబల్యంపై సందేహాలు రేకెత్తిస్తున్నాయి.

### రాహుల్ గాంధీ



పార్టీ అధ్యక్ష పదవిపైనే కాదు.. ఎన్నికల ప్రచారంలోనూ నిరాసక్తత చూపిన రాహుల్‌గాంధీ పరిమితులను స్పష్టంగా చూపిన ఎన్నికలివి. అధ్యక్ష పదవిని వదులుకున్న రాహుల్ ఎన్నికల రంగంలో క్రియాశీలంగా పాల్గొంటారని భావిస్తే.. అదీ జరగలేదు. ఆయన కేవలం ఏడు సభల్లో పాల్గొన్నారు. వాటిలో కూడా రఫెల్ వంటి అంశాలను ప్రస్తావించడం ఫలితాన్నివ్వలేదు. రెండు రాష్ట్రాల్లో సాధించిన ఫలితాలు.. పార్టీలో రాహుల్ పాత్రను మరింత సందేహంలో పడేశాయి.

### శరద్ పవార్



మరాఠా యోదుడు శరద్‌పవార్.. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సర్వశక్తులూ ఒడ్డి చావో రేవో అన్నట్టు పోరాడారు. వయసు, ఆరోగ్యం సహకరించకున్నా.. పట్టుదలతో అంతా తానే అయి ప్రచారం సాగించారు. ఎన్నో ప్రతికూల పరిణామాలను ఎదుర్కొని మంచి ఫలితాలు సాధించగలిగారు. కాంగ్రెస్ కన్నా ఎక్కువ సీట్లు సాధించి ప్రధాన ప్రతిపక్షంగా పార్టీని నిలిపారు. పట్టుదల ఉంటే ఎన్ని కష్టాలనైనా ఎదిరించి నిలవొచ్చని నిరూపించారు.

## లెక్క ఎక్కడ తప్పింది?

**హరియాణాలో 70సీట్లతో బీజేపీకే పట్టం అన్న ఎగ్జిట్‌పోల్స్**

**అంచనా తారుమారు.. పైగా తగ్గిన 7సీట్లు**

న్యూఢిల్లీ, అక్టోబరు 24: హరియాణా ఎన్నికల్లో బీజేపీ వేసుకున్న లెక్కలు కుదరలేదు. ఎగ్జిట్‌పోల్స్ అంచనాలూ తారుమారయ్యాయి. 90సీట్లున్న హరియాణాలో 2014 అసెంబ్లీ ఎన్నికల్లో మ్యాజిక్ ఫిగర్ 46సీట్లకు బీజేపీ 47సీట్లు గెలుచుకొని అధికారంలోకి వచ్చింది. ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో ఆ రాష్ట్రంలోని పదికి పది స్థానాలు బీజేపీ వశమయ్యాయి. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి భారీగా సీట్లు వస్తాయని అంచనా వేశారు. ఎగ్జిట్‌పోల్స్‌లో ఇండియాటుడే, యాక్సిస్ వన్ మినహా మిగిలినవి 70 స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ప్రకటించాయి. ఈ అంచనాలకు భిన్నంగా బీజేపీ 40సీట్లకే పరిమితమైంది. గత ఎన్నికలకన్నా 7సీట్లు తక్కువగా రావడంతో కమలనాథులు షాక్ తిన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 10స్థానాలను పార్టీ గెలుచుకోవడంతో అసెంబ్లీ తీర్పు తమవైపే ఉంటుందని లెక్కలు కట్టుకొని దిలాసాగా ఉండటమే ఆ పార్టీని దెబ్బతీసిందని పరిశీలకులు చెబుతున్నారు.

# ఉప ఎన్నికల్లో కమలానిదే ఆధిక్యం

**▸▸ 51 స్థానాల్లో 30 స్థానాలు బీజేపీవే**

న్యూఢిల్లీ, అక్టోబరు 24: దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోని 51 స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ ఆధిపత్యం కనబరించింది. 30 స్థానాలవరకు తన ఖాతాలో వేసుకుంది. యూపీలో అత్యధికంగా 11 స్థానాలకు ఉప ఎన్నికలు జరగగా వాటిలో ఏడుస్థానాలను అధికార బీజేపీ దక్కించుకుంది. మరోస్థానంలో దాని మిత్ర పక్షం అప్నాదళ్ విజయంసాధించింది. మూడుస్థానాల్లో సమాజ్‌వాదీపార్టీ గెలుపొందింది. ఇక బిహార్‌లో అధికార జేడీయూకి ఎదురుదెబ్బ తగిలింది. ఇక్కడ ఐదు స్థానాల్లో ఉప ఎన్నికలు జరగగా జేడీయూ ఒకే స్థానంలో గెలుపొందింది. గుజరాత్‌లో ఆరు స్థానాలకు ఉప ఎన్నిక జరగగా ఎవరి సిటింగ్ స్థానాలను వారు గెలుచుకున్నారు. ఇక్కడ బీజేపీ, కాంగ్రెస్ చెరో 3 స్థానాల్లో విజయం సాధించాయి. కేరళలో అధికార ఎల్డీఎఫ్ రెండు స్థానాల్లోను, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ మూడుస్థానాల్లోనూ విజయం సాధించాయి. పంజాబ్‌లో అధికార కాంగ్రెస్ పార్టీ పట్టునిలుపుకొంది. నాలుగు స్థానాలకు ఉప ఎన్నికలు జరగగా మూడింటిలో ఆ పార్టీ జెండా ఎగరేసింది. ఒడిసాలో ఒకస్థానంలో ఉప ఎన్నిక జరగగా అధికార బీజేడీ అభ్యర్థి 97 వేల ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. సిక్కింలోని పోక్‌లాక్ కమరాంగ్ సీఎం ప్రేమ్ సింగ్ తమాంగ్ (ఎస్‌కేఎం) విజయం సాధించారు.

### అల్పేశ్ ఠాకూర్‌కు ఎదురుదెబ్బ

గుజరాత్‌లో కాంగ్రెస్‌నుంచి బీజేపీలోకి మారిన అల్పేశ్‌ఠాకూర్‌కు ఉప ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగిలింది. రధన్‌పూర్ నియోజకవర్గంనుంచి బరిలోకి దిగిన ఆయన కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో 3807 ఓట్లతేడాతో ఓటమిపాలయ్యారు.

# హుజూర్‌నగర్‌పై గులాబీ జెండా!

- **ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ ఘన విజయం**
- **పట్టు వదలని సైదిరెడ్డికి 43,358 మెజార్టీ**
- **కంచుకోటలో కాంగ్రెస్‌కు ఘోర పరాభవం**
- **రెండోస్థానంలో పీసీసీ చీఫ్ ఉత్తమ్ సతీమణి**
- **డిపాజిట్లు దక్కని టీడీపీ, బీజేపీ అభ్యర్థులు**
- **ఈవీఎంల ట్యాంపరింగ్ అంటున్న విపక్షం**
- **వీవీప్యాట్ స్లిప్పులు లెక్కించాలని డిమాండ్**

హుజూర్‌నగర్, అక్టోబరు 24: హుజూర్‌నగర్ ఉపఎన్నిక వార్ వన్‌సైడ్‌గా మారింది. గులాబీ జెండా ఆధిపత్యానికి ఎక్కడా ఎదురులేకుండా పోయింది. పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కంచుకోట, వరుసగా మూడు ఎన్నికల్లో ఆయన్ను గెలిపించిన హుజూర్‌నగర్ నియోజకవర్గం ఎట్టకేలకు టీఆర్ఎస్ వశమైంది. టీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి సమీప కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి ఉత్తమ్‌పై 43,358 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. సైదిరెడ్డికి 56.34 శాతం ఓట్లు రాగా, పద్మావతికి 34.74 శాతం ఓట్లు వచ్చాయి. ఓట్ల లెక్కింపు సందర్భంగా ప్రతి రౌండ్‌లోనూ టీఆర్ఎస్‌దే ఆధిక్యం కనపడింది. హుజూర్‌నగర్‌లో టీఆర్ఎస్ విజయాన్ని సర్వేలు ముందే ఊహించినా ఇంత భారీ విజయాన్ని గులాబీ సేనలు కూడా ఊహించలేక పోయాయి. గురువారం సూర్యాపేటలో హుజూర్‌నగర్ ఓట్ల లెక్కింపు జరిగింది. టీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డికి 1,13,094 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి రెడ్డికి 69,736 ఓట్లు లభించాయి. బీజేపీ, టీడీపీ అభ్యర్థులు సహా ఇతర అభ్యర్థులంతా డిపాజిట్లు కోల్పోయారు. బీజేపీ అభ్యర్థి కోటా రామారావుకు 2,638, టీడీపీ అభ్యర్థి చావా కిరణ్మయి 1,827 ఓట్లు మాత్రమే వచ్చాయి. స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసిన సపావత్ సుమన్‌కు(2697) వీరిద్దరి కన్నా ఎక్కువ ఓట్లు వచ్చాయి. ప్రధాన అభ్యర్థులు ఇద్దరు కాకుండా ఈ ముగ్గురికే ఒక శాతానికి అటూ ఇటుగా ఓట్లు లభించాయి.

**మొత్తం ఓట్లు:** 2,36,842
**పోలయిన ఓట్లు:** 2,00,751
**సైదిరెడ్డి:** 1,13,094(56.34 %)
**పద్మావతి:** 69736(34.74 %)
**మెజారిటీ:** 43,358

### ఆర్నెల్లకే ఎంత తేడా!

కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న హుజూర్‌నగర్ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరడం ఇదే మొదటిసారి. 2009 ఎన్నికల నాటి నుంచి 2018 ముందస్తు ఎన్నికల వరకు మూడు సార్లు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్ హ్యాట్రిక్ సాధించారు. 2018 డిసెంబరులో శాసనసభ ఎన్నికల్లో పీసీసీ అధ్యక్షుడి హోదాలో కాంగ్రెస్ పార్టీని ముందుండి నడిపించిన ఉత్తమ్ అతికష్టం మీద ఏడు వేల ఓట్ల మెజారిటీతో టీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డిపై విజయం సాధించారు.

2019లో ఉత్తమ్ నల్లగొండ ఎంపీగా పోటీ చేసి విజయం సాధించడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఆర్నెల్ల క్రితం లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తమ్‌కు హుజూర్‌నగర్ నుంచి 13 వేల ఓట్ల ఆధిక్యత లభించింది. తాజా ఎన్నికల్లో 13 వేల మెజారిటీ పోయి మరో 43 వేల ఓట్లు కాంగ్రెస్ వెనుకబడింది. అంటే, ఉత్తమ్ కన్నా పద్మావతికి దాదాపుగా 50 వేలకు పైగా ఓట్లు తగ్గాయి. ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందని, ఉపఎన్నికకు సంబంధించి వీవీ ప్యాట్లు లెక్కించాలని కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతిరెడ్డి, ఇతర స్వతంత్ర అభ్యర్థులు డీఆర్వో చంద్రయ్యకు వినతి పత్రం ఇచ్చారు.

## వరుసగా రెండోసారి గెలవడం.. అంత సులభం కాదు: మోదీ



"వరుసగా రెండు సార్లు గెలవడం అంత సులభం కాదు. ఐదేళ్ల ప్రభుత్వాన్ని నడిపాక.. ప్రజలు మళ్లీ పట్టం కట్టడం చాలా కష్టం. అలాంటిది మా సీఎంలు దాన్ని సాధించారు. మహారాష్ట్ర, హరియాణా ఫలితాలే అందుకు నిదర్శనం" అని ప్రధాని మోదీ అన్నారు. "మహారాష్ట్ర సీఎం ఫడణవీస్, హరియాణా సీఎం ఖట్టర్‌కు 2014కు ముందు సీఎం పనిచేసిన అనుభవం లేదు. అయినా.. వారు ప్రజారంజకంగా పాలించారు. ప్రజాభిమానాన్ని పొందగలిగారు" అని ఆయన కొనియాడారు. "ఏ రాజకీయ సుస్థిరతతో ఆర్థిక పురోభివృద్ధి సాధ్యమవుతుంది. రెండు రాష్ట్రాల్లో పార్టీ గెలుపు.. దీపావళికి ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదం" అని వ్యాఖ్యానించారు.

### పంచుకోవాల్సిన సమయం



బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా మా ఇంటికి వచ్చినప్పుడు అధికార పీఠాన్ని చెరిసగం పంచుకోవాలని నిర్ణయించాం. ఇప్పుడు 50-50 సూత్రం గురించి బీజేపీకి గుర్తుచేయాల్సిన సమయం ఆసన్నమైంది!

- ఉద్ధవ్ ఠాక్రే, శివసేన అధిపతి

### ఆ అవసరం రాదు!



శివసేన మా మిత్రపక్షం. అయితే... అధికారాన్ని చెరిసగం పంచుకోవాల్సిన అవసరం ఉండదు. ఎన్నికల్లో గెలిచిన 15 మంది బీజేపీ రెబల్స్ మాతో టచ్‌లో ఉన్నారు. ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఒక ప్రభుత్వం, సీఎం మళ్లీ అధికారంలోకి రావడం మహారాష్ట్ర చరిత్రలోనే ఇది తొలిసారి.

- దేవేంద్ర ఫడణవీస్, ముఖ్యమంత్రి, బీజేపీ నేత

### మేం విపక్షంలోనే!

ప్రజల తీర్పును గౌరవిస్తున్నాం. మేం విపక్షంలోనే ఉంటాం. బీజేపీ-శివసేన కూటమి అధికారంలోకి వచ్చినప్పటికీ... తమ 220 సీట్ల లక్ష్యానికి చాలా దూరంలో నిలిచింది. పార్టీ ఫిరాయింపులను ప్రజలు తిరస్కరించారు. చివరి నిమిషంలో పార్టీలు మారిన వారిని ఓడించారు. అధికార అహాన్ని ప్రజలు ఆమోదించలేదు. బీజేపీ బలం తగ్గించారు.

- శరద్ పవార్, ఎన్సీపీ చీఫ్

# కాషాయమే, కానీ!

## మహారాష్ట్రలో బీజేపీ, శివసేన కూటమి గెలుపు

- గతంతో పోల్చితే భారీగా తగ్గిన సీట్లు
- ఎన్సీపీ, కాంగ్రెస్‌కు పెరిగిన బలం
- మూడో స్థానంలో నిలిచిన కాంగ్రెస్

ముంబై, అక్టోబరు 24: ఛత్రపతి శివాజీ మహారాజ్ ఏలిన మరాఠా గడ్డపై మళ్లీ 'కాషాయ' ధ్వజం ఎగిరింది. కానీ... దాని రెపరెపలు కాస్త తగ్గాయి. అధికారం మరోసారి కమలానికే దక్కనుంది. కానీ... మిత్రపక్షం శివసేన షరతుల తంతు కలవర పెడుతోంది. బీజేపీకి ఇటీవలి కాలంలో తొలిసారి మహారాష్ట్ర రూపంలో కఠినమైన ఎన్నికల పరీక్ష ఎదురైంది. అభిప్రాయ భేదాలను 'పక్కనపెట్టి' శివసేనతో కలిసి పోటీ చేసిన నేపథ్యంలో... సులువుగా అధికారంలోకి వస్తామని బీజేపీ భావించింది. కానీ... మునుపటి బలం కోల్పోయి, శివసేనపై పూర్తిగా ఆధారపడి, తప్పనిసరైతే ఆ పార్టీతో ముఖ్యమంత్రి పీఠాన్ని పంచుకునేందుకు అంగీకరించాల్సిన పరిస్థితి ఎదురైంది. 2014 ఎన్నికల్లో బీజేపీ, శివసేన విడివిడిగా పోటీచేశాయి. అయినప్పటికీ అప్పట్లో బీజేపీ 122 స్థానాల్లో నెగ్గింది. ఈసారి 105 స్థానాలకే పరిమితమైంది. మరోవైపు... గతంతో పోల్చితే ఎన్సీపీ, కాంగ్రెస్‌ల కూటమి బాగా బలం పుంజుకున్నప్పటికీ... అధికారానికి ఆమడ దూరంలో నిలిచింది. బీజేపీని రెబల్స్ దెబ్బకొట్టగా... ఎన్సీపీ-కాంగ్రెస్ కూటమికి ఎంఐఎం పోటీ ఇరకాటంలోకి నెట్టింది. గత నెల 21న జరిగిన 'మరాఠా పోరు' ఫలితాలు గురువారం వెలువడ్డాయి. 288 స్థానాలున్న మహారాష్ట్ర అసెంబ్లీలో బీజేపీ, శివసేన కలిసి మేజిక్ మార్కును దాటాయి. అయితే... రెండొందలకుపైగా సీట్లు సాధించాలన్న లక్ష్యానికి కూటమి ఆమడ దూరంలో నిలిచింది. దీంతో... శివసేన అనూహ్యంగా తమకూ సగం కాలం అధికారం పంచాలనే షరతును బయటికి తీసుకొచ్చింది. మహారాష్ట్ర ప్రస్తుత ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, శివసేన అధిపతి ఉద్ధవ్ ఠాక్రే కుమారుడైన ఆదిత్య ఠాక్రే తదితర ప్రముఖులు విజయం సాధించారు. ఇక... సరిగ్గా ఎన్నికల ముందు పార్టీల మారిన వారిని ప్రజలు ఆదరించలేదు. శివసేనలో చేరి బరిలో నిలిచిన 11 మంది, బీజేపీ తీర్థం పుచ్చుకుని పోటీపడిన 8 మంది ఓటమి పాలయ్యారు. వీరిలో కొందరు మంత్రులు కూడా ఉండటం గమనార్హం. మహారాష్ట్రలో గతంతో పోల్చితే కాంగ్రెస్ బలం పుంజుకున్నప్పటికీ... ఫలితాల సరళిలో మూడో స్థానంలో నిలిచింది. కాంగ్రెస్‌కంటే మిత్రపక్షమైన ఎన్సీపీయే అధిక స్థానాలు దక్కించుకుంది. రెండు పార్టీలకు 2014 ఎన్నికలకంటే అధిక స్థానాలు లభించడమొక్కటే ఊరట కలిగించే అంశం.



మహారాష్ట్రలోని సాంగ్లిలో బీజేపీ కార్యకర్తల విజయోత్సవం




## పీఠం పంచుకోవాలి!

- బీజేపీకి ఉద్ధవ్ 'షరతుల' సందేశం
- ఆ అవసరం లేదన్న ఫడణవీస్

**కుదిరితే కుమారుడు ఆదిత్య ఠాక్రేను ముఖ్యమంత్రిగా చూడాలనుకుంటున్న శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే ఆ దిశగా పావులు కదుపుతున్నారు. కూటమిగా కలిసి విజయం సాధించినప్పటికీ... బీజేపీ బలం బాగా తగ్గడంతో ఉద్ధవ్ తన స్వరం పెంచారు. సంకీర్ణంలో 'జూనియర్ భాగస్వామి' పాత్రకే పరిమితం కాకుండా... అధికారంలోనూ 'భాగం' కోరుకున్నారు.**

ఐదేళ్ల పదవీకాలాన్ని చెరిసగం పంచుకోవాలని శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే స్పష్టం చేశారు. గురువారం ఫలితాల సరళి తెలిసిన వెంటనే ఆయన ముంబైలో మీడియాతో మాట్లాడారు. 'ముఖ్యమంత్రి ఎవరు?' అని ప్రశ్నించగా... "అధికారాన్ని చెరిసగం పంచుకోవాలని అమిత్ షా మా ఇంటికి చర్చలకు వచ్చినప్పుడే ఒప్పందం కుదిరింది. దీనిని గుర్తుచేయాల్సిన సమయం వచ్చింది. పొత్తులో శివసేనకు తక్కువ సీట్లే ఇచ్చినా నేను సరే అన్నాను. కానీ... ప్రతిసారీ బీజేపీకోసం త్యాగం చేయలేం. నా పార్టీ కూడా అభివృద్ధి చెందాలి" అని ఉద్ధవ్ పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ వద్ద సంసిద్ధత వ్యక్తం చేయడంకంటే ముందే... తమ సొంత పార్టీతోపాటు బీజేపీ నేతలతోనూ అధికారాన్ని పంచుకోవడంపై చర్చిస్తామని తెలిపారు. ఈ ఫలితం చాలామందికి 'కనువిప్పు'గా అభివర్ణించారు.

### మేమే... నేనే: ఫడణవీస్

సీట్లు కాస్త తగ్గినంత మాత్రాన తగ్గిఉండే ప్రసక్తే లేదని మిత్రపక్షం శివసేనకు బీజేపీ స్పష్టమైన సంకేతాలు పంపింది. అధికారం పంచుకోవాలన్న ఉద్ధవ్ ఠాక్రేకు 'అదేం కుదరదు... ఆ అవసరం రాదు' అని సీఎం దేవేంద్ర ఫడణవీస్ పరోక్షంగా తేల్చిచెప్పారు. బీజేపీ టికెట్లు రాకపోవడంతో రెబల్స్‌గా పోటీచేసి గెలిచిన వారిలో 15 మంది తమతో 'టచ్'లో ఉన్నారని చెప్పారు. అంతే కాదు... అధిష్ఠానం నుంచి ప్రకటన రాక ముందే, తానే సీఎం అని చెప్పుకొచ్చారు. మహారాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా... ఒక ప్రభుత్వం, ముఖ్యమంత్రి తిరిగి అధికారంలోకి వస్తున్నట్లు తెలిపారు.

### పాపం పంకజా ముండే!

**ఓటమి భారంతో కన్నీరు మున్నీరు**

బీజేపీ దివంగత నేత గోపీనాథ్ ముండే కుమార్తె, మహారాష్ట్ర మంత్రి పంకజా ముండే ఓటమిపాలయ్యారు. ఆమె పోటీ చేసిన పర్లీ నియోజకవర్గంలో ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా కూడా ప్రచారం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. సమీప బంధువైన ఎన్సీపీ నేత ధనుంజయ్ ముండే చేతిలోనే పంకజ ఓటమిపాలయ్యారు. పరాజయాన్ని తట్టుకోలేక కన్నీరు మున్నీరయ్యారు. .

### ఇప్పుడేం జరుగుతుంది?

బీజేపీని అధికారం నుంచి దూరం చేసేందుకు... శివసేనకు ఎన్సీపీ మద్దతు ఇచ్చే అవకాశాలపై ఊహాగానాలు వెలువడ్డాయి. కానీ, తాము విపక్షంలోనే ఉంటామని శరద్ పవార్ స్పష్టం చేశారు. శివసేనతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోమని తెలిపారు. మరోవైపు... తాము బీజేపీతో కలిసి పోటీ చేశామని, విపక్షం మద్దతు తీసుకునేది లేదని శివసేన సీనియర్ నేత సంజయ్ రౌత్ ప్రకటించారు. ముఖ్యమంత్రి పీఠాన్ని పంచుకునేందుకు బీజేపీ అంగీకరిస్తుందా? 'ససేమిరా' అంటే ఉద్ధవ్ ఠాక్రే ఏం చేస్తారన్నది ప్రస్తుతానికి సస్పెన్స్!

## పవార్ పడి లేచిన కెరటం..

- అలుపెరుగని యోధుడు శరద్‌పవార్
- మహారాష్ట్రలో పార్టీకి పునర్వైభవం



ఏడెనిమిది నెలల కిందటి మాట! ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు సంగతి!! మరాఠా యోధుడుగా.. 38 ఏళ్లకే సీఎం పీఠాన్ని అధిష్ఠించిన నేతగా చరిత్ర సృష్టించిన శరద్‌పవార్.. 'కాలికి బలపం కట్టుకుని' అన్న సామెత చందంగా విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. 78 ఏళ్ల వయసులో.. 78 బహిరంగ సభల్లో పాల్గొన్నారు!! అంత కష్టపడితే.. చివరికి ఆయన పార్టీ(ఎన్సీపీ)కి ఆ ఎన్నికల్లో వచ్చిన సీట్లు కేవలం నాలుగు! 'ఇంకేముందీ.. పవార్ పని అయిపోయింది' అని అంతా అనుకున్నారు. అందరూ అలా అనుకున్నారుగానీ.. పవార్ మాత్రం అనుకోలేదు. ఒకటా రెండా.. ఐదు దశాబ్దాలకు పైబడిన రాజకీయ అనుభవం ఆయనది! అందుకే.. లోక్‌సభ ఎన్నికల ఫలితాల నిరాశను అక్కడే వదిలిపెట్టి.. అసెంబ్లీ ఎన్నికలకు ప్రణాళికలు రచించడం మొదలుపెట్టారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో దాదాపు సమానంగా 60 బహిరంగ సభల్లో పాల్గొన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే.. ప్రతిపక్ష ప్రచారాన్నంతా ఒంటిచేత్తో అంతా తానై నడిపించారు. ఎన్సీపీకి కంచుకోట అయిన పశ్చిమ మహారాష్ట్రలో సత్తా చాటారు. 2014లో తమ పార్టీకి వచ్చిన 41 సీట్లకు మించి ఈసారి సాధించారు. పట్టుదలతో సాధించలేనిది లేదని.. పోరాడటానికి వయసు అడ్డంకి కాదని.. నిరూపించారు.



## అసెంబ్లీలోకి.. తొలి 'ఠాక్రే'

బాల్ ఠాక్రే.. ఆయన మేనల్లుడు రాజ్ ఠాక్రే.. కుమారుడు ఉద్ధవ్ ఠాక్రే.. ఇలా ముంబై రాజకీయాలను 'ఠాక్రే'లు చాలాకాలంగా శాసిస్తున్నారు. కానీ, వీరిలో ఎవరూ ఇంతవరకూ ఒక్కసారి కూడా అసెంబ్లీలో అడుగుపెట్టి 'అధ్యక్షా' అనలేదు! తొలిసారిగా ఒక 'ఠాక్రే' మహారాష్ట్ర శాసనసభలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యాడు. ఆయనే.. శివసేన యువ విభాగమైన 'యువసేన' అధిపతి.. ఆదిత్య ఠాక్రే(29)!! ముంబైలోని వర్లి నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీతో గెలిచిన ఆదిత్యఠాక్రేను డిప్యూటీ ముఖ్యమంత్రిగా చూడాలని ఆయన తండ్రి ఉద్ధవ్ ఠాక్రే ముచ్చటపడుతున్నారు. ఆంగ్ల సాహిత్యంలో, న్యాయశాస్త్రంలో పట్టభద్రుడైన ఆదిత్య.. చిన్నప్పటి నుంచీ రాజకీయాలపై ఆసక్తి పెంచుకున్నారు. ప్లాస్టిక్‌పై నిషేధం విధించాలన్న మహారాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి కారకుల్లో ఆదిత్య కూడా ఒకరు. మహారాష్ట్ర యువత ఓట్లను ఆకర్షించేందుకు ఆదిత్య వినూత్నమైన ప్రతిపాదన చేశారు. ముంబైలో మాల్స్‌ను, రెస్టారెంట్లను రాత్రంతా తెరిచి ఉంచాలన్న ఆయన ప్రతిపాదనను బృహన్ముంబై మునిసిపల్ కార్పొరేషన్ ఆమోదించింది కూడా. ఇది యువతను బాగా ఆకట్టుకుంది. ఫొటోగ్రఫీ, కవిత్వం వంటి అభిరుచులతో నేటి తరం యువతను ఆకట్టుకున్న ఆదిత్యఠాక్రే.. ఎమ్మెల్యేగా ఎలా వ్యవహరిస్తారో చూడాలని యావత్ మహారాష్ట్ర ఎదురుచూస్తోందంటే అతిశయోక్తి కాదు.

# కాంగ్రెస్‌కు కొత్త టానిక్

- ఖేల్ ఖతం అనుకున్న టైంలో అనూహ్య విజయం
- పాత తరమే గెలిపిస్తోందన్న అభిప్రాయాలు
- ధాటిగా ప్రచారం చేసుంటే మరిన్ని సీట్లు

న్యూఢిల్లీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అక్బర్ రోడ్డులో కాంగ్రెస్ కార్యాలయం... ఐదు నెలల కిందట- లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డ రోజు.. నిస్తేజంగా, నిశ్శబ్దంగా, దాదాపు నిర్మానుష్యంగా ఉంది. నేతలెవరూ ఆ ఛాయలకే రాలేదు. పార్టీ చరిత్రలోనే విని ఎరుగని ఘోర పరాజయంతో కాంగ్రెస్ పార్టీ పని పరిసమాప్తం అనుకున్నారు. తదనంతర పరిణామాలూ ఆ దిశగానే సాగాయి. పార్టీ అధ్యక్షుడుగా ఉన్న రాహుల్ గాంధీ నైతిక బాధ్యత పేరుతో కాడి వదిలేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న సోనియాకే మళ్లీ పగ్గాలందాయి. దేశవ్యాప్తంగా దిశానిర్దేశం లేక కాంగ్రెస్ శ్రేణులు నిరాశలో మునిగాయి. కానీ గురువారం పార్టీ ఆఫీసు మళ్లీ కళకళలాడుతూ కనిపించింది. మహారాష్ట్ర, హరియాణాల్లో ఫలితాలు పార్టీకి కొత్త ఊపిరులూదాయి.

### ఓడించిన కేంద్ర నాయకత్వం..!

కాంగ్రెస్‌ను ఓడించినది ఆ పార్టీ కేంద్ర నాయకత్వమేనన్న బలమైన అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. లోక్‌సభ ఎన్నికల తరువాత పార్టీకి చెందిన పలువురు నేతలు బీజేపీలోకి దూకేయడం, సరైన నాయకుడు లేకపోవడంతో ఆ పార్టీ నేతలు శక్తియుక్తులతో పోరాడలేకపోయారు. ఆ సమయంలో ధైర్యంగా ముందుండి నడిపించాల్సిన హైకమాండ్ నిష్క్రియగా ఉండిపోయిందన్న ఆరోపణలు ఉన్నాయి. సోనియాగాంధీ, ప్రియాంకాగాంధీ అసలు ప్రచారంలో పాల్గొనకపోగా, రాహుల్ గాంధీ నామ్‌కే వాస్తేగా కేవలం అయిదు సభల్లోనే పాల్గొన్నారు. అటు పక్క మోదీ ఆరు సభల్లో, అమిత్ షా 25 బహిరంగ సభల్లో పాల్గొని ప్రచారం నిర్వహించారు. ఇక కాంగ్రెస్ చిరకాల మిత్రపక్షమైన- శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ అయితే ఇవే చివరి ఎన్నికలన్నట్లుగా చావో రేవో అన్న రీతిలో పోరాడింది. చివరి ఎన్నికల సభలో భారీ వర్షాన్ని కూడా లెక్కచేయకుండా 78 ఏళ్ల ముదిమిలో శరద్ పవార్ ప్రచారం చేశారు. దీనితో పశ్చిమ మహారాష్ట్రలో సమీకరణాలు మారిపోయాయి. అది పవార్‌కు కంచుకోట. పుణె, సతారా, సాంగ్లీ, షోలాపూర్, కొల్హాపూర్ అనే ఐదు జిల్లాల్లోని 58 సీట్లలో సింహభాగం అంటే 31 సీట్లు ఎన్సీపీ-కాంగ్రెస్ వశమయ్యాయి. మరాఠాలంతా ఎన్సీపీకి ఓటు వేశారు. పవార్ పోరాడి ఉండకపోతే కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోయి ఉండేదన్న వాదనలూ ఉన్నాయి.



నాగ్‌పూర్‌లో మహిళా కాంగ్రెస్ కార్యకర్తల సంబురం

### భూపీందర్‌సింగ్ హుడా విషయంలో తప్పటడుగు..!

భూపీందర్‌సింగ్ హుడా విషయంలో కాంగ్రెస్ అధినాయకత్వం చేసిన పొరపాటుకు భారీమూల్యమే చెల్లించుకుంది. గత ఎనిమిది నెలలుగా పార్టీ ఆయనను దూరం పెట్టింది. అశోక్ తన్వర్ అనే ఓబీసీకి పగ్గాలు ఇచ్చింది. లోక్‌సభ ఎన్నికల్లో పదికి పది సీట్లలో ఓడిపోవడంతో ఆయన నిష్క్రమించారు. పోస్ట్‌మార్టం సమయంలో గులాంనబీ ఆజాద్ సమక్షంలోనే బాహాబాహీ జరిగింది. చివరకు దళిత నేత సెల్జాకు పగ్గాలు అందించారు. దీంతో హుడా అలిగి పార్టీనుంచి వైదొలుగుతానని బెదిరించారు. ఆయనకు అతి కష్టంమీద నచ్చచెప్పి ప్రచార సారథ్యం ఇప్పించారు. చివరకు ఆయనే పార్టీకి పెద్ద దిక్కుగా మారి పార్టీని నిలబెట్టారు. ఆర్నెల్ల ముందే హుడాకు సారథ్యం ఇచ్చి ఉండుంటే హర్యానా గెలిచి ఉండేవారమని ఆజాద్ కూడా ఒప్పుకున్నారు. మొత్తం మీద- పార్టీని సంక్షోభ సమయంలో నిలబెడుతున్నది సీనియర్లేనన్న వాదన ఇపుడు తెరపైకొచ్చింది. భూపీందర్ హుడా, అశోక్ గెహ్లాట్, కమల్‌నాథ్, కెప్టెన్ అమరీందర్ సింగ్... ఇలా అందరూ సీనియర్లేనని, రాహుల్‌గాంధీ పట్టుబడుతున్న యువనాయకత్వం ఇంకా పార్టీని ఒంటి చేత్తో గెలిపించే స్థాయికి రాలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## పతంగి ప్రతాపం

- మహారాష్ట్రలో కాంగ్రెస్ కూటమికి ఎంఐఎం చెక్
- పాత సీట్లు కోల్పోయినా 2 కొత్త స్థానాల్లో గెలుపు
- బిహార్‌లోని కిషన్‌గంజ్‌లో తొలిసారి పాగా

న్యూఢిల్లీ, అక్టోబరు 24: తమ వర్గ ప్రాబల్య ప్రాంతాల్లో పాగా వేయడమే లక్ష్యంగా కొన్నాళ్ల నుంచి ప్రయత్నాలు చేస్తున్న ఆలిండియా మజ్లిస్- ఎ-ఇత్తెహదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) పార్టీ తాజా ఎన్నికల్లో మరింత బలం చాటుకుంది. మహారాష్ట్రలో భారీగా ఓట్లు చీల్చి కాంగ్రెస్-ఎన్సీపీ కూటమిని కోలుకోలేని దెబ్బకొట్టిన మజ్లిస్.. 2014 ఎన్నికల తరహాలోనే ఈసారీ రెండు స్థానాలు సాధించింది. అయితే, ఈ రెండూ కొత్త స్థానాలే కావడం గమనార్హం. సిట్టింగ్ సీట్లైన ఔరంగాబాద్ సెంట్రల్, బైకుల్లాలను శివసేనకు కోల్పోయిన ఆ పార్టీ.. ఈసారి ధూలె సిటీ, మాలెగావ్ సెంట్రల్‌లో గెలుపొందింది. మరోవైపు మహారాష్ట్ర ధూలె సిటీ, మాలెగావ్ సెంట్రల్‌లలో గెలుపొందిన ఎంఐఎం పదుల సంఖ్యలో నియోజకవర్గాల్లో ఓట్లను చీల్చి కాంగ్రెస్ కూటమిని ఓటమి పాలయ్యేలా చేసింది. ఇక బిహార్ రాష్ట్రం కిషన్‌గంజ్ ఉప ఎన్నికలో విజయం సాధించి ఆశ్చర్యపర్చింది. ఇక్కడినుంచి మజ్లిస్ అభ్యర్థి ఖమ్రుల్ హొదా.. 10,204 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. 'గాలిపటం' దెబ్బకు రెండు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ పార్టీనే బాధితురాలిగా మిగిలింది. రాజ్యాంగబద్ధ హక్కులను ప్రస్తావిస్తూ అసదుద్దీన్ చేసిన ఆవేశపూరిత ప్రసంగాలు ముస్లిం యువతను తీవ్రంగా ప్రభావితం చేశాయని, ఆ పార్టీ విస్తరణకు ఇదే కారణమని విశ్లేషకులు చెబుతున్నారు.

### ఎప్పుడూ మోదీ హవాపైనే గెలవాలంటే కుదరదు: ఒవైసీ



హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడూ ప్రధాని మోదీ హవాపైనే గెలవాలంటే కుదరదన్న విషయం బీజేపీకి ఇప్పుడు తెలిసొచ్చి ఉంటుందని అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. హరియాణాలో ప్రధాని మోదీ 12 నుంచి 15 ర్యాలీలు నిర్వహించినా ఫలితం దక్కలేదన్నారు. మహారాష్ట్రలో క్లీన్‌స్వీప్ చేస్తామని చెప్పుకున్నా ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిందని చెప్పారు. ఇప్పటికైనా ఆర్థిక రంగం, గ్రామీణ భారతంపై దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో బీజేపీ పని అయిపోయిందని, హుజూర్‌నగర్‌లో ఆ పార్టీకి స్వతంత్ర అభ్యర్థికి వచ్చినన్ని ఓట్లు కూడా రాలేదన్నారు. కాంగ్రెస్ గ్రాఫ్ కూడా తగ్గిందన్నారు. టీఆర్ఎస్‌కు అభినందనలు తెలిపారు.

# మేము పక్కా లోకల్!

## రాష్ట్రాల్లో పనిచేయని జాతీయ అంశాలు

- మారుతున్న ఓటర్ల సరళి
- అసెంబ్లీలో రాష్ట్ర అంశాలకే ప్రాధాన్యం
- పెద్దగా పనిచేయని భావోద్వేగ అంశాలు
- బీజేపీ అంచనాల తారుమారుకు కారణమిదే

**ఐదు నెలల్లో పరిస్థితులు ఎందుకు మారిపోయాయి..? నాడు మోదీ మేజిక్‌తో అఖండ మెజారిటీ.. మరి నేడు? లోతుగా ఆలోచిస్తే వీటికి సమాధానాలు సుస్పష్టం... దేశ ఓటర్ల ఆలోచనలు మారుతున్నాయి. పార్లమెంటుకు, అసెంబ్లీకి వారి ప్రాధామ్యాలు మారిపోతున్నాయి. కీలక జాతీయ అంశాలను వారు అసెంబ్లీ ఎన్నికల్లో పట్టించుకోవడం లేదన్న విషయం తాజా ఎన్నికల్లో నిరూపితమైంది.**



న్యూఢిల్లీ, అక్టోబర్ 24(ఆంధ్రజ్యోతి): ఆర్టికల్ 370, పాకిస్థాన్, ఉగ్రవాదం, దేశ భద్రత, జాతీయవాదం.. .... మొదలైన భావోద్వేగ పరమైన అంశాలపైనే బీజేపీ నాయకత్వం ప్రధానంగా ఆధారపడింది. మహారాష్ట్ర, హరియాణా రెండు చోట్లా అవి పూర్తిగా పనిచేయలేదు. పార్లమెంటు వేరు.. రాష్ట్రం వేరు అన్న సరళి ఈ ఏడాది ఒడిసా ఎన్నికల సమయంలోనే కనపడింది. ఇపుడు మళ్లీ వ్యక్తమైంది. రెండు చోట్లా నిరుద్యోగ సమస్య ప్రబలంగా ఉంది. రైతులు రోడ్లెక్కి రోజుల తరబడి నిరసన సాగించిన సందర్భాలున్నాయి. వీటికి తోడు రియల్ ఎస్టేట్, ఆటోమొబైల్ పరిశ్రమతో పాటు అనేక రంగాలు ఆర్థికంగా దెబ్బతినడం..! వీటి కారణంగానే రెండు రాష్ట్రాల్లో బీజేపీకి అనుకున్న విధంగా ఫలితాలు రాలేదని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా, వ్యవసాయ పరంగా దేశంలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ రెండు రాష్ట్రాల్లో స్థానిక అంశాలను రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయనీ, కేవలం మోదీ మేజిక్ గెలిపిస్తుందన్న మితిమీరిన ఆత్మవిశ్వాసం కొంపముంచిందని పార్టీ వర్గాలు విశ్లేషించాయి.

### ఓటమికి కారణాలివీ..!

- పిడుక్కీ- బియ్యానికీ ఒకే మంత్రం పనిచెయ్యదు. భావోద్వేగం, జాతీయవాద అంశాలకు ఇప్పటికే ఓసారి అంటే లోక్‌సభ ఎన్నికల్లో ఓటేశాం.. ఇక ఇప్పుడు రోజువారీ సమస్యల పరిష్కారం ముఖ్యం అని ఓటర్లు భావిస్తున్నారు
- మోదీ మేజిక్ వన్నె తగ్గలేదు. 2014 ఎన్నికల తరువాత రాష్ట్రం తర్వాత రాష్ట్రం... అలా 20 రాష్ట్రాల్లో ఆయన కోరుకున్న వ్యక్తులకే ఓటేశారు. ఆయన ఎంపిక చేసిన వారినే సీఎంలుగా ఆమోదించారు. కానీ మోదీ తరహాలో వారు ప్రజలను మెప్పించలేకపోయారు.
- అమిత్ షా సామాజిక ఇంజినీరింగ్ పనిచేయలేదు.. లోక్‌సభ ఎన్నికల్లో మోదీకి పట్టం కట్టిన జాట్లు అసెంబ్లీ వచ్చేసరికి తమను మొదట అక్కున చేర్చుకున్న కాంగ్రెస్, ఐఎన్ఎల్‌డీల వైపు మొగ్గారు. నాన్ జాట్‌లు కూడా చీలిపోయారు. దీంతో మోదీ మేజిక్ ఉంటేనే సోషల్ ఇంజినీరింగ్ కూడా తోడై మంచి ఫలితాలొస్తాయన్నది స్పష్టమవుతోంది.
- ఆర్థిక నిర్వహణ అధ్వాన్నం. వేల మంది ఉపాధిలేక ఇబ్బందులు పడడమే కాదు అంతే సంఖ్యలో ఉద్యోగాలు పోతున్నవారూ ఉన్నారు. జీడీపీ పడిపోయింది. సగటు జీవికి సాంత్వన నిచ్చే ఆర్థిక విధానాల్లేవు
- ఎన్నికల ముంగిట రాజకీయ ప్రత్యర్థులను అవినీతికేసుల్లో ఇరికించి కేసులతో వేధించడం ప్రతికూల సంకేతాలు పంపుతోంది. శరద్‌పవార్‌ను ఇరికించాలన్న యత్నం బెడిసికొట్టడమే దీనికి ఉదాహరణ.

# జంబోని దాదా ఆపేవాడు

**కుంబ్లే x కోహ్లీ వివాదం..**



సీఓఏ మాజీ చీఫ్ వినోద్ రాయ్

**న్యూఢిల్లీ:** రెండేళ్ల కిందట.. నాటి కోచ్ అనిల్ కుంబ్లే, కోహ్లీ మధ్య విభేదాలు భారత క్రికెట్‌ను ఓ కుదుపు కుదిపాయి. అయితే 2017 చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ అనంతరం జంబో తన పదవికి రాజీనామా చేయడంతో వివాదం సమసింది. కుంబ్లే-కోహ్లీ విభేదాలను నాటి క్రికెట్ పాలక కమిటీ సైతం పరిష్కరించలేకపోయింది. అయితే సౌరవ్ గంగూలీ కనుక అప్పుడు బీసీసీఐ అధ్యక్షుడిగా ఉండివుంటే ఆ సమస్యను తనదైన శైలిలో పరిష్కరించేవాడని రద్దయిన సీఓఏ చీఫ్ వినోద్ రాయ్ అభిప్రాయపడ్డారు. 'కుంబ్లే-కోహ్లీ మధ్య వివాదాన్ని సరిగ్గా పరిష్కరించలేదన్న విమర్శలు వెల్లువెత్తాయి. కానీ ఆ వివాదం కనుక నేడు చోటుచేసుకొని ఉంటే అధ్యక్షుడిగా గంగూలీ బలవంతంగానైనా కుంబ్లేని కొనసాగిస్తాడు' అని ఆయన అన్నారు. కుంబ్లేతో సర్దుకుపోయేలా కోహ్లీని క్రికెట్ సలహా కమిటీ సభ్యులైన సచిన్, గంగూలీ ఒప్పించలేకపోయారని వెల్లడించారు. 'చాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా బర్మింగ్‌హామ్‌లో సచిన్‌ను కలిశా. తర్వాత గంగూలీతోనూ మాట్లాడా. అప్పటికే విరాట్‌తో సుదీర్ఘంగా మాట్లాడిన విషయాన్ని వారిద్దరికీ తెలిపా. వారే కోహ్లీని ఒప్పించలేకపోయినప్పుడు నా వల్ల అవుతుందా ? కెప్టెన్, కోచ్ మధ్య విభేదాలు తలెత్తితే తొలగించాల్సింది కోచ్‌నే కదా. అక్కడే దొరికిపోయాం' అని రాయ్ వివరించారు. కోహ్లీ, శాస్త్రిలకు స్వేచ్ఛ ఇవ్వడంపై మాట్లాడుతూ.. 'సారథికి, కోచ్‌కుగాక ఎవరికి స్వేచ్ఛ ఇస్తాం' అని రాయ్ ఎదురు ప్రశ్నించారు.



కుంబ్లే-కోహ్లీ

## తొలి మ్యాచ్‌లో శ్రీలంకతో భారత్ ఢీ

● అండర్-19 వరల్డ్‌కప్ షెడ్యూల్ విడుదల

**దుబాయ్:** అండర్-19 వరల్డ్‌కప్‌లో తమ తొలి మ్యాచ్‌లో శ్రీలంకతో డిఫెండింగ్ చాంప్ భారత్ తలపడనుంది. దక్షిణాఫ్రికాలో వచ్చే ఏడాది జనవరి 17 నుంచి ఫిబ్రవరి 9 వరకు జరగనున్న జూనియర్ వరల్డ్‌కప్ షెడ్యూల్‌ను ఐసీసీ విడుదల చేసింది. ఆరంభ మ్యాచ్‌లో అఫ్ఘానిస్థాన్‌తో ఆతిథ్య దక్షిణాఫ్రికా ఆడనుంది. 19న శ్రీలంక, 21న జపాన్, 24న న్యూజిలాండ్‌తో భారత్ తలపడనుంది. గ్రూప్-ఎలో భారత్, న్యూజిలాండ్, శ్రీలంక, జపాన్ జట్లు ఉన్నాయి.

## బంగ్లా ఆటగాళ్ల సమ్మె విరమణ

**ఢాకా:** వేతనాల పెంపుతో పాటు పలు డిమాండ్ల కోసం సమ్మె బాట పట్టిన బంగ్లాదేశ్ ఆటగాళ్లు శాంతించారు. బుధవారం షకీబల్ నేతృత్వంలోని క్రికెటర్లు సమ్మె విరమిస్తున్నట్టు ప్రకటించారు. దీంతో భారత్ టూర్‌కు అడ్డంకులు తొలగిపోయాయి.

# విరాట్‌కు విశ్రాంతి

**కొంతకాలంగా నిరంతరాయంగా క్రికెట్ ఆడుతున్న కెప్టెన్ విరాట్ కోహ్లీకి ఊహించినట్టుగానే విశ్రాంతి లభించింది.. అతడి స్థానంలో పొట్టి ఫార్మాట్‌లో రోహిత్ శర్మ జట్టును నడిపించనున్నాడు.. అలాగే దేశవాళీ క్రికెట్‌లో సత్తా చాటుతున్న కేరళ స్టార్ బ్యాట్స్‌మన్ సంజూ శాంసన్ సుదీర్ఘ కాలం తర్వాత బెర్త్ దక్కించుకోగా ముంబై ఆల్‌రౌండర్ శివమ్ దూబే తొలిసారి జట్టులోకి వచ్చాడు.. ఈమేరకు బంగ్లాదేశ్‌తో సిరీస్‌కు సెలెక్టర్లు టీ20, టెస్టు జట్లను ప్రకటించారు.. సుదీర్ఘ ఫార్మాట్‌లో దక్షిణాఫ్రికాతో ఆడిన జట్టునే కొనసాగించారు..**

టీ-20 టీమ్
**ఇన్:** సంజూ శాంసన్, శివమ్ దూబే, శార్దూల్ ఠాకూర్, యజ్వేంద్ర చాహల్
**రెస్ట్:** కోహ్లీ, రవీంద్ర జడేజా, హార్దిక్ పాండ్యా, నవదీప్ సైనీ



టీమిండియా ఎంపిక సమావేశంలో సెలెక్టర్లతో గంగూలీ, ఎమ్మెస్కే ప్రసాద్, కోహ్లీ, రోహిత్ శర్మ

**రోహిత్‌కు పగ్గాలు**

● సంజూకు పిలుపు ● శివమ్ దూబేకు చోటు
● బంగ్లాదేశ్‌తో సిరీస్‌కు జట్ల ప్రకటన

**ముంబై:** స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ బంగ్లాదేశ్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. పలు డిమాండ్లతో చేస్తున్న బంగ్లా ఆటగాళ్ల సమ్మె ముగియడంతో భారత్‌లో ఆ జట్టు పర్యటనకు లైన్ క్లియర్ అయింది. దీంతో ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలోని జాతీయ సెలెక్షన్ కమిటీ బంగ్లాతో ఆడే భారత టీ20, టెస్టు జట్లను గురువారం ప్రకటించింది. నవంబరు 3న న్యూఢిల్లీలో తొలి టీ20, 7న రాజ్‌కోట్‌లో, 10న నాగ్‌పూర్‌లో మిగిలిన రెండు మ్యాచ్‌లు జరుగుతాయి. రెగ్యులర్ కెప్టెన్ విరాట్ కోహ్లీకి పొట్టి ఫార్మాట్ నుంచి విశ్రాంతి కల్పించారు. టెస్టు జట్టులో పెద్దగా మార్పులు లేకపోయినా.. టీ20లో తొలిసారిగా ముంబై ఆల్‌రౌండర్ శివమ్ దూబేకు బెర్త్ దక్కింది. భారత్ 'ఎ' జట్టు తరపున అతడు అద్భుత ప్రదర్శనతో సెలెక్టర్లను ఆకట్టుకున్నాడు. అలాగే కేరళ యంగ్ బ్యాట్స్‌మన్ సంజూ శాంసన్ కల నాలుగేళ్ల తర్వాత నెరవేరింది. 2015లో జింబాబ్వేపై అతడు ఏకైక టీ20 మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత ఐపీఎల్‌లో, దేశవాళీల్లో చక్కటి ఆటతీరును కనబరుస్తున్నా జాతీయ జట్టులోకి రాలేకపోయాడు. భారత్ 'ఎ' జట్టులో నిలకడగా రాణించే శాంసన్ ఇటీవలి విజయ్ హజారే ట్రోఫీలో ఏకంగా డబుల్ సెంచరీతో మెరవడంతో పాటు ఓవరాల్‌గా ఎనిమిది ఇన్నింగ్స్‌ల్లో 125 స్ట్రయిక్



శివమ్ దూబే

రేట్‌తో 410 పరుగులు సాధించాడు. దీంతో అతడికో అవకాశం కల్పించాలని సెలెక్షన్ కమిటీ భావించింది. ఇక వెన్నెముకకు శస్త్ర చికిత్స చేయించుకున్న డాషింగ్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పేరు చర్చకు రాలేదు. అతడి స్థానంలో 26 ఏళ్ల శివమ్ దూబేకు చోటిచ్చారు. దీంతో



సంజూ శాంసన్

**టెస్టు జట్టు:** దక్షిణాఫ్రికాతో సిరీస్ ఆరంభంలో ప్రకటించిన 15 మంది సభ్యుల జట్టే కొనసాగింపు

విజయ్ శంకర్ స్థానం గల్లంతైంది. 'గతంలో హార్దిక్ ఉన్నప్పుడు రెండో ఆల్‌రౌండర్‌గా విజయ్ శంకర్‌ను ఎంపిక చేశాం. అయితే ఇప్పుడు ఆ స్థానంలో శివమ్ దూబే సరైన ఆటగాడని భావించాం. దూకుడుగా ఆడే దూబే భారత్ 'ఎ' తరపున విండీస్ టూర్‌లో, దక్షిణాఫ్రికాపైనా సత్తా చాటాడు' అని చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే తెలిపాడు. ఇక ఆల్‌రౌండర్ జడేజాకు విశ్రాంతినివ్వగా స్పిన్నర్ చాహల్ మళ్లీ జట్టులోకి వచ్చాడు. ఫిట్‌నెస్ సమస్యలతో పేసర్ సైనీ స్థానంలో శార్దూల్ ఠాకూర్‌ను ఎంపిక చేశారు.

**టెస్టులకు అదే జట్టు..**

బంగ్లాదేశ్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్‌కు ప్రకటించిన జట్టులో సెలెక్టర్లు ఎలాంటి మార్పులూ చేయలేదు. కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ వ్యవహరిస్తాడు. ప్రపంచ టెస్టు చాంపియన్‌షి‌ప్‌లో భాగంగా జరిగే ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ ఇండోర్‌లో నవంబరు 14 నుంచి 18 వరకు, కోల్‌కతాలో 22 నుంచి 26 వరకు రెండో టెస్టు జరుగుతుంది. కానీ సఫారీలతో జరిగిన రాంచీ టెస్టులో 4వికెట్లు తీసిన అరంగేట్రం స్పిన్నర్ నదీమ్‌ను సెలెక్టర్లు పక్కనబెట్టారు. వాస్తవంగా దక్షిణాఫ్రికాతో సిరీస్‌కు ఎంపిక చేసిన 15 మంది జట్టులో నదీమ్ లేడు. కుల్దీప్ గాయపడడంతో రీప్లేస్‌మెంట్‌గా మాత్రమే ఆ మ్యాచ్‌లో ఆడాడు.

**టీ20 జట్టు**

రోహిత్ (కెప్టెన్), ధవన్, రాహుల్, సంజూ శాంసన్, శ్రేయాస్ అయ్యర్, మనీశ్ పాండే, రిషభ్ పంత్, వాషింగ్టన్ సుందర్, క్రునాల్ పాండ్యా, చాహల్, రాహుల్ చాహర్, దీపక్ చాహర్, ఖలీల్ అహ్మద్, శివమ్ దూబే, శార్దూల్ ఠాకూర్.

**టెస్టు జట్టు**

కోహ్లీ (కెప్టెన్), రోహిత్, మయాంక్, పుజార, రహానె, విహారి, సాహా, జడేజా, అశ్విన్, కుల్దీప్ యాదవ్, షమి, ఉమేశ్ యాదవ్, ఇషాంత్, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్.

## హైదరాబాద్ ఎఫ్‌సీలోకి రానా



**హైదరాబాద్:** హీరో దగ్గుబాటి రానా ఐఎస్ఎల్ ఫ్రాంచైజీ హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ సహ యజమానిగా చేరాడు. ఈ జట్టు యజమానులైన వరుణ్ త్రిపురనేని, విజయ్ మద్దూరిలనుంచి తాజాగా రానా వాటాలు తీసుకున్నారు. కాగా ఈనెల 20న మొదలైన ఇండియన్ సూపర్ లీగ్‌లో హైదరాబాద్ ఎఫ్‌సీ అరంగేట్రం చేసింది.

## యోగేశ్వర్, బబిత పరాజయం

**హరియాణా అసెంబ్లీ ఎన్నికలు**



యోగేశ్వర్ | బబిత

**చండీగఢ్:** అంతర్జాతీయ రెజ్లర్లు యోగేశ్వర్ దత్, బబితా ఫొగట్‌లకు ఎన్నికల సమరాంగణంలో 'పట్టు' చిక్కలేదు. ఇటీవలే బీజేపీలో చేరి హరియాణా అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగిన యోగేశ్వర్, బబిత పరాజయం చవిచూశారు. చర్ఖిదాద్రి అసెంబ్లీ స్థానంలోనైతే బబితా కనీస పోటీ కూడా ఇవ్వలేకపోయింది. బబిత (24,786 ఓట్లు) మూడో స్థానంలో నిలవడం గమనార్హం. సోనెపట్ జిల్లాలోని బరోడా సెగ్మెంట్‌లో కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రీకృష్ణ హుడా చేతిలో యోగేశ్వర్ దత్ 4,840 ఓట్ల తేడాతో ఓడిపోయాడు. అయితే పెహోవా నియోజకవర్గంలో బీజేపీ తరపున పోటీచేసిన భారత హాకీ జట్టు మాజీ కెప్టెన్ సందీప్‌సింగ్ 5,314 ఓట్ల తేడాతో కాంగ్రెస్‌కు చెందిన మన్‌దీప్ సింగ్‌పై విజయం సాధించాడు.

## క్వార్టర్స్‌లో సింధు, సైనా

**ఫ్రెంచ్ ఓపెన్**

**పారిస్:** ఇటీవలి టోర్నీల్లో నిరాశపరుస్తున్న భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ఫ్రెంచ్ ఓపెన్‌లో క్వార్టర్స్ ఫైనల్లో ప్రవేశించింది. ఆమెతో పాటు సైనా నెహ్వాల్, పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ కూడా క్వార్టర్స్‌కు వెళ్లింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రపంచ చాంపియన్ సింధు 21-10, 21-13 తేడాతో 34 నిమిషాల్లోనే యియో జియా (సింగపూర్)ను చిత్తుగా ఓడించింది. మరోవైపు వరుసగా మూడు టోర్నీల్లో తొలి రౌండ్‌కే పరిమితమైన సైనా నెహ్వాల్ తన పేలవ ఫామ్‌కు చెక్ పెడుతూ 21-10, 21-11 తేడాతో లైన్ హోజ్‌మార్క్ జేర్స్‌ఫెల్ట్ (డెన్మార్క్)పై సునాయాసంగా నెగ్గింది.

**సాత్విక్ జోడీ సంచలనం:** పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ సంచలన ఆటతీరుతో అదరగొట్టింది. వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో విజేతలుగా నిలిచిన మహ్మద్ ఎహ్‌సాన్-సెతియవాన్ (ఇండోనేసియా)లపై 21-18, 18-21, 21-13 తేడాతో సాత్విక్-చిరాగ్ గెలిచారు.







Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.

epaper.andhrajyothy.com